ఆదివారం
గత సంచికలోని విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

11-7-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 160 పేజీలు: 10+4 వెల: 6.50


## బీహార్ ఓటరు జాబితా సవరణకు సుప్రీం ఓకే

## బ్రెజిల్ సహా 8 దేశాలపై ట్రంప్ భారీగా సుంకాలు

5లో

# విప్లవాత్మక మార్పులతో నాణ్యమైన విద్య

### కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు

### టీచర్లతోపాటు తల్లిదండ్రులకూ కీలకపాత్ర

### గురుపూర్ణిమ సందర్భంగా 61 వేల స్కూళ్లలో పేరెంట్, టీచర్ మీట్

### కొత్తచెరువులో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ. 2 కోట్లు: సిఎం చంద్రబాబు



గురువారం కొత్తచెరువులో జరిగిన మెగా పిటిఎం సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. చిత్రంలో మంత్రి లోకేష్

**శ్రీ సత్య సాయి జిల్లా, జులై 10, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రస్తుత ఆధునిక కాలానికి అనుగుణంగా విప్లవాత్మకమైన మార్పులతో నాణ్యమైన విద్యను అందించడమే ఎన్డీఎ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గురువారం శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు మండల కేంద్రంలోని శ్రీ సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్ టీచర్స్ మీట్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలాలను తీర్చి దిద్దుతామన్నారు. గురుపౌర్ణమి రోజున రాష్ట్ర వ్యాప్తంగా 61 వేల పాఠశాలల్లో 2.28 కోట్ల మందితో ఈ సమావేశం నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాలలు ఆధునిక దేవాలయాలని, జ్ఞానాన్ని అందించే పుణ్యక్షేత్రాలనీ >>2

# విద్యార్థులలో సృజనాత్మకత పెంచాలి

### తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలి: డిప్యూటీ సిఎం పవన్

### సిద్ధూ సైకిల్ తొక్కిన ఉపముఖ్యమంత్రి



సిద్ధూ రూపొందించిన మోటారు సైకిల్ తొక్కుతున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వృద్ధిచేయడం తల్లి దండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతో సాధ్యమగుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర వ్యాప్తంగా మెగా పిటిఎం 2.0 పేరెంట్స్, టీచర్ల మెగా సమావేశాల సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. ఆ మేరకు ఆయన కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. పిల్లలను బడికి పంపడంతో తల్లిదండ్రుల బాధ్యత ఆగిపోదన్నారు. వారి అధ్యయనం, నడవ డిక ఇతరంశాలు పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల బోధనతో పాటు, వారి వ్యక్తిత్వ నిర్మాణంలో కీలకంగా వ్యవహరించాలన్నారు. విద్యా ర్థుల తల్లిదండ్రులు., ఉపాధ్యాయులు ఈ అంశాలపై చర్చించాలన్నారు. తద్వారా విద్యార్థి ఆసక్తిని గుర్తించి ఆ దిశలో ప్రోత్స హించవచ్చు నన్నారు, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యవంత మైన సమాజ నిర్మాణం దిశలో ఆసక్తి పెంచాలన్నారు. ప్రతి విద్యార్థిలో క్రియేటివిటీ ఉంటుంది. అది గుర్తించి వారికి అండగా నిలవాలన్నారు.

**బ్యాటరీ సైకిల్‌ను రూపొందించిన సిద్ధూని అభినందించి, రూ.లక్ష ప్రోత్సాహకం అందజేత**

అతి తక్కువ ఖర్చుత బ్యాటరీతో నడిచే సైకిల్‌ను రూపొందించిన విజయనగరం >>2

## జనగణనకు ప్రభుత్వం అనుమతి

**విజయవాడ, జులై10, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో జనగణన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. 2027 మార్చి 1 నుంచి ఎపి వ్యాప్తంగా జనగణన ప్రక్రియ ప్రారంభంకానుంది. ఈ మేరకు ఈరోజు (గురు వారం) జిఎడి ముఖ్య కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ ఆదేశాలు జారీచేశారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జనగణన గెజిట్ నోటిఫికేషన్‌ను సర్కార్ తిరిగి ప్రచురించింది. 2027లో దేశవ్యాప్తంగా జనగణన నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. జనగణన కోసం ఈ ఏడాది జూన్ 16న కేంద్ర హోం శాఖ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. 2027 మార్చి 1 నుంచి దేశవ్యాప్తంగా జనగణన ప్రారంభంకానుంది. అదేరోజు ఎపి వ్యాప్తంగాకూడా జనగణన ప్రక్రియ మొదలుకానుంది. భారత జనాభా లెక్కల ప్రక్రియను రెండు దశల్లో నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. మొదటి దశ అక్టోబర్ 1, 2026 నుంచి మొదలుకానుంది. తొలిదశలో జమ్మూ కశ్మీర్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో జనగణన జరుగనుంది. ఇక రెండవ దశ మార్చి 1, 2027 నుంచి దేశంలోని మిగిలిన రాష్ట్రాల్లో జనగణన ప్రక్రియ ప్రారంభమవుతుంది.

## జగన్ పర్యటన షరతుల ఉల్లంఘనపై 3 కేసులు

**చిత్తూరు, జులై 10 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం బంగారుపాళ్యం మామిడి మార్కెట్ యార్డులో మామిడి రైతులను పరామర్శించడానికి వచ్చిన సందర్భంలో పోలీసులు విధించిన షరతులను ఉల్లంఘించడంతో బంగారుపాళ్యం పోలీసులు గురువారం మూడు కేసులు నమోదు చేశారు. వైఎస్ జగన్ బంగారుపాళ్యంకు వచ్చి మామిడి రైతులను పరామర్శించడానికి ప్రభుత్వం మొదట అనుమతి ఇవ్వలేదు. హెలిప్యాడ్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకపోవడంతో వైఎస్ జగన్ నేరుగా రోడ్డు మార్గంలో బంగారు పాళ్యం రావడానికి సిద్ధం కావడంతో చివరి నిముషంలో జిల్లా అధికార యంత్రాంగం బంగారు పాళ్యం మండలం కొత్తపల్లి గ్రామ సమీపంలో అనుమతి ఇచ్చారు. అలాగే వైఎస్ జగన్ బంగారుపాళ్యం కొత్తపల్లిలో హెలిప్యాడ్‌లో దిగినపుడు కేవలం 30మంది వైఎ స్సార్సీ నాయకులు మాత్రమే హాజరై >>2

## రజత్ భార్గవ్‌కు సిట్ నోటీసులు

### మద్యం కుంభకోణం కేసు

**విజయవాడ, జులై10, ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసు కీలక మలుపు తిరిగింది. గత ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన విశ్రాంత ఐఎఎస్ అధికారి రజత్ భార్గవకి సిట్ అధికారులు నోటీసు జారీ చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు విజయవాడ లోని సిట్ కార్యాలయానికి విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు. డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి వైకాపా మద్యం ముఠా ముడుపులు కొల్లగొట్టేందుకు వీలుగా అడ్డగోలు విధాన నిర్ణయాలు తీసుకొని, ఉత్తర్వులు ఇచ్చి ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారని రజత్ భార్గవ్‌పై అభియోగాలున్నాయి. 'అప్పటి వైఎస్సార్సీ ఎంపీ వి. విజయసాయి రెడ్డి సిఫార్సుల మేరకు ఎపి స్టేట్ బేవరేజెస్ కార్పొరే >>2

# కరవు నివారణకు శాశ్వత చర్యలు

### వచ్చే పదేళ్లకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేయండి

### వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### కేంద్రంనుంచి పూర్తి సహకారం: కేంద్ర వ్యవసాయమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్




సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చిత్రంలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

**పుట్టపర్తి, జులై 10 ప్రభాతవార్త :** క్షేత్రస్థాయిలో పని చేసే అధికారులకు ఎక్కడ ఎలాంటి లోపాలు ఉన్నా యనేది క్షుణ్ణంగా తెలుసని, వాటిని ఏ విధంగా ఎదుర్కోవాలి, ఎలా అధిగమించవచ్చు అనేది కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో కరువుకు శాశ్వత పరిష్కారం ఏ విధంగా తీసుకురావచ్చు అనేదానిపై దృష్టి పెట్టాలని కేంద్ర వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి శాఖా మాత్యులు శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి పట్టణం, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో దక్షిణ ఆంధ్ర ప్రదేశ్‌లోని కరువు పీడిత జిల్లాల సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం పుట్టపర్తి మండలం, పెడబల్లి గ్రామ పొలాల్లో రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలతో జరిగిన ముఖాముఖి సమావేశంలో కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో కేంద్ర మంత్రితోపాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, రాష్ట్ర హార్టికల్చర్ అండ్ సిరికల్చర్ కమిషనర్ కే.శ్రీనివాసులు, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్, అనంతపురం జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, కర్నూలు జాయింట్ కలెక్టర్ నవ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాలలో కరువును శాశ్వతంగా పరిష్కరించాలన్నదే తమ ఉద్దేశంఅన్నారు. వ్యవసాయ అనుబంధరంగాల అధికారులు కలిసికట్టుగా కూర్చుని ఆలోచన చేయాలని, అలాగే కేంద్రంతో కూడా కరవు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది ఆలోచించాలన్నారు. అధికారులు ఆయా జిల్లాల యంత్రాంగంతో కలిసి వివిధ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తమ ఆధ్వర్యంలో రూరల్ డెవలప్మెంట్, ఎన్ఆర్ఇజిఎస్, వాటర్ షెడ్, తదితర వాటి కింద ఎలాంటి చర్యలు తీసుకోవచ్చు, ఇతర శాఖలకు సంబంధించి ఎలాంటి సహకారం కావాలన్నా తాము అందించడం జరుగుతుందన్నారు. ఇప్పుడు ఏం చేయాలి, రేపు, భవిష్యత్తులో ఏం చేయాలి, వచ్చే పదేళ్లకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనేదానిపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని సూచించారు.

ఈ విషయం అధికారులు అంతా కలిసికట్టుగా కూర్చుని తగిన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ఏమైనా ఆలోచనలు ఉంటే తెలియజేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ మోడల్ తయారుచేసి కరువు నివారణకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర >>2

## మళ్లీ విచారణకు హాజరుకండి

### విజయసాయికి సిట్ నోటీసులు

**విజయవాడ,జులై10,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం ముడుపులో కేసులో మరోసారి విచారణకు రావాలని మాజీ ఎంపీ విజయసాయి రెడ్డికి సిట్ అధికారులు 179 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ ప్రకారం నోటీసులు జారీ చేశారు. ఈనెల 12వ తేదీన ఉదయం 10గంటలకు విజయవాడ సిపి రెండవ అంతస్తులో ఉన్న సిట్ కార్యాలయానికి రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. రాజ్ కెసిరెడ్డిని అరెస్ట్ చేసినతర్వాత ఈకేసులో విజయసాయి రెడ్డినికూడా ఎఫ్ఐఆర్‌లో నిందితు డిగా సిట్ చేర్చింది. గతంలో కాకినాడ పోర్టు వాటాల కేసులో సిఐడి విచారణకు హాజరైన సమయంలో మొదటిసారి మద్యం ముడుపుల కుంభకోణంపై నోరు విప్పారు. కుంభకోణం కీలక పాత్రధారి, సూత్రధారి, కర్త, కర్మ, క్రియ కెసిరెడ్డి రాజశేఖరరెడ్డి అని మీడియా ముందు బహిరంగంగా విజయసాయి రెడ్డిచెప్పారు. మద్యం నూతన పాలసీకి సంబంధించి మొదటి సమావేశం హైదరాబాద్ జర్నలిస్ట్ కాలనీలోని తన నివాసంలో, రెండవ సమావేశం తాడేపల్లిలోని తన నివాసంలో జరిగిందని విజయసాయి రెడ్డి మీడియాకుతెలిపారు. అప్పటికి విజయసాయిరెడ్డిని కేసులో నిందితుడిగా చేర్చలేదు. ప్రస్తుతం విజయసాయిరెడ్డిని రెండోసారి విచారణకు రావాలని సిట్ అధికారులు నోటీసులివ్వటం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ధాన్యం బకాయిలు రూ. 659.39 కోట్లు జమ



గురువారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల

### 100% సొమ్మును రైతు ఖాతాల్లో జమచేశాం

### నాడు మనిషిని తొక్కించారు.. నేడు మామిడి కాయలు తొక్కించారు

### రైతు పక్షాన ప్రశ్నించే మనస్తత్వం ఉంటే చర్చకు రండి : మంత్రి నాదెండ్ల

**గుంటూరు, ప్రభాతవార్త ప్రతినిధి, జులై 10:** రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఖరీఫ్, రబీ 2024-25 సీజన్లో 2,01,934 రైతుల వద్ద నుండి 4575. 32కోట్ల విలువగల 19,84,098 మెట్రిక్ టన్నుల ధాన్యమును కొనుగోలు చేయటమైందని రాష్ట్ర పౌర సరఫరాల మంత్రినాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం తెనాలిలో మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మునుపెన్నడూ లేని విధంగా ధాన్యము కొనుగోలు చేసిన 24గంటల నుంచి 48గంటలలోపే నగదు రైతుల యొక్క ఖాతాలలో నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు బకాయిలనిమిత్తం ది.10-07-2025న రూ.659.39 కోట్లరూపాయలను30,403 రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని తెలిపారు.

దేశంలో మొదటిసారి 2024-2025 మొత్తము ఇప్పటివరకు 4575.32 కోట్ల రూపాయలను 2,01,934 రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని మంత్రి వెల్లడించారు. 100 శాతం సొమ్మును రైతుల ఖాతాలలో జమ చేశామన్నారు. గడిచిన రబీకాలంలో 2021-22 లో 2,29,248 రైతుల నుంచి 26,23,535 కోట్ల రూపాయల విలువ గల 5,099.62 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడంజరిగిందని చెబుతూ, రబీ 2022-23 కాలంలో 1,58,784 రైతుల నుంచి 2,884.04 కోట్ల రూపాయల విలువ గల 14,12,881 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం జరిగింది. రబీ 2023-24లో1,32,859 రైతులనుంచి 2,763. 86 కోట్ల రూపాయలు విలువగల 12,64,845 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం జరిగిందని మంత్రి వెల్లడించారు. ఖరీఫ్ సీజన్లో 2024-25: 5,65, 662 మంది రైతుల నుండి 35.94 లక్షల మెట్రిక్ టన్నుల వరినిసేకరించారు, దీనివిలువ రూ.8282. 27 కోట్లు.24 గంటలనుంచి 48 గంటల్లోపు 5,65,662 మందిరైతులకు మొత్తం రూ.8282. 27 కోట్లు రూపాయలు చెల్లించడం జరిగింది. మొత్తం 24.31 లక్షల మెట్రిక్ టన్నుల బియ్య ము స్వీకరించడం జరిగిందని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు.

**రైతు పక్షాన నిజాయితీగా ప్రశ్నించే తత్వం ఉంటే ...చర్చకు రండి:** ఒక పార్టీ అధినేత చిల్లర మనస్తత్వంతో గతంలో మనిషిని తొక్కించారని, చిత్తూరు జిల్లా పర్యటనలో ఐదు ట్రాక్టర్లతో రెడీ చేసుకున్న పంటను దొంగ చాటుగా తీసుకువచ్చి రోడ్డుపై మామిడి కాయలు పోసి కేవలం ఫోటోలు కోసం వీడియోలు కోసం రైతు పండించిన పంటను ట్రాక్టర్లతో తొక్కేయడం దుర్మార్గం అన్నారు. రాజకీయాల్లో ప్రశ్నించే మనస్తత్వంఉంటే, రైతుపక్షాననిజాయితీగా ప్రశ్నించే తత్వం ఉంటే చర్చకురండి అని నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోశాంతిభద్రతల విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని హెచ్చరించారు.

# దేశానికే ఆదర్శంగా శ్రీకాకుళం

### ప్రజలు జిల్లానుంచి వలసపోకుండా చర్యలు

### అభివృద్ధి కార్యక్రమాల కోసం పెట్టుబడిదారులు ముందుకు రావాలి

### మెగా పేరెంట్, టీచర్‌డే సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



గురువారం గార జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్ టీచర్ డే సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, జూలై 10 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లాను దేశానికే, ప్రపంచానికే ఆదర్శంగా నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. వలసల జిల్లాగా పేరుపడ్డ శ్రీకాకుళం నుంచి ఇకపై ఎవరూ బయటకు వెళ్లకుండా ఇక్కడే పని చేసుకునేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. గురువారం గార జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్ టీచర్ డే సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైనసందర్భంగా ఆయన ఈవ్యాఖ్యలు చేశారు. 'శ్రీకాకుళంజిల్లాను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేయాల్సి ఉంది. పెట్టుబడిదారులు ఆనందంగా ముందుకు రావాలంటే మన దగ్గర నైపుణ్యం ఉన్న మానవ వనరులు అవసరం. పెద్ద అవకాశాలను దక్కించుకోవాలంటే ఉన్నత చదువులు అవసరం' అని రామ్మోహన్ నాయుడు అన్నారు. పాఠశాలల్లో ఎలాంటి సమస్యలున్నా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

**నాన్న చదువుకున్న బడికి రావడం ఆనందం:** 'మా నాన్న, స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు ఇదే పాఠశాలలో చదువుకున్నారు. నేను ఇక్కడికి రావడానికి ఇదే ప్రధాన కారణం' అని రామ్మోహన్ నాయుడు భావోద్వేగంగా చెప్పారు. విద్యార్థుల అభ్యున్నతికి అన్ని రకాలుగా కృషి చేస్తున్నామని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన >>2

# నిండుకుండలా 'తుంగభద్ర'

### ఎగువ కాలువకు నీటి విడుదల



**అనంతపురం, జులై 10(ప్రభాత వార్త బ్యూరో):** ఆంధ్ర, కర్ణాటక ఉమ్మడి ప్రాజెక్టు తుంగభద్ర జలాశయం నిండుకుండలా ఉంది. జలాశయంలో 105 టిఎంసిల నీటి నిల్వగాను ఇప్పటికే 75.93 టిఎంసిల నీరు ఉంది. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు వస్తున్నాడంతో తుంగభద్ర జలాశయంలోకి తుంగ, భద్ర ఉపనదుల నుంచి మీరు ఎక్కువగా వస్తోంది. గురువారం రోజు తుంగభద్ర జలాశయంలోకి 46,955 క్యూసెక్కుల నీరు వస్తుండగా అంతే నీటిని అంటే 45,500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇందులో భాగంగా తుంగభద్ర జలాశయం నుంచి ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కి నీటిని తుంగభద్ర బోర్డు అధికారులు గురువారం విడుదల చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అధికారులు నీటిని విడుదల చేశారు. తుంగభద్ర బోర్డు సెక్రెటరీ ఓ.ఆర్.కే రెడ్డి, ఎస్ఇ నారాయణ నాయక్, హెచ్చెల్సీ ఇఇ చంద్రశేఖర్ డ్యాంలో స్విచ్ ఆన్ చేసి తుంగభద్ర ఎగువ >>2



గురువారం కొత్తచెరువులో జరిగిన మెగా పిటిఎం సమావేశంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

# నాణ్యమైన విద్య

>> పాఠశాలను రక్షించుకునే బాధ్యత మనందరిదీ అన్నారు. విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయులే కాదు తల్లితండ్రులు కూడా కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి పిల్లవాడికి తల్లి మొదటి గురువు అని ఉపాధ్యాయులు ఇచ్చిన హోంవర్క్‌ను తల్లిదండ్రులు వారి ఇంటి వద్ద పూర్తిచేసేలా బాధ్యత తీసుకోవాలన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానని మెరుగైన సేవలు అందిస్తానని స్పష్టం చేశారు. ఎవరైనా గంజాయి ఇతరత్రా మత్తు పదార్థాలను ప్రోత్సహించినా, తమ పొలాల్లో గంజాయి సాగు చేసిన వారి ఆస్తులను జప్తు చేస్తానని హెచ్చరించారు. వారికి ఎటువంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించకుండా రద్దు పరుస్తానని హెచ్చరించారు. తాను ఆడబిడ్డల పక్షపాతినని వారి సంక్షేమం కోసం డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసింది తనని గుర్తు చేశారు. మహిళల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని భవిష్యత్తులో కూడా వారి అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. పిల్లల తల్లిదండ్రులు మొత్తం బాధ్యతను ఉపాధ్యాయులపైన నెట్టకుండా ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులతో వారి విద్యపై ఆరా తీయడం వల్ల మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. లోకేష్ పాఠశాలలో ఉన్నప్పుడు పేరెంట్స్ మీటింగ్‌కు నేను ఎప్పుడూ వెళ్లలేకపోయానని, నా సతీమణి భువనేశ్వరి ఏ సమావేశాన్నీ విడిచిపెట్టకుండా వెళ్లి లోకేష్‌ను స్టాండ్ ఫర్డ్ యూనివర్సిటీ వరకూ చదివించటంలో శ్రద్ధ పెట్టారన్నారు. కుటుంబంలో ఉన్న ప్రతీ పిల్లవాడినీ చదివించాలనీ, తల్లిపైన పిల్లలకు గౌరవభక్తులు పెరగాలనే లక్ష్యంతో తల్లికి వందనం పథకాన్ని ప్రతి ఒక్క విద్యార్థికి వర్తింపజేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నో వేకెన్సీ బోర్డు పెట్టే స్థితికి తీసుకువచ్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యాశాఖ బాధ్యతను లోకేష్ ఏరికోరి తీసుకున్నారు. మొదటి దఫా పేరెంట్ టీచర్ మీటింగ్‌ను 44 వేల పైచిలుకు పాఠశాలల్లో నిర్వహించామనీ, ఈసారి ప్రైవేటు స్కూళ్లలోనూ వీటిని నిర్వహించాలని ఆదేశించామన్నారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0కు 2.28 కోట్ల మంది హాజరయ్యారనీ, గిన్నిస్ రికార్డు సాధించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టమన్నారు. తల్లిపేరిట ప్రతీ విద్యార్థి ఒక మొక్క నాటేలా చర్యలుతీసుకున్నాం. వారికి గ్రీన్ పాస్ పోర్టు కూడా ఇచ్చామన్నారు. తల్లితండ్రులు లీప్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలనీ సూచించారు. పాఠశాలల్లోకి రాజకీయాలు రాకూడదన్న ఉద్దేశంతో విద్యార్థులకు ఇచ్చిన కిట్లపై ఎలాంటి వ్యక్తుల ఫోటోలు పెట్టలేదనీ, రూ.980 కోట్లు వీటి కోసం వ్యయం చేయడం జరిగిందన్నారు. తాను చదువుకున్న రోజుల్లో రానుపోను 12 కిలోమీటర్ల మేర నడిచేవాడినని, ప్రస్తుతం అలాంటి దుస్థితి లేదన్నారు. నాణ్యమైన సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నట్లు తెలియజేశారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేలా చాగంటి కోటేశ్వరరావును విద్యాశాఖ సలహాదారుగా నియమించినట్లు తెలియజేశారు. మిస్సైల్ మాన్ అబ్దుల్ కలాం, రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్ లాంటి వ్యక్తులు మనకు స్ఫూర్తి కావాలనారు. గతంలో 12 సార్లు డిఎస్సీలు నిర్వహించి 1.66 లక్షల ఉపాధ్యాయులను నియమించామని, గత ప్రభుత్వం ఒక్క డిఎస్సీ కూడా చేపట్టలేదనారు. విద్య వ్యవస్థ కూడా కొంటుపడిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక మెగా డిఎస్సీ నిర్వహించి 16,347 మంది ఉపాధ్యాయులను ఆగస్టులోపు నియమిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాం. విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేలా షైనింగ్ స్టార్స్ అని అవార్డులు ఇస్తున్నామని, షైనింగ్ స్టార్స్ ఉన్న విద్యార్థుల అందరికీ నచ్చిన కాలేజీల్లో చదువుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కొత్తచెరువులో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేస్తానన్నారు. పిల్లల కొరకు ఒక ఎకరం భూమి సంపాదించే కంటే వారిని బాగా చదివిస్తే ఊహించని విధంగా వారి జీవితాల్లో మార్పు వస్తుందనారు. భవిష్యత్ అంతా నాలెడ్జ్ ఎకానమీదే. దానికి అనుగుణంగా మన విద్యార్థులను తీర్చిదిద్దాలనారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారిని బాగా చదివించాలని వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి.కే.పార్థసారధి, పుట్టపర్తి శాసన సభ్యురాలు పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, విద్య శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ కోన శశి ధర్, జిల్లా కలెక్టర్ టీ.ఎస్. చేతన్, జిల్లా ఎస్పీ వి.రత్న, జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీవో సువర్ణ, ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్ఎం గోపాల్, విద్యార్థిని, విద్యార్థులు వాటి తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యాశాఖను సవాలుగా స్వీకరించా

## మంగళగిరిలో ఓడి గెలిచా..

### డొక్కా సీతమ్మ పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం

### విలువలతో కూడిన విద్యకోసమే సలహాదారులుగా చాగంటి

### ప్రతి తరగతికి టీచర్ ఉండేలా చర్యలు: మంత్రి లోకేష్



గురువారం కొత్తచెరువులో జరిగిన మెగా పిటిఎం కార్యక్రమంలో తండ్రి చంద్రబాబుకు పాదాభివందనం చేస్తున్న మంత్రి లోకేష్

**కొత్తచెరువు, జులై 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే తాను అతి క్లిష్టమైన విద్యాశాఖను సవాలుగా ఎంచుకున్నట్లు రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొత్తచెరువులోని శ్రీసత్యసాయి జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన మెగా పిటిఎం కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ, తాను ఎప్పుడూ సవాళ్లను స్వీకరిస్తానని గతంలో ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభించినప్పుడు రాష్ట్రంలోనే గత 37 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ విజయం సాధించలేని మంగళగిరి నియోజకవర్గంలో పట్టుబట్టి పోటీ చేశానని తొలిసారి ఓడిపోయినప్పటికీ, రెండవ సారి అత్యధిక మెజారిటీతో గెలుపొంది చూపించానని తెలియజేశారు. ముఖ్యమంత్రి సూచనమేరకు డొక్కా సీతమ్మ పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తున్నాం. విద్యార్థుల్లో పౌష్టికాహారం కోసం అన్నిప్రభుత్వ పాఠశాలలకు రాగి జావను ఉచితంగా అందిస్తున్న భగవాన్ శ్రీ సత్యసాయి ట్రస్ట్‌ను అభినందించారు. విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని, ఈ విషయం తనకు ముఖ్యమంత్రి చెప్పగానే క్యాబినెట్ ర్యాంకుతో చాగంటి కోటేశ్వరరావును ప్రభుత్వ సలహాదారుగా నియమించడం జరిగిందన్నారు. అయితే ప్రభుత్వం నుంచి అందించే ఎటువంటి సౌకర్యాలు తనకు అవసరం లేదని, విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కోటేశ్వరరావు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా జీవితంలో లక్ష సాధన కోసం ముందుకు సాగాలని సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యారని పిల్లలు ఆత్మహత్యలు చేసుకోవడం సమంజసం కాదన్నారు. ఫెయిల్యూర్ అనేది మనలో కసి పట్టుదలను పెంచాలి గాని, అధైర్య పడకూడదన్నారు. తాను విద్యాశాఖ మంత్రిగా అద్భుతమైన సంస్కరణలతో విద్యాశాఖలోసమూల మార్పులు చేస్తానన్నారు. విద్యా వ్యవస్థలో రాజకీయాలు వద్దని ఫలితాలపై దృష్టి పెట్టాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు జూనియర్ కళాశాలలో ఒక్కరోజే 2.5 కోట్లమందితో మెగా పిటిఎం నిర్వహించడం ఒక రికార్డు అన్నారు. మన పిల్లల్లో అద్భుతమైన శక్తి ఉందని దారి చూపిస్తే ప్రపంచాన్ని శాసిస్తారన్నారు.

పిల్లలను ప్రయోజకు లుగా మార్చే బాధ్యతను తాను తీసుకుంటాన న్నారు. తల్లికి వందనం ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల లోకి పదివేల కోట్లు జమచేశామన్నారు. బ్యాగ్ బరువు తగ్గిం చేందుకు సెమిస్టర్ వారీగా పుస్తకాలను రూపొం దించామని. సమగ్ర అభ్యాసం, విద్యా నైపుణ్యా లను పెంచడమే లక్ష్యంగా చేసుకుని లీప్ (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) పేరుతో ఆంధ్ర మోడల్ స్కూల్ ఎడ్యుకేషన్‌ను ప్రవేశపెట్టామన్నారు. లక్షమంది ప్రభుత్వ ఇంటర్మీడియట్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌తో పాటు నీట్, జెఇఇ శిక్షణను అందిస్తున్నామన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాల వైపు మళ్లకుండా డ్రగ్స్ వద్దు బ్రో పేరుతో పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నామని మంత్రి లోకేష్ చెప్పారు.

# సత్యసాయి ట్రస్ట్ సేవలు అమోఘం

## కేంద్రమంత్రి శివరాజ్ సింగ్

**పుట్టపర్తి రూరల్ జులై 10 ప్రభాతవార్త :** సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్‌చేస్తున్న సేవలు అమోఘం అని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్‌పేర్కొన్నారు. గురువారం ప్రశాంతి నిలయంలో నిర్వహించే గురుపూర్ణిమ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వేడుకలలో భాగంగా ప్రశాంతి భజన బృందం గురువందన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జూన్ 15న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన సాయి గాయత్రి జపం గిన్నిస్ బుక్ రికార్డు రావడంతో సత్యసాయి సమాధి చెంత ప్రధానం చేశారు. అనంతరం కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ మాట్లాడుతూ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్‌ద్వారాఅందిస్తున్న త్రాగునీరు,విద్య, వైద్యం అమోఘమని పేర్కొన్నారు. గురువుకు అందరు సమానమేనని పేద ధనిక భేదాలు ఉండవు అన్నారు. ప్రశాంతి నిలయం నిస్వార్థమైన సేవకు, శాంతికి ప్రపంచానికే కేంద్ర బిందువు అని కొనియాడారు. సత్యసాయి బాబా లాంటి కారణజన్ములు మనదేశంలో పుట్టడం మన అందరి అదృష్టమని పేర్కొన్నారు. పుట్టపర్తిని దర్శించడం జన్మజన్మల అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

## వారం - వర్జ్యం

11-07-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
పాడ్యమి రా.2.07
పూర్వాషాఢ ఉ.5.56
వర్జ్యం : మ.2.09-3.48
దు.ఉ.8.19-9.11, 2) 12.40-1.32
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** నూతన మిత్రులు పరిచయమై, నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సంఘంలో ప్రతిష్ఠలు పెరుగుతాయి.

**వృషభం :** పోటీపరీక్షలు, ఇంటర్వ్యూ లలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారా లలో ఆటుపోట్లు ఎదురైనా అధిగమిస్తారు.

**మిథునం:** సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. సేవా కార్యక్రమాలలో చురుకగా పాల్గొంటారు.

**కర్కాటకం:** భూవివాదాలు పరిష్కారమై నూతన ఒప్పందాలు కుదురుతాయి. ప్రయాణాలలో నూతనపరిచయాలు పెరుగుతాయి.

**సింహం:** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలను చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు.

**కన్య :** ఎంతో కాలంగా వేధిస్తున్న రుణాల నుండి బయటపడతారు. విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**తుల :** పేర్లు, భూములు క్రయ విక్రయాలలో స్వల్పలాభాలు పొందుతారు.

**వృశ్చికం:** రాజకీయ, పారిశ్రామిక, కళారంగాల వారికి విశేషంగా రాణిస్తుంది.

**ధనుస్సు:** ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. సోదరులతో ఏర్పడిన మాటపట్టింపులు కొంతవరకు తీరుతాయి.

**మకరం:** సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**కుంభం:** గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. వృత్తి వ్యాపారాలలో స్వల్పలాభాలు పొందుతారు.

**మీనం :** సోదరుల నుండి ముఖ్య విష యాలు అందుకొంటారు. అప్రయత్న కార్యసిద్ధి పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సిట్ నోటీసులు

>> షన్ లిమిటెడ్ లోని (ఏపిఎస్‌బిసిఎల్) అత్యంత కీలకమైన ఎంఐఎస్ సెక్షన్‌లో ఏ.అనూష అనే మహిళను డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా రజత్ భార్గవ ప్రత్యేక మెమో దా ్వరా నియమించారు. ఆమె వైకాపా ముఠా ప్రతినిధిగా పనిచేసేవారు. ఎప్పటికప్పుడు మద్యం విక్రయాల డేటాను వాట్సప్ ద్వారా రాజ్ కెసిరెడ్డి(ఎ-1) ముఠాలో కీలక సభ్యుడైన సైఫ్ అహ్మద్‌కు పంపించేవారు. ఆ సమాచారం ఆధారంగా డిస్టలరీలకు వెళ్ళిన ఆర్డర్ల మొత్తం తెలుసుకొని, ముడుపులు ఎంత వసూలు చేయాలనే దానిపై సైఫ్ అహ్మద్ లెక్కలేసి రాజ్ కెసిరెడ్డికి పంపించేవారు. ఆయన ముప్పిడి అవినాష్‌రెడ్డి,బూనేటి చాణక్య ద్వారా ముడుపుల సొమ్ము వసూలు చేసి బిగ్‌బాస్‌కు చేర్చేవారు'అని సిట్ ఇప్పటికే దర్యాప్తులో గుర్తించింది. ఈ కుంభకోణానికి సంబంధించిన కుట్ర,దాని అమలులో రజత్ భార్గవ ప్రమేయంపై సిట్‌కు ఇప్పటికే కొన్ని కీలక ఆధారాలు లభించాయి. అరెస్టైన నిందితుల రిమాండు రిపోర్టుల్లోనూ రజత్ భార్గవ పేరును సిట్ ప్రస్తావించింది.

# ఉల్లంఘనపై 3 కేసులు

>> ఆయనకు స్వాగతం చెప్పాలని, అలాగే బంగారుపాళ్యం మామిడి మార్కెట్ యార్డులో 500 మంది మామిడి రైతులకు మాత్రమే అనుమతి వుంటుందని వీరిని మాత్రమే వైఎస్ జగన్ పరామర్శించాలని పోలీసులు షరతులు విధించారు. వైఎస్ జగన్ బంగారుపాళ్యం మార్కెట్ యార్డు పర్యటన నిర్వాహకులు పోలీసులు జారీ చేసిన నిబంధనలు ఉల్లంఘించారని స్థానిక విఆర్ఓ వెంకటరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంగారుపాళ్యం పోలీసులు పర్యటన నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. అలాగే జగన్ పర్యటన సందర్భంగా వైఎస్ జగన్ కాన్వాయ్ ఎదుట బెంగళూరు-చెన్నై జాతీయ రహదారి తిమ్మోజిపల్లి గ్రామ సమీపంలో తుంబపాళ్యం గ్రామానికి చెందిన రైతు దేవేంద్ర ఐదు ట్రాక్టర్ల మామిడి కాయలను రోడ్డుపై పారవేసి ఆ కాయలను ట్రాక్టర్లతో తొక్కించి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించారని బంగారుపాళ్యం పోలీసులు దేవేంద్రతో పాటు ఐదు మంది ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేశారు.

# విద్యార్థులలో సృజనాత్మకత పెంచాలి

>> జిల్లాకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి రాజాపు సిద్దూని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభినందించారు. వినూత్న ఆలోచనతో సరికొత్త ఆవిష్కరణకు రూపం ఇచ్చిన సిద్ధూ గురించి సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకుని అతన్ని మంగళగిరిలోని క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని ప్రత్యేకంగా మాట్లాడారు. సిద్ధూ ఆవిష్కరించిన సూకిల్‌ని స్వయంగా నడిపారు. అతని ఆలోచనలు తెలుసుకుని అబ్బురపడ్డారు. సిద్ధూ రూపొందించిన గ్రాసరీ గురూవాట్సప్ సర్వీస్ బ్రోచర్‌చూసి ప్రత్యేకంగా అభినందించారు. అతని ఆలోచనలకు మరింత పదునుపెట్టాలని ఆకాంక్షిస్తూ రూ.లక్ష ప్రోత్సాహకరం అందించారు. ఆ సైకిల్‌పై సిద్దూని కూర్చోబెట్టుకొని నడిపారు. విజయనగరం జిల్లా జాడవారి కొత్తవలస గ్రామానికి చెందిన సిద్ధూ సుదూరంలో ఉన్న కాలేజీకి వెళ్లేందుకు స్వయంగా ఒక ఎలక్ట్రిక్ సైకిల్ తయారు చేశాడు. మూడు గంటల బ్యాటరీ ఛార్జ్ చేస్తే 80 కిలోమీటర్లు ప్రయాణించగల ఈ సైకిల్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇక సిద్ధూ రూపొందించిన సైకిల్‌పై అతన్ని ఎక్కించుకుని పవన్ కొద్దిసేపు ఆ సైకిల్‌ను నడిపారు.

**మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో మగ్గుతున్న మా కుమారుల్ని రక్షించండి...**

ఉద్యోగాల కోసం ప్రయత్నించి ఏజెంట్ చేతిలో మోసపోయి విదేశాల్లో మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో మగ్గుతున్న తమ కుమారులను రక్షించాలంటూ గండబోయిన సూర్యకుమారి అనే మహిళ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవణ్ కల్యాణ్‌నికలిసి వినతిపత్రం సమర్పించారు. విజయనగరానికి చెందిన ఆమో -మయన్మార్ సరిహద్దుల్లో బందీలుగా ఉన్న తమ వారి ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని, వారిని విడిపించేందుకు సాయం చేయాలని వేడుకున్నారు. దీనిపై స్పందించిన పవన్ కళ్యాణ్ విషయాన్ని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకువెళ్లారు. మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో చిక్కుకున్న వారిని రక్షించాలని కోరారు. ఈ వ్యవహారంపై విదేశీ వ్యవహారాల శాఖ సానుకూలంగా స్పందించింది. విదేశాల్లో మగ్గుతున్న వారిని వెనక్కి తీసుకురావడానికి తగిన హామీ ఇచ్చారు.

# 100 యేళ్ల వయసులోనూ నవయువకుడే!

## తన ఆరోగ్యసూత్రాలు వివరించిన మలేసియా మాజీ పిఎం మహతిర్‌మహ్మద్

**సింగపూర్‌సిటీ, జులై 10:** వందేళ్ల వయసులోనూ పూర్తి ఆరోగ్యంతో, స్పష్టమైన ఆలోచనలతో, చురుకుదనంతో కనిపిస్తున్నారు మలేసియాను ఎక్కువ కాలం పాలించిన మాజీ ప్రధాని డాక్టర్ మహతీర్ మహమ్మద్ జులై 10న అంటే గురువారం 100వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఈ వయసులో కూడా ఆయనలోని జ్ఞాపకశక్తి, వాక్పటిమ ఏమాత్రం తగ్గలేదు. తన సుదీర్ఘ, ఆరోగ్యవంతమైన జీవితం వెనుక ఎలాంటి మాయాజాలం లేదని, కేవలం క్రమశిక్షణతో కూడిన జీవనశైలే కారణమని ఆయన వెల్లడించారు. ది స్ట్రెయిట్స్ టైమ్స్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మహతీర్ మహమ్మద్ తన ఆరోగ్య సూత్రాలను పంచుకున్నారు. ఆయన చెప్పిన విషయాలు ఎంతో ఆచరణీయంగా ఉన్నాయి. శరీరాన్ని ఎప్పుడూ చురుకుగా ఉంచాలి. ఖాళీగా కూర్చోవడం ఆరోగ్యానికి హానికరమని ఆయన తెలిపారు. దీనికోసం జిమ్‌లలో కఠినమైన వ్యాయామాలు చేయాల్సిన అవసరం లేదని, రోజూవారీ పనుల్లో చురుకుగా ఉండటం, నడవడం వంటివి చేస్తే సరిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. శరీరంతో పాటు మెదడుకు కూడా పదును పెట్టడం చాలా ముఖ్యమని మహతీర్ వివరించారు. మీరు మెదడును ఉపయోగించకపోతే, అది క్రమంగా క్షీణిస్తుంది, విషయాలు మరచిపోవడం మొదలవుతుంది. అందుకే నేను నిరంతరం చదువుతాను, రాస్తాను, ఇతరులతో మాట్లాడతాను, ఉపన్యాసాలు ఇస్తానని ఆయన పేర్కొన్నారు. రాజకీయాల నుంచి తప్పుకున్నాక కూడా ఆయన ప్రజా జీవితానికి దూరం కాలేదు. నిరంతరం ఏదో ఒక పనిలో నిమగ్నమవ్వడమే ఆయన మానసిక ఆరోగ్యానికి కారణం.

ఆహారపు అలవాట్ల గురించి మాట్లాడుతూ, మితంగా తినడమే తన సూత్రమని మహతీర్ చెప్పారు. ధూమపానం, మద్యపానం వంటి దురలవాట్లకు ఆయన ఎప్పుడూ దూరంగా ఉన్నారు. విపరీతమైన డైటింగ్ పద్ధతులను పాటించకుండా, సమతుల్యమైన, సాదాసీదా భోజనాన్ని ఇష్టపడతారు. రాజకీయ జీవితంలో ఎన్నో ఒత్తిళ్లు, సవాళ్లు ఎదుర్కొన్నప్పటికీ, వాటిని ప్రశాంతంగా ఎదుర్కోవడం కూడా తన ఆరోగ్యానికి దోహదపడిందని ఆయన పరోక్షంగా తెలిపారు.



వ్యవసాయ క్షేత్రంలో రైతులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్, మంత్రి అచ్చెన్నాయుడు

# కరవు నివారణకు శాశ్వత చర్యలు

>> ప్రభుత్వం కూడా కరువు నివారణ చర్యలపై దృష్టి పెట్టాలని, కేంద్రం కూడా ఇందుకు సహకారం అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలు, ఉద్యాన శాఖ పరిధిలో పరిస్థితుల గురించి తెలియజేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, రాష్ట్ర హార్టికల్చర్ అండ్ సిరికల్చర్ కమిషనర్ కే.శ్రీనివాసులు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలలో కరువు పరిస్థితి, వివిధ పంటల సాగు వివరాలు, ఇరిగేషన్ అంశాల గురించి ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. బుందేల్ఖండ్ రీజియన్ మాదిరిగా రాయలసీమ జిల్లాలకు కూడా ఆర్థిక సహాయం ప్రకటించాలని, సీమ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. ఇక్కడ జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ సూచించిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. "ప్రకృతి వ్యవసాయంలో ఖర్చు తక్కువ, లాభం ఎక్కువ. ఇది దేశానికి ఆదర్శంగా మారుతుంది" అని మంత్రి గారు పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి, తక్కువ భూమిలోనూ అధిక లాభాన్ని సాధించవచ్చని, దీనివల్ల చిన్న రైతులకు అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మహిళా సంఘాల సోదరీమణులు ఇప్పుడు స్వయం సమర్థులవుతున్నారు. తాను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించిన "లాడ్లీ బహనా యోజన'ను గుర్తు చేస్తూ, మహిళల సాధికారతకు నేను ప్రాధాన్యం ఇస్తానన్నారు. ఈ సందర్భంగా పుట్టపర్తి, అనంతపురం.. ఉమ్మడి జిల్లాలకు చెందిన 53,746 ఎస్ హెచ్ జి సభ్యులకు రూ.437.09 కోట్ల బ్యాంకు లింకేజ్ చెక్కును అందించారు అంతకు ముందు పెదబల్లి గ్రామంలో సేంద్రీయ పద్ధతిలో సాగు చేసిన మిశ్రమ పంటను పరిశీలించారు. అలాగే వర్షాభావం వల్ల ఎండిన పంటలపై ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను తిలకించారు. ముందుగా ఎస్ హెచ్ జి మహిళల ప్రార్థనతో కార్యక్రమం ప్రారంభమైంది ఈ కార్యక్రమంలో జేసి అభిషేక్ కుమార్,భారత ప్రభుత్వ రైతుల సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ పేర్ని దేవి, రాష్ట్ర సేర్ప్ సీ.ఈ.ఓ వి.కరుణ,ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వపు అగ్రికల్చర్, మార్కెటింగ్, సహకార సంస్థ చైర్మన్ టి. విజయ్ కుమార్,డిఆర్డీఏ పీడి నర్సయ్య, రైతులు, మహిళా సంఘ సభ్యులు, రాయలసీమ జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు,తదితరులు పాల్గొన్నారు.

# దేశానికే ఆదర్శంగా శ్రీకాకుళం

>> పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పిస్తామని, సౌర వ్యవస్థ, ప్రయోగశాలలు, ఆట స్థలాలను ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. భవిష్యత్తు ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలంటే విద్యారంగాన్ని అభివృద్ధి చేయడమే కీలకం. అలాంటి రంగాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు లోకేష్ బాబు చాలా ప్రతిష్టాత్మకంగా భావించి విద్యాశాఖ మంత్రి పదవిని తీసుకున్నారు. పిల్లలు బాగుంటే దేశం బాగుంటుంది. వారే భవిష్యత్తుకు పెట్టుబడి. గత పాలకులు మాత్రం పాఠశాల గోడలపై, పిల్లల పుస్తకాలపై, బ్యాగులపై తమ ఫోటోలు ముద్రించుకొని ఆదర్శాలను తుంగలో తొక్కారని ఆయన గత ప్రభుత్వాన్ని విమర్శించారు. గురుపౌర్ణమి సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

**మెగా పేరెంట్ టీచర్ డే భవిష్యత్తుకు బాట:**

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మెగా పేరెంట్ టీచర్ డే ముఖ్య లక్ష్యం పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడమే అన్నారు. పిల్లలకి తల్లిదండ్రులు ఇచ్చే అతిపెద్ద ఆస్తి చదువే. మంచి చదువు కంటే పెద్ద ఆస్తి మరేమీ లేదు. ఆర్థిక పరిస్థితి చదువుకు అడ్డంకి కాదు. పి4 మార్గదర్శి లాంటి ఎన్నో స్కీములు ఉన్నాయి. ప్రభుత్వం చదువుకు ప్రోత్సాహం ఇస్తోంది. మంచి నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం ఇస్తున్నాం. చదువు కోసం పుస్తకాలు, బూట్లు ఇస్తున్నామని కలెక్టర్ వివరించారు. తల్లిదండ్రులు పాఠశాల సమావేశాలకు హాజరు కావాల్సిన ఆవశ్యకతను కలెక్టర్ తన స్వంత అనుభవంతో వివరించారు. 'నాకు మూడున్నర ఏళ్ళ పాప ఉంది. ఇంట్లో మాటలు వినదు. తినదు. పేరెంట్ టీచర్ మీటింగ్‌కు వెళ్తే, అక్కడ అన్ని రకాలు తింటుందని, చాలా బాగా చదువుతుందని చెప్పారు. నేను స్కూలుకు పేరెంట్ టీచర్ మీటింగ్ కోసం వెళ్ళడం ద్వారానే తెలుసుకోగలిగాను. ప్రతి తల్లి తండ్రి అలాగే ఇలాంటి సమావేశాలకు హాజరు కావాలి' అని ఆయన కోరారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా చిన్నప్పటినుంచే తర్ఫీదు ఇవ్వాలని, సెల్ ఫోన్‌లో పిల్లలు ఏం చేస్తున్నారో చూడగలగాలని, ఫోన్‌కు దూరంగా ఉంచి బయట ఆటలకు ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలని సూచించారు.

# అరుణాచలాన్ని మించిన సింహాచలం అప్పన్న గిరి ప్రదక్షిణం

## 10 లక్షలకు మించిన భక్తులు



గురువారం సింహాచలం అప్పన్నను దర్శించుకుంటున్న భక్తులు

**సింహాచలం ప్రభాతవార్త జులై 10:** ఆషాడం పౌర్ణమి రోజు స్వామి వారికి నాలుగో విడత చందనం తెల్లవారు జామున సమర్పించారు. వైశాఖ మాసం తృతీయ చందనోత్సవం రోజు తొలి విడత చందన సమర్పణ, వైశాఖమాసం పౌర్ణమి రెండో విడత జ్యేష్ట పౌర్ణమి మూడో విడత ఆషాడపౌర్ణమి నాలుగో విడత మూడు మడుగుల చందనాన్ని సమర్పించారు. గిరిప్రదక్షిణ చేసిన భక్తులు స్వామివారి దర్శనానికి సింహగిరి చేరడంతో సింహగిరి భక్తులతో కిటకిటలాడింది. సుమారుగా 70,000 మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారని అంచనా వేశారు. అప్పన్న గిరి ప్రదక్షిణ చేస్తే భూప్రదక్షిణ చేసినంత పుణ్యం ...చూడడానికి మన రెండుకళ్లు సరిపోవు. అడుగులో అడుగేస్తూ.. హరి నామ స్మరణతో. అప్పన్నని కొలుస్తూ... భక్తులకి అలసటంటే తెలియకుండా 32 కిలోమీటర్ల గిరిప్రదక్షిణ పూర్తి చేశారు. ఉభయ రాష్ట్ర భక్తులు పాల్గొనే అతి పెద్ద ఆలయ ప్రదక్షిణ సింహాద్రి అప్పన్న గిరి ప్రదక్షిణ. 32 కిలోమీటర్ల కొండ చుట్టూ 32 స్వామి వారి నరసింహ క్షేత్రాలనుస్మరిస్తూ నరసింహ స్వామి వారి మూల మంత్ర 32 బీజ అక్షరాలను వల్లిస్తూ..లక్షల అడుగులో అడుగులు వేస్తూ సంతోషం సరదాలతో మురిసి మెరిసి ఎగసి పడే భక్తుల కోలాహలంతో కలసి కదులుతూ ఒక రాత్రంతా ప్రకృతితో మమేకమై చీకటిలోచేసే ఆత్మ పరిశీలనా ప్రయాణం ఈ ఆధ్యాత్మిక గిరి ప్రదక్షిణం. ఈ వేడుకకు సింహాచలం.దేవస్థానం ఇఒ త్రినాథ్ రావు స్వీయ నేతృత్వంలో.. ఈ సంవత్సరం అధిక సంఖ్యలో భక్తులు సుమారుగా 12 లక్షల మంది భక్తులు పాల్గొన్నారు.

# నిండుకుండలా 'తుంగభద్ర'

>> కాలువ (హెచ్చెల్సీ)కి నీరు విడుదల చేశారు. అంతక ముందు బోర్డు అధికారులు డ్యాంపై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాంప్రదాయంగా వాయానం వదిలారు. అనంతరం బోర్డు సెక్రెటరీ ఓ.ఆర్.కే రెడ్డి మాట్లాడుతూ తుంగభద్ర ఎగువ కాలువకు తొలిత 100 క్యూసెక్కుల నీరు వదిలి తరువాత ప్రతి రెండు గంటలొకసారి నీరు విడుదల పెంచుతామని తెలిపారు. కాలువలో 500 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు తెలిపారు. ఆంధ్ర, కర్ణాటక కోటా రెండు కలిపి కాలువకు నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఖరీఫ్ పంటల సాగుకు ఈ నెల 10 తేదీ నుంచి నవంబర్ 30 వరకూ దాదాపు 1,300 క్యూసెక్కులు వదులుతున్నట్లు తెలిపారు. తుంగభద్ర జలాశయంకు ఎన్నడులేని విధంగా జూలై మొదటి వారంలోనే డ్యాంలో నీరు పూర్తిస్థాయిలో నదికి నీటిని విడుదల చేశామన్నారు. తుంగభద్ర జలాశయం గరిష్ట నీటి నిల్వ సామర్థం 100 టిఎంసిల కాగా ప్రస్తుతం 80 టిఎంసిలకు కుదించిన్నట్లు తెలిపారు. ప్రస్తుతం డ్యాం పై భాగంలో వర్షాలు బాగా కురుస్తున్న నేపథ్యంలో ఇన్ఫ్లో గణనీయంగా డ్యాంలోకి వస్తుందని తెలిపారు. రైతులు పంటలు సాగు విషయంలో నీరు వృథా చేయకుండా వాడుకోవాలని చెప్పారు. 12వ తేదీ సాయంత్రం 6 గంటకల్లా ఆంధ్ర సరిహద్దులోని 105 కిలోమీటర్లు తుంగభద్ర జలాలు చేరుతాయని అధికారులు తెలిపారు. నీరు విడుదల పూజా కార్యక్రమంలో టిబి డ్యాం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యాన ఉత్పత్తుల్లో ఎపి నం1:గవర్నర్ నజీర్



ప్రసంగిస్తున్న గవర్నర్

**గన్నవరం, జులై 10, ప్రభాతవార్త :** గత కొన్ని దశాబ్దాలుగా మన రాష్ట్రం ఉద్యాన ఉత్పత్తుల్లో గణనీయమైన ప్రగతిని సాధించిందని, 15.9లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో 275.13 మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో దేశంలోనే ఐదవస్థానంలో నిలిచిందని రాష్ట్రగవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యన విశ్వ విద్యాలయం 6వస్నాతకోత్సవ కార్యక్రమాన్ని కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలోని స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో గురువారం ఉదయం నిర్వహించారు. ఈకార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఛాన్సలర్‌హోదాలో గవర్నర్ ముఖ్యఅతిధిగా హాజరై బ్యాచిలర్ డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేషన్, పిహెచ్‌డి పూర్తిచేసిన విద్యార్ధులకు పట్టాలు ప్రధానం చేసారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్ధులకు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలను గవర్నర్ చేతుల మీదుగా బహుకరించారు. ఈసందర్భంగా గవర్నర్ నజీర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఉద్యానపంటల పాత్ర ప్రముఖంగా ఉందన్నారు. ఉద్యాన పంటల సాగులో నూతన పద్దతులు పాటించటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఈదిశగా శాస్త్ర వేత్తలు కృషిచేయాలని సూచించారు. పోషకాహారకొరతను నివారించటంతోపాటు రైతుల ఆదాయాన్ని పెంచటంలో ఉద్యానరంగం కీలక పాత్రపోషిస్తుందని అభిప్రాయపడ్డారు. 2024 జిడిపిలో వ్యవసాయ అనుబంధరంగాలు దాదాపు 16శాతం వాటాను కలిగి ఉన్నాయని తెలిపారు. వ్యవసాయం కేవలం జీవనోపాధి కాదు అది జీవన విధానం అన్న హరిత విప్లవ పితామహుడు స్వామినాధన్ మాటలను ఈసందర్బంగా ఊటంకించారు. మిరప, కోకో, ఆయిల్‌పామ్, బొప్పాయి, జీడిపప్పు, నారింజ, టమోట, అరటి వంటి అనేక పంటల ఉత్పత్తి, ఉత్పాదకతకు మార్గదర్శకంగా దేశంలోనే ప్రధాన ఉద్యాన కేంద్రంగా మన రాష్ట్రం నిలవ బోతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేసారు. ఈ విశ్వవిద్యాలయం స్థాపించిన అనతి కాలంలోనే ఎందరో విద్యార్ధులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దటం అభినందనీయమన్నారు. ఈవిశ్వవిద్యాలయం ద్వారా 38 రకాల అధికదిగుబడినిచ్చే వంగడాలను అభివృద్ధిచేసి రైతులకు అందించినట్లు గవర్నర్ వివరించారు. వీటిలో 31 రకాలను గత రెండు సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో సెంట్రల్ వెరైటీ రిలీజ్ కమిటీ అధికారికంగా ప్రకటించిందని గుర్తుచేసారు. విద్యాలయాలు జ్ఞానంతోపాటు, వ్యక్తిత్వ నిర్మాణానికి పునాధులుగా నిలుస్తాయని, ఇక్కడ నేర్చుకున్న విషయాపరిజ్ఞానాన్ని మరింత పెంపొందించుకుని క్షేత్రస్థాయిలో రైతులకు సాయం అందించాలని సూచించారు. విద్యార్ధులకు స్నాతకోత్సవం చిరస్మరణీయమైన అనుభూతినిస్తుందని ఈ ఆనందం మరువలేనిదన్నారు.

## గన్నవరం విమానాశ్రయానికి గ్రీన్ ఛానల్ ద్వారా గుండె తరలింపు

**విజయవాడ,జులై 10,ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరు ఓ కార్డియాక్ ఆస్పత్రి నుండి గన్నవరం విమానాశ్రయానికి గ్రీన్ ఛానల్ ద్వారా గుండెను తరలించారు. తిరుపతి పద్మావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి దీన్ని అమర్చనున్నారు. విజయవాడకు చెందిన జోతిన భాను వాకింగ్ వెళ్ళి వస్తుండగా ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తనకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం హుటాహుటిన గుంటూరు లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించారు. ఈ క్రమంలో గుండెను తిరుపతి లోని పద్మావతి ఆస్పత్రికి తరలిస్తున్నారు.

## రాష్ట్రంలో ఘనంగా గురుపౌర్ణమి

**విజయవాడ,జులై10,ప్రభాతవార్తప్రతినిధి:** గురుపౌర్ణమి సందర్భంగాసాయిబాబా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. బాబా దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్నారు. క్షీరాభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు సాయి ఆలయాలకు చేరుకుని పూజలు జరిపారు.

## అర్జీల పరిష్కార తీరుపై పునఃపరిశీలనకు ప్రత్యేక యంత్రాంగం

**విజయవాడ,జూలై10,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల నుండి అధికారులకు అందే విజ్ఞప్తుల పరిశీలన,పరిష్కారం,తిరస్కృతి తీరును సమీక్షించేందుకు జిల్లాలో ప్రత్యేక యంత్రాంగం రాబోతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు.ప్రతి జిల్లా కేంద్రంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్,ఇద్దరు లేదా ముగ్గురు విశ్రాంత తహసీల్దార్‌లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు. రెవిన్యూ చట్టాలపై అవగాహన ఉన్న వారిని ఒప్పంద విధానాల్లో నియమించాలని ప్రభుత్వం కలెక్టర్లకు పంపిన ఆదేశాల్లో స్పష్టం చేసింది. వీరి ఎంపికకు మౌఖిక పరీక్షలు కూడ నిర్వహించాలని తెలిపింది. రెవిన్యూ అధికారులు తిరస్కరించిన ప్రతి అర్జీని వీరిచేత పున:పరిశీలన చేయించాలంది. పరిష్కరించిన వాటిని కూడ ర్యాండమ్ విధానంలో పరిశీలన చేయించాలని పేర్కొంది. ఐవీఆర్ఎస్,ఇతర పద్దతుల్లో ప్రభుత్వం సేకరించిన అభిప్రయాల సరళిని కూడ వీరు పరిశీలిస్తారు. మరో వైపుకొందరు ఒకే సమస్యపై రకరకాల రూపాల్లో ప్రభుత్వానికి అర్జీలు పంపుతున్నారు. దీనివల్ల ధరఖాస్తుల సంఖ్య పెరిగిపోతోంది. ఇకపై అర్జీ స్వీకరణ సమయంలో సదరు వ్యక్తి ఆథార్ నంబరు నమోదు చేయనున్నారు. దాన్ని ట్రాకింగ్ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది.

# భవిష్యత్తును తీర్చిదిద్దేది చదువే

### - మంత్రి కొండపల్లి శ్రీనివాస్ - మరడాంలో స్ఫూర్తిదాయకంగా మెగా పిటిఎం - విద్యార్థులతో సహపంక్తి భోజనం



**దత్తిరాజేరు (విజయనగరం జిల్లా), జులై 10 ప్రభాతవార్త :** చదువు ఎదుగుదలకు దోహదం చేస్తుందని, అభివృద్ధికి మార్గం చూపుతుందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. దత్తిరాజేరు మండలం మరడాం జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలోని, జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన తల్లితండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి (మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్)కు మంత్రి శ్రీనివాస్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. మంత్రికి విద్యార్ధులు, అధ్యాపకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్య మన భవిష్యత్తును తీర్చి దిద్దుతుందని అన్నారు. చదువుకోవడం ద్వారా ఉన్నత స్థానాన్ని సాధించవచ్చునని అన్నారు. విద్య కోసం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం డబ్బును విద్యార్థుల ఇతర అవసరాలకు వినియోగించాలని అన్నారు. విద్యార్థులు తమకు నచ్చిన రంగంలో ఎదిగేందుకు వీలుగా తల్లితండ్రులు, ఉపాధ్యాయులు వారికి సంపూర్ణంగా సహకారం అందించాలని సూచించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకొని, ఇక్కడ జూనియర్ కళాశాలను మంజూరు చేయడం జరి గిందని చెప్పారు. విద్యా ర్థులు తోటి విద్యార్థులతో కలిసిమెలిసి ఉండే విధానాన్ని గమనించడానికి, విద్యార్థుల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి ఈ ఆత్మీయ సమావేశాలు దోహదపడతాయని అన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరు లుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మెగా పిటిఎం అహ్లాదకర వాతావరణంలో స్ఫూర్తిదాయకంగా జరిగింది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఇతర ఉన్నతాధికారులు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులు తయారు చేసిన మెగా పిటిఎం సెల్ఫీపాయింట్ వద్ద ఫొటోలు దిగారు. విద్యార్థులతోపాటు పెద్ద సంఖ్యలో తల్లితండ్రులు కూడా ఈ సమావేశంలో భాగస్వాములయ్యారు. రంగోలి, టగ్ ఆఫ్ వార్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మహేష్ అధ్యక్షోపన్యాసం చేస్తూ పాఠశాల ప్రగతిని వివరించారు. తల్లిదండ్రులతో ముఖాముఖి నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులు తమ పాఠశాలలో విద్యాబోధన గురించి వివరించారు. తల్లులకు విద్యార్థులు పాదపుష్పార్చన చేశారు.

## సెప్టెంబర్ 24నుండి తిరుమలేశుని వార్షిక బ్రహ్మోత్సవాలు

### - అసౌకర్యం లేకుండా రోడ్‌మ్యాప్, పార్కింగ్ స్థలాలు ఎంపిక : టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల.జూలై 10ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటిబ్రహ్మండనాయకుడు...ఏడుకొండల వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది సెప్టెంబర్ 24వతేదీ నుండి అక్టోబర్ 2వరకు జరిపించేలా తిరుమల తిరుపతి దేవస్థానం ముహర్తం ఖరారుచేసింది. తొమ్మిది రోజులపాటు నిర్వహించనున్న దేవదేవుని వాహనసేవలు ఉదయం 8గంటలకు, రాత్రి 7గంటలకు మొదలవుతాయి. అన్ని ప్రత్యేక దర్శనాలు, విఐపి బ్రేక్ దర్శనాలు,దాతల దర్శనాలు కూడా రద్దుచేశారు. బ్రహ్మోత్సవాలకు దేశవిదేశాల నుండి తరలివచ్చే అశేషసంఖ్య భక్తులకు అసౌకర్యం కలగకుండా మాఢవీధుల్లో గ్యాలరీలకు చేరుకునేలా, వాహనాలకు పార్కింగ్ సదుపాయాలు తెలిపే రోడ్డుమ్యాప్ పక్కాగా ఉండేలా చూస్తున్నారు. ఈ ఏడాది వేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన చేపట్టాల్సిన ఏర్పాట్లు, సౌకర్యాలు, ప్రణాళికా బద్దంగా తీసుకోవాల్సిన భద్రత చర్యలపై గురువారం మధ్యాహ్నం తిరుమల అన్నమయ్య భవనంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అన్ని విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు సెప్టెంబర్ 16వతేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం తొలి ఘట్టంగా, 23వతేదీ శాస్త్రోక్తంగా అంకురార్పణ జరుగుతుంది. సెప్టెంబర్ 24వతేదీ సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి పెద్దశేషవాహనం, ఐదవరోజు సెప్టెంబర్ 28వతేదీ రాత్రి గరుడసేవ, అక్టోబర్ 1వతేదీ రథోత్సవం, 2వతేదీ చక్రస్నాన మహోత్సవం ముఖ్యమైన ఘట్టాలు. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రోటోకాల్ ప్రముఖులకు మినహాయించి మిగిలిన విఐపి బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దుచేశారు. వృద్దులు, దివ్యాంగులు, ఎన్ఆర్ఐ భక్తులు, దాతల ,చంటిపిల్లల తల్లిదండ్రుల దర్శనాలు రద్దు.విజిలెన్స్ పోలీసు విభాగాల సమన్వయంతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పార్కింగ్ స్థలాలు ఎంపిక పక్కాగా ఉండాలని అదనపు ఇఒ ఆదేశించారు. భక్తులకు దర్శన క్యూలైన్లు, ఆలయ మాఢవీదుల్లోకి చేరుకునేలా గ్యాలరీలు, ముఖ్యమైన ప్రాంతాల్లో విరివిగా అన్నప్రసాదాల పంపిణీకి కౌంటర్లు ,ఇంజనీరింగ్ పనులు, విద్యుద్దీపాలంకరణలు, ఫలపుష్ప ప్రదర్శన ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు శ్రీవారిసేవకు యువతీ యువకులను ఆహ్వానించిమెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలని చౌదరి ఆదేశించారు. సెప్టెంబర్ 27వతేదీ రాత్రి నుండి 29వతేదీ ఉదయం 6గంటల వరకు తిరుమల ఘాట్‌లో ద్విచక్రవాహనాలు నిషేధం..భక్తుల రద్దీకి తగ్గట్లు లడ్డూలు నిల్వవుంచుకోవాలన్నారు.

## హిందీ సలహా సమితిలో సభ్యునిగా డాక్టర్ యార్లగడ్డ

**విజయవాడ,జూలై 10,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన రెవెన్యూ విభాగం లో పునఃరూపకల్పన చేసిన సంయుక్త హిందీ సలహా సమితిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త, రచయిత ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను సభ్యునిగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీకి ఆర్థిక మంత్రి ఛైర్మన్‌గా, సహాయ ఆర్థిక మంత్రి వైస్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. విభిన్న కేంద్ర శాఖలైన రెవెన్యూ, వ్యయము, పెట్టుబడి, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కార్యాలయాల పరిపాలనలో హిందీ భాషా వినియోగాన్ని ప్రోత్సహించడమే ఈ కమిటీ ముఖ్య ఉద్దేశంగా ఉంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన పార్లమెంటు సభ్యులు, భాషా నిపుణులు, హిందీ ప్రచార సంస్థల ప్రతినిధులు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. అందులో భాగంగా లక్ష్మీప్రసాద్ గారికి అవకాశం లభించింది. పద్మశ్రీ పురస్కారాన్ని అందు కున్నారు. డా. యర్లగడ్డ, హిందీతో పాటు తెలుగు భాషా అభివృద్ధికి విశేష సేవలు అందించారు.

## గంజాయి స్మగ్లర్లపై పిట్ ఎన్‌డిపిఎస్ చట్టం

**విజయవాడ జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో గంజాయి స్మగ్లింగ్ రవాణా వంటి నేరాలకు తరచు పాల్పడుతున్నా వారిపై ఏడాది పాటు ముందస్తుగా నిర్భంధించనుంది. పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం అమలులోకి తీసుకుని వచ్చింది. ఈమేరకు ఎక్సైజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి , అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని పలువురు గంజాయి స్మగ్లర్లు రవాణాదారులపై రాష్ట్ర ప్రభుత్వం పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం ప్రయోగించింది. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలానికి చెందిన దుంగ మాణిక్యం, వి.మాడుగుల మండలానికి చెందిన బుదిరెడ్ల కొండలరావు, అల్లూరి సీతారామరాజు జిల్ల చింతపల్లి మండలానికి చెందిన గాలి సత్యనారాయణ జీకే వీధి మండలానికి చెందిన వంతల బాలు బద్దర్ ,హుకుంపేట మండలానికి చెందిన కొర్రా సీతారామ్, జి.మాడుగుల మండలానికి చెందిన వంచుర్చ కొండాబాబులు పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం ఆపాదించారు.

## జగన్ అక్రమాస్తుల కేసులు కొట్టివేయండి హైకోర్టులో దాల్మియా సిమెంట్స్

**విజయవాడ జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అక్రమాస్తుల వ్యవహారంలో నమోదు చేసిన సీబీఐ కేసును కొట్టివేయాలని కోరుతూ దాల్మియా సిమెంట్స్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అప్పటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం దాల్మియా సిమెంట్స్‌కు అక్రమ పద్దతుల్లో లీజులు కట్టబెట్టినందుకు ప్రతిఫలంగా ఆయన కుమారుడు జగన్ కంపెనీల్లో దాల్మియా సిమెంట్స్ రూ.95 కోట్ల ముడుపులను పెట్టుబడిగా పెట్టిందని సీబీఐ కేసు నమోదు చేసింది. భారత సిమెంట్స్‌లో దాల్మియా వాటాలను ఫ్రెంచి కంపెనీకి విక్రయించగా రూ.146.58 కోట్లు వచ్చింది. అందులో పెట్టుబడులపై లాభం పన్ను పోనూ రూ.139 కోట్లు మిగిలింది. ఈ సొమ్మును ఖాతాల్లో చూపకుండా హవాలా మార్గంలో జగన్‌కు రూ.55 కోట్లు అందించిందని పేర్కొంది. దాల్మియా ఉద్యోగి జాయ్‌దీప్ బసు నుంచి ఆదాయపు పన్ను శాఖ స్వాధీనం చేసుకున్న పెన్‌డ్రైవ్ నుంచిరాబట్టిన సమాచారం ప్రకారం సీబీఐ దర్యాప్తును కొనసాగించగా జేఆర్ ఖాతాలో రూ.55 కోట్లకు సంబంధించిన లావాదేవీలు బయటపడ్డాయని, జేఆర్ అంటే జగన్ మోహన్‌రెడ్డేనని పేర్కొంది. హవాలా మార్గాల్లో వచ్చిన సొమ్ముకు సంబంధించి ఆడిటర్ విజయసాయి రెడ్డికి పునీత్ దాల్మియా, దాల్మియా ఉద్యోగుల మధ్య సంకేత భాషలో ఈమెయిల్ వ్యవహారాలు నడిచాయని తెలిపింది. 3500 టన్నులు అందాయంటే రూ.35 కోట్లు అందాయంటూ కోడ్ భాషలో సాగిన ఈమెయిల్ గుట్టు రట్టయిందని సీబీఐ పేర్కొంది. అయితే అక్రమంగా నమోదు చేసిన ఈ కేసును కొట్టివేయాలంటూ దాల్మియా సిమెంట్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ చట్టవిరుద్ధంగా లీజులు మంజూరైతే జరిమానాలు ఉంటాయి తప్ప క్రిమినల్ కేసు ఉండదన్నారు. నీకది-నాకిది పెట్టుబుడులు పెట్టారని సీబీఐ ఆరోపిస్తోందని, దీన్ని విక్రయించడం ద్వారా లాభాలు వచ్చాయన్నారు. విక్రయించిన సొమ్ము జగన్‌కు అందిందని ఈ విషయం పెన్‌డ్రైవ్ ద్వారా బయటపడిందని సీబీఐ అంటోందని, ఈమెయిళ్లతో సంకేత భాష వినియోగించారాన్న ఊహాజనిత సీబీఐ నిరాకరించిందన్నారు. ఈకేసు ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆస్తులను జప్తు చేస్తోందని అందువల్ల విచారణను నిలిపివేయాలని కోరారు. సీబీఐ తరపు ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపిస్తూ ఇదే కోర్టుఇండియా సిమెంట్స్ కేసులో ఇచ్చిన తీర్పును ఆధారంగా చేసుకుని దాల్మియా సిమెంట్స్ ఈ పిటిషన్ దాఖలు చేసిందన్నారు. ఇండియా సిమెంట్స్‌పై కేసును కొట్టివేస్తూ ఈ కోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టులో అప్పీలు దాఖలు చేశామని చెప్పారు. పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేస్తామని అన్నారు. దీనికి న్యాయమూర్తి అనుమతిస్తూ విచారణను ఈనెల 23కి వాయిదా వేశారు.

# తిరుమల సమాచారం

## వేడుకగా శ్రీవారి గురుపౌర్ణమి గరుడసేవ



**తిరుమల,జూలై 10 ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన ఆషాడమాసంలో గరువారం రోజు గురుపౌర్ణమి వేళ నిండుపున్నమి వెలుగుల్లో మలయప్పస్వామి రాత్రి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకుని సహస్రదీపాలంకరణసేవలో వయ్యారంగా పూజలందుకున్నారు. అక్కడ నుంచి బయలుదేరి వాహనమండపం చేరుకున్నారు. వాహన మండపం వద్ద ఆలయ అర్చకులు విశేష అలంకారభూషితుడైన మలయప్పను కొలువుదీర్చి వేదమంత్రాల నడుమ కర్పూర హారతులిచ్చారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడవాహనం మెల్లగా ఆలయం ముందునుంచి కదులుతూ మాఢవీధుల్లో ఊరేగారు. ఈ వాహనసేవలో టిటిడి అదనపు ఇఒచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, డిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడు, విఎస్ఒలు నెట్టెం తులసీవెంకటరామ్‌కుమార్, అల్లం సురేంద్ర, ఆలయ ఏవిఎస్ఒ రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

## గంగమ్మఆలయంలో వేడుకగా చండీహోమం



**తిరుపతి,జూలై 10ప్రభాతవార్తప్రతినిధి:** రాయల సీమజిల్లాల్లోనే అత్యంత విశిష్టత మహిమ కలిగిన తిరుపతి గ్రామదేవత తాతయ్య గుంటగంగమ్మ ఆలయంలో గురువారం పౌర్ణమి వేళ చండీహోమం శాస్త్రోక్తంగా జరిపించారు. గురుపౌర్ణమి రోజున గంగమ్మ ఆలయంలో ఛండీహోమంలో గృహస్థభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఆలయ అర్చకులు, ఆలయ ఇఒ ఎ.జయకుమార్ గణపతి హోమంతో మొదలుపెట్టి అమ్మవారికి చండీ హోమాన్ని వేదమంత్రాలతో జరిపించారు. చివరగా పూర్ణాహుతితో హోమం ముగిసింది. హోమంలో పాల్గొన్న మహిళ భక్తులకు అమ్మవారి కుంకుమ, గాజులు, జాకెట్ అందజేశారు. భక్తులకు గంగమ్మదర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 15,16 రెండురోజులు విఐపి బ్రేక్ రద్దు

### -14,15న సిఫార్సు లేఖలు తేవద్దు

**తిరుమల,జూలై 10ప్రభాతవార్తప్రతినిధి:** ఆపద మొక్కులవాడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఆణిమాసం చివరన ఆణివార ఆస్థానం పురస్కరించుకుని ఈనెల 15,16తేదీల్లో రెండురోజులు విఐపి బ్రేక్ దర్శనాలు టిటిడి రద్దుచేసింది. 15వతేదీ మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ,16వతేదీ బుధవారం ఆణివార ఆస్థానం జరగనుంది. ఈ రెండు ప్రత్యేక రోజుల్లో ఆలయంలో విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేశారు. ఇదే సమయంలో 14వతేదీ, 15వతేదీ మంగళవారం కూడా విఐపి బ్రేక్ దర్శనాల సిఫార్సు లేఖలు తీసుకురావద్దని టిటిడి విజ్ఞప్తి చేసింది. భక్తులు ఈ విషయాలను గమనించి టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

## శ్రీవారి ఆశీస్సులతో శుభాలు కలగాలి: ప్రముఖులు



**తిరుమల,జూలై 10ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు ప్రముఖులు తెలిపారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్‌లో పోలీసుశాఖ ఐజి శ్రీకాంత్, సుప్రభాతసేవలో సినీ సంగీత దర్శకుడు డ్రమ్స్ శివమణి వీరిరువురూ వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వారాంతం ముందే నిండిన కొండ

### - వరుసగా రెండురోజులు సెలవులతో భారీగా భక్తులు



**తిరుమల,జూలై 10ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం రెండురోజులు ముందుగానే వరుససెలవులు రానున్న నేపథ్యంలో గురువారం ఉదయానికే తిరుమల కొండ భక్తులతోనిండిపోయింది. రానున్న రెండవ శనిఆదివారాలు వరుస సెలవులు నేపథ్యంలో గురువారం గురుపౌర్ణమి వేళ తిరుమల భక్తజన సంద్రంగా మారింది. ఏడుకొండల వెంకన్న దర్శనానికి భక్తులు భారీగా చేరారు. ఉదయానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలోని కంపార్టుమెంట్లు నిండిపోయాయి. సర్వదర్శనానికి 20గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఆరేడుగంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. సాయంత్రం వరకు 47వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. సాధారణంగా శని,ఆదివారాలు భక్తులు భారీగా తిరుమలకు వస్తారు. ప్రస్తుతం రెండురోజులు ముందుగానే చేరుకున్నారు. అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

## రోగుల పట్ల అశ్రద్ధ వద్దు :సీమ రైల్వేడివిజన్‌లో ప్రిన్సిపల్ సిఎండి నిర్మలా రాజారాం

**గుంతకల్లు రైల్వే, జూలై 10,ప్రభాతవార్త** ప్రాణాపాయస్థితిలో ఆసుపత్రికి వచ్చేరోగుల పట్ల నిర్లక్ష్యం,అశ్రద్ద వహించకుండ సరైన సమయంలో సరైనచికిత్స అందించడం ద్వారా రోగుల ప్రాణాలు కాపాడవచ్చని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ నిర్మలా రాజారాం ఉద్బోదించారు. అధికారిక పర్యటనలో భాగంగా గురువారం గుంతకల్లు రైల్వే డివిజన్‌లో పర్యటించిన ఆమె, సిఎంఎస్ డాక్టర్ జి వేణుగోపాల్ రెడ్డి, సీనియర్ డిఎంఓ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి మురళీమోహన్,ఏఎన్ఓ ఈశ్వరమ్మలతో కలిసి డివిజన్ ఆసుపత్రిలోని అన్ని విభాగాలలో సందర్శించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో డివిజన్ పరిధిలోని తొమ్మిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పేషెంట్ల ఆరోగ్య పరిస్థితిని, వివరాలను అడిగి తెలుసుకున్నారు. అవసరాలను, పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అత్యవసర కేసులను సమీపంలో ఉన్న రెఫరల్ ఆసుపత్రులకు తరలించి రోగుల ప్రాణాలను కాపాడవలసిందిగా ఆమె ఆదేశించారు.

సమావేశంలో రైల్వే ఆసుపత్రి వైద్యులు మధుకుమార్,హసీనా బేగం,హరిత,నాగరాజుయాదవ్,పవన్ కుమార్,అరుణ్ కుమార్, సిఎంఎస్ కార్యాలయ చీఫ్ ఆఫీస్ సూపరింటెండెంట్ జహంగీర్ బాషా, సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం రైల్వే కార్మిక సంఘాల ప్రతినిధులు యస్ విజయకుమార్,కె ప్రభాకర్‌లు తమ తమ సంఘ ప్రతినిధులతో పిసిఎండి నిర్మలా రాజారాంను కలిసి ఆసుపత్రిలో ఉన్న ఖాళీలను గుంతకల్లు డివిజనల్ రైల్వే ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న జనరల్ సర్జన్, గైనికాలజిస్ట్ పోస్టులతో పాటు ఖాళీగా ఉన్న పారామెడికల్, మినిస్టీరియల్ సిబ్బంది పోస్టులను, రైల్వే సిబ్బంది, వారి కుటుంబ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని తాజాగా ఎర్ర గుంట్లలో ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.


ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, Vijayawada - 520002 (A.P.)
NIT No.:52/MIS/Dir/Plng/552/2017/VJA, Dated:28.06.2025
E Procurement Tender Notice
Name of Work :APCRDA-"RFP for selection of consultant for preparation of Urban Design and Architectural Guidelines and Regulations for Amaravati Capital City"-Publication".
The bid can be downloaded on AP e-procurement portal from 11.07.2025 to 28.07.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid is 28.07.2025 up to 15.00 Hrs, Technical bid opening 28.07.2025 @16.00Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Commissioner, APCRDA, Vijayawada

వార్త

విజయానికి కావలసిన సూత్రాన్ని చెప్పేకంటే, ఓటమికి కావలసిన సూత్రం చెప్పడం సులభం.

-మెర్బర్ట్ బే ఆర్డ్ స్వోపే

# ఆరోగ్యాన్ని కాటేస్తున్న కాలుష్యం!

కాలుష్య నివారణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణయోగ్యం కాని విధానాలతో ప్రయోగాలు చేస్తూ రోజురోజుకు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా పాలకులు కాలుష్యనివారణకు రూపొందిస్తున్న నిబంధనలు, చట్టాలను త్రికరణశుద్ధిగా అమలు చేయకపోవడంతో పర్యావరణం విషతుల్యంగా మారుతున్నది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది రకరకాల వ్యాధులకు లోనవుతున్నారు. ఇందులో కొందరు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి మంచానికే పరిమితమై కృంగి, కృశించి అసువులు బాస్తున్నారు. అంతకంతకు కాలుష్య మేఘాలు ప్రజారోగ్యాన్ని చుట్టుముట్టడం ఆందోళన కలిగిస్తున్నది. దేశంలో ప్రధానంగా అనేక నగరాల్లో పరిస్థితి దారుణంగా తయారవుతున్నది. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం అదుపు తప్పిపోతున్నది. గత యేడాది శీతాకాలంలో పదిరోజుల పాటు పాఠశాలలకు సెలువులు ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఢిల్లీలోనే కాదు దేశంలో అనేక నగరాల్లో కాలుష్య పరిస్థితి ప్రమాదకర స్థాయికి చేరుకుంటుందనే వార్తలు వెలువడుతున్నాయి. కోల్‌కతా, ముంబాయి నగరాలతోపాటు దక్షిణాదిలోని బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలలో వాయు నాణ్యత క్షీణిస్తున్నది. ఢిల్లీకి పొరుగునున్న యుపి, హర్యానా, పంజాబ్, రాజస్థాన్‌లలో కూడా ఈ కాలుష్యరక్కసి యేడాది యేడాదికి విజృంభించింది. ప్రధానంగా పంట పొలాల్లోని వ్యర్థాలను దగ్ధం చేయడంతో వ్యాపిస్తున్న పొగ చుట్టుముడుతున్నది. పర్యావరణం, నీటి, గాలి, నాణ్యత, వాతావరణంలో మార్పులు, అటవీ విస్తీర్ణం తగ్గడంతోపాటు చెత్త నిర్వహణలో లోపాలు కారణంగా వాయుకాలుష్యం నగర జీవి ఊపిరితిత్తులకు తూట్లు పొడుస్తుందన్న విషయం అనేక సర్వేల్లో వెల్లడవుతున్నది. మరికొన్ని నగరాల్లో పారిశ్రామిక కాలుష్యం అగ్రస్థానంలో ఉంది. హైదరాబాద్ నగరంలో నీటి, వాయు కాలుష్యంతోపాటు నిర్మాణంలో రంగంలో పీల్చేగాలిలో ధూళికణాలు అధికంగా ఉన్నట్లు వెల్లడవుతున్నది. మురికివాడల నిర్మూలకు ప్రత్యేక కార్యక్రమాలు తీసుకుంటున్నా మరొక పక్క పెరిగిపోతున్న వలసలతో సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. కాలుష్యాన్ని తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా సఫలీకృతం కావడం లేదు. నేషనల్ ఎయిర్ ప్రోగ్రామ్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఐదేళ్ల క్రిందట చేపట్టిన కార్యాచరణ ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోతున్నది. గత నాలుగేళ్లుగా వందలాది కోట్లు ఖర్చు చేస్తున్నా హైదరాబాద్, రంగారెడ్డిలో వాయుకాలుష్యం ఆందోళనకర స్థాయిలో ఉంటున్నది. వాయుకాలుష్యం కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల కంటే దాదాపు ముప్పైశాతంపైగా అధికంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల కంటే వందశాతానికిపైగా నమోదవుతున్నది. దేశవ్యాప్తంగా వందలాది నగరాల్లో, పట్టణాల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ఉండాల్సిన నలభై మైక్రోగ్రాముల కంటే మించి కణాలు ఉంటున్నాయి. దాంతో జాతీయ హరిత న్యాయస్థానం 2018 ఆదేశాల మేరకు కేంద్ర పర్యావరణ శాఖ దేశంలోనే 130 నగరాలు, పట్టణాలకు దీన్ని తగ్గించే లక్ష్యంగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి హైదరాబాద్, సంగారెడ్డిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమాన్ని అమల చేసేందుకు రాష్ట్ర జిల్లాస్థాయిలో కమిటీలను వేశారు. నాలుగేళ్లలో ఆరువందల కోట్ల రూపాయలకుపైగా విడుదల చేశారు. కానీ ఆశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. ఇప్పటివరకు కేవలం నాలుగువందల యాభైఐదు కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. దేశవ్యాప్తంగా 2025-26 నాటికి సూక్ష్మకణాలను నలభైశాతానికినియంత్రిస్తామంటూ లక్ష్యాన్ని నిర్దేశించుకొని కోట్లాది రూపాయలు వెచ్చించినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు రావడం లేదు. పంజాబ్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, యుపి తదితర రాష్ట్రాల్లో నిబంధనలను పట్టించుకోవడం లేదు. అంతర్జాతీయంగా ప్రధానంగా చైనా, అమెరికా లాంటి దేశాల్లో వాయుకాలుష్యాన్ని నియంత్రించడంలో సఫలీకృతం అవుతున్నట్లు అనేక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. కాలుష్యానికి మూలమైన దాదాపు ఐదువందలకు పైగా కార్ల మోడళ్లను నిషేధించి ప్రజారవాణా వ్యవస్థను కాలుష్యరహితంగా మార్చేందుకు చైనా తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలు ఇచ్చాయి. బొగ్గు ఆధారిత, విద్యుత్ కర్మాగారాల నిర్మాణాలకు దాదాపు ఫుల్‌స్టాప్ పెట్టించి అడవుల సంరక్షణకు ప్రత్యేక దృష్టి సారించింది. మన దేశంలో పర్యావరణాన్ని కాలుష్యం చేస్తూ మోతాదుకు మించి పొగను వదులుతున్న వాహనాల సంఖ్య కోట్లల్లో ఉండొచ్చు. వాటిని నియంత్రించేందుకు ఎన్నో చట్టాలు తీసుకువచ్చారు. నిబంధనలను విధించారు. జరిమానాలు వేస్తున్నారు. కానీ అవేమీ ఆగడం లేదు. ఫలితంగా వాతావరణంలో కార్బన్‌మోనాక్సైడ్, నైట్రిక్ ఆక్సైడ్, దుమ్ము, ధూళి పెరిగిపోతున్నది. మొత్తం మీద తీవ్రస్థాయిలోవెలువడుతున్న విషవాయువుల వల్ల పర్యావరణం విషతుల్యమై అనేక వ్యాధులకు లోనవుతున్నారు. వాయు కాలుష్యం మంచి కొలెస్ట్రాల్‌ను చెడు కొలెస్ట్రాల్‌గా మారుస్తూ గుండెజబ్బులకు కారణమవుతూ, పక్షవాతానికి, ఊపిరితిత్తుల కేన్సర్‌లకు మూలమవుతుందనే విషయం అనేక పరిశోధనల్లో బయటపడుతున్నది. ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఈ కాలుష్య భూతాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉంది. సమస్య తీవ్రతను గుర్తించి నివారణకు ఆచరణయోగ్యమైన విధానాలను ప్రకటించడమే కాదు, అమలుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాలి. అన్నింటికంటే ముఖ్యంగా పర్యావరణం పట్ల అన్నివర్గాల ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి జరగాలి.

> నిరంతరం నేర్చుకుంటూ ఉంటే తప్ప ఉపాధ్యాయుడనే వాడు నిజంగా మరొకరికి విద్య నేర్పలేడు.



రాగూర్

> ఎంత గొప్ప చదువు అయినా, ప్రావీణ్యత అలవాటు అవ్వాలంటే అది చెప్పే వారిపై ఆధారపడి ఉంటుంది.



మహాత్మాగాంధీ

# పాఠశాల విద్య 12 దాకా పొడిగింపు అవసరం

**ప్రస్తుతం యువతలో నేటి చదువులు బ్రతుకు తెరువు చూపడం లేదని, జీవనోపాధికి తోడ్పడడం లేదని, చదువుకోన్నందుకు లేక చదువుకున్నందున ప్రయోజనం చేకూరడం లేదని నిరాశ నిర్లిప్తతకు లోనౌతున్నందున వృత్తి విద్యల ద్వారా ఉపాధి సౌకర్యం సమకూర్చుకొని పూర్తి ప్రయోజనం పొందే అవకాశం సమకూరుతుంది. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఇంటర్మీడియట్ బోర్డు రెండు విలీనంతో ఒక బోర్డు నిర్వహణకు అయ్యే వ్యయంలో కొంతమేరకు పొదుపు చేసుకొని ఆ నిధులను కూడా విద్యారంగానికి వెచ్చించే అవకాశం ఉంటుంది. ఈ రెండు బోర్డులు విలీనం వల్ల పలు ప్రయోజనాలు పొందే అవకాశం ఉన్నందున పైగా ఎటువంటి నష్టం లేనందున రాష్ట్ర ప్రభుత్వం సానుకూల చర్య చేపట్టి వచ్చే విద్యా సంవత్సరం నుండి పాఠశాల విద్యలోనే పదకొండు, పన్నెండు తరగతులు ఏర్పాటు చేయాలని, విద్యార్థులు ప్రయోజనం పొందాలని కోరుకుందాం.**

కొల్లు మధుసూదనరావు

భారతదేశంలో విద్యారంగాన్ని సమూలంగా సంస్కరించాలనే ఉద్దేశంతో, పాఠశాల విద్య నుండి ఉన్నత విద్యవరకు అన్ని స్థాయిలలో విప్లవాత్మక మార్పు తేవాలనే లక్ష్యంతో జాతీయ విద్యావిధానం 2023 ప్రవేశపెట్టడమైనది. విద్యా దశలు గతంలో 10+2+3, 10 సంవత్సరాలు పాఠశాల విద్య, రెండు సంవత్సరాలు ఇంటర్, మూడు సంవత్సరాలు డిగ్రీ ఉండగా నూతనంగా విద్యా విధానం 5+3+3+4 గా 21వ శతాబ్దపు ఆకాంక్షలకు అనుగుణంగా బాల్య విద్య, నైపుణ్యాభివృద్ధి, వృత్తి శిక్షణకు అవకాశం కల్పిస్తూ, జీవితాంతం అభ్యసనాన్ని ప్రోత్సహించడానికి, ఏకీకృతం చేయడానికి నూతన విద్యా విధానం ప్రవేశపెట్టడమైనది. గతంలో పాఠశాలవిద్య 1వ తరగతి వయస్సు ఆరు సంవత్సరాల నుండి ఆరంభమయ్యే అవకాశం ఉండగా ప్రస్తుత అవసరాల్ని గుర్తించి పిల్లల్లో ప్రజ్ఞాలబ్ధి పెరిగినందున, భవిష్యత్తుకు పునాది వేస్తున్నందున పిల్లల్లో ఆసక్తి, ప్రాథమిక నైపుణ్యాల అభివృద్ధికి, సామాజిక, భావోద్వేగాభివృద్ధి అత్యావశ్యకమైనందున నూతనంగా బాల్యవిద్యను మూడు సంవత్సరాల నుండే ప్రవేశపెట్టడమైనది. ఇది పునాది దశ (వ్యవధి 5సంవత్సరాలు, వయస్సు 3నుండి 8సంవత్సరాలు) ఈ ఐదు సంవత్సరాల్లో మూడు సంవత్సరాలు ప్రీస్కూల్ లేక అంగన్‌వాడి, 1,2 తరగతులు. ఈ స్థాయిలో పిల్లలు మానసిక, శారీరక అభివృద్ధికి ప్రాధాన్యత చేకూర్చే ఆట, పాట ఆధారిత అభ్యసనంతో పాటూ కళలు, సంగీతం, కమ్యూనికేషన్ నైపుణ్యాల అభివృద్ధికి, పాఠశాలకు అలవాటు ప్రక్రియను ప్రోత్సహిస్తుంది. మొదటి దశ (వ్యవధి 3సంవత్సరాలు, వయస్సు 8 నుండి 10 సంవత్సరాలు) 3 నుండి 5 తరగతిలో ఉంటాయి. మాట్లాడడం, చదవడం, రాయడం, శారీరక విద్య, భాషలు, కళ, సైన్స్, గణితం మొదలగు విషయాల పరిచయం, అధ్యయనం జరుగుతుంది. మధ్యదశ (వ్యవధి 3సంవత్సరాలు, వయసు 11 నుండి 14 సంవత్సరాలు) ఇందులో 6, 7,8 తరగతులు ఉంటాయి. ఈ దశలో పిల్లలు విభిన్న విషయాలపై లోతైన అవగాహన పెంచుకుంటారు. వివిధ రంగాలలో నైపుణ్యాలను వృద్ధి చేసుకుంటారు. ఉన్నత దశ (వ్యవధి 4 సంవత్సరాలు, వయసు 14 నుండి 18 సంవత్సరాలు) ఇందులో రెండు దశలు ఉంటాయి. ఒకటి 9,10 తరగతులు రెండవది 11,12 తరగతులు, ఈ దశలో విద్యార్థులుతమకు నచ్చిన విషయాలను ఎంపిక చేసుకొని ఉన్నత విద్యకు సిద్ధమవుతారు. ఈ నాలుగు సంవత్సరాలు క్రిటికల్ థింకింగ్ తో పాటు మల్టీ డిస్కోనరీ అధ్యయనం పెంపొందించుకుంటారు. ఈ నూతన విద్యావిధానాన్ని పాఠశాల విద్యలో పదకొండు, పన్నెండు తరగతుల విలీనం చేయడానికి దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాలు మినహా అన్ని రాష్ట్రాలు సమ్మతిని ప్రకటించాయి. అయితే తెలంగాణ ప్రభుత్వం ఒకే బోర్డు



ఏర్పాటుకు సలహాలు, సూచనలు, ప్రయోజనాలు, నష్టాలు వ్యక్తపరచాలని కోరడమైనది. ఈ ప్రతిపాదన అధునాతనమైనదికాదు. ప్రస్తుతం కేంద్రీయ పాఠశాలల్లో కొనసాగుతుంది. మన రాష్ట్రంలో కూడా గతంలో మల్టీపర్పస్, హైయర్ సెకండరీ పాఠశాలలు ఉండేవి. వాటివల్ల కూడా పలుప్రయోజనాలు సాధించడమైనది. పాఠశాల విద్యలో పదకొండు పన్నెండు తరగతుల ఏర్పాటు వల్ల పలు ప్రయోజనాలు చేకూరే అవకాశం ఉంది. అవి దేశవ్యాప్తంగా ఒకే విద్యా విధానానికి తోడ్పాటు, దేశవ్యాప్తంగా ఒకే విద్యా విధానం వల్ల విద్యార్థులకు పలు ప్రయోజనాలు చేకూరుతాయి. ముఖ్యంగా విద్యార్థులు ఎక్కడ చదివినా ఒకే సిలబస్ పరీక్ష విధానం, ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి మారే అవ కాశం సమకూరుతుంది. విద్యాపరమైన పేద, ధనిక అంత రాలను తొలగించడానికి, నాణ్యత మెరుగుపరచడానికి తోడ్పడుతుంది. సమైక్యత భావాన్ని పెంపు చేసి సమాజానికి ఎంతో మేలు చేకూర్చుతుంది. పదవ తరగతి తదనంతరం పై చదువులు కొనసాగించలేక జరుగుతున్న డ్రాప్ ఔట్స్ ను నివారిస్తుంది. పదవ తరగతి తదనంతరం సుమారు 20 శాతం మంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందు లపై చదు వులు అందుబాటులో లేనందున చదువుకు స్వస్తి చెప్పి నిష్ప్రయోజకులుగా రూపొందుతున్నారు. పాఠశాల లోనే పదకొండు పన్నెండు తరగతులు ఉంటే విద్యార్థుల డ్రాప్ ఔట్స్‌ను పూర్తిగా నిరోధించే అవకాశం చేకూరుతుంది. గ్రామీణ ప్రాంతాలలో ఉండే ఉన్నత పాఠశాలలోనే పై చదువులు కొనసాగించే అవకాశం ఉన్నందున పట్టణాలకు వలసలు తగ్గిపోవడమే కాక గ్రామీణాభివృద్ధికి దోహదకారి అవుతుంది. భారతదేశంలో 2001 జనాభా గణన ననుసరించి 14.4 మిలియన్ల మంది గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు రోజువారి పని, ఉన్నత చదువులకు వలసలు జరుగుతున్నాయి. దీనివలన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కృంగిపోతుంది. పట్టణీకరణ పెరిగి పలు సమస్యలు ఉత్ప న్నమవుతున్నాయి పదకొండు, పన్నెండు తరగతుల లోవృత్తి విద్యలు అభ్యసించే అవకాశం ఉన్నందున స్వయం ఉపాధి సమకూర్చుకోవడానికి, నిరుద్యోగ నిర్మూలనకు తోడ్పడు తుంది. ప్రస్తుతం యువతలో నేటి చదువులు బ్రతుకు తెరువు చూపడం లేదని, జీవనోపాధికి తోడ్పడడం లేదని, చదువుకోన్నందుకు లేక చదువుకున్నందున ప్రయోజనం చేకూరడం లేదని నిరాశ నిర్లిప్తతకు లోనౌతున్నందున వృత్తి విద్యల ద్వారా ఉపాధి సౌకర్యం సమకూర్చుకొని పూర్తి ప్రయోజనం పొందే అవకాశం సమకూరుతుంది. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఇంటర్మీడియట్ బోర్డు రెండు విలీనంతో ఒక బోర్డు నిర్వహణకు అయ్యే వ్యయంలో కొంతమేరకు పొదుపు చేసుకొని ఆ నిధులను కూడా విద్యారంగానికి వెచ్చించే అవకాశం ఉంటుంది. ఈ రెండు బోర్డులు విలీనం వల్ల పలు ప్రయోజనాలు పొందే అవకా శం ఉన్నందున పైగా ఎటువంటి నష్టం లేనందున రాష్ట్ర ప్రభుత్వం సానుకూల చర్య చేపట్టి వచ్చే విద్యా సంవత్సరం నుండి పాఠశాల విద్యలోనే పదకొండు, పన్నెండు తరగతులు ఏర్పాటు చేయాలని, విద్యార్థులు ప్రయోజనం పొందాలని కోరుకుందాం. •

# జన్మ పాపమా? ఆడజన్మ శాపమా!

వాసి జ్యోత్స్న

పురిటి బిడ్డ నుండి పండు ముసలి దాకా రక్షణ కోసం గావుకేకలేస్తుంటే ఎందరో తల్లులు కడుపు కోతతో గుండెలు బద్దలవుతుంటే ఎక్కడ వెతకాలి న్యాయం. దగాకోరు రాజ్యం అనాలా! దుండగులతో ప్రజాస్వామ్యం నిండి పోయింది అనాలా! సరి చేసేది ఎవరు! చెయ్యడానికి ప్రయత్నిస్తుందెవరు! నెలలతో నిండిన గర్భిణీని చూసినా కామమే, నెలల బిడ్డను చూసినా కామమే, నేలపై నడుస్తున్న ఆడపిల్లని చూసినా కామమే, రేపో మాపో పోయే ముసలమ్మను చూసినా కామమే... అసలు "తప్పెక్కడ జరుగుతుంది' తల్లిదండ్రుల పెంపకంలోనా! పెరిగే వాతావరణమా! స్నేహితుల సహవాసమా! అమ్మ రొమ్ము పాలు తాగే కదా అంతవాళ్లు అవుతారు మరి. ఆకలి తీర్చిన రొమ్మును చూస్తే అంత కామమెందుకు మగ జాతికి. చెప్పాలంటే మగ జాతి అంటే మంచివాళ్ళు వస్తారు. అలాంటి ఆలోచనలు కలిగిన జాతిని మృగజాతి అనాలి. ఆడపిల్ల పేరులోనే వేరు చేసింది సమాజం. ఆడ పిల్ల అంటే పుట్టిల్లు తనది కాదు. అత్తింటి వారు అక్కున చేర్చుకోరు. అన్ని బాధలు, అవమానాలుపడి జీవితాన్ని గెలవాలని ప్రయత్నిస్తుంటే బజారు కుక్కల్లామీద పడి పీక్కుతింటున్నారెంటిరా..? మగాడితో సమానంగా విజయకేతనం ఎగురవేస్తున్నారు ఆడవాళ్లు. అంతరిక్షయాణం చేస్తున్నారు. దూరదేశాలు వెళ్ళి విద్యానభ్యసించి శభాష్ అనిపించుకుంటున్నారు. వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడి బేషుగ్గా బ్రతుకుతున్నారు. తమకు తాము గౌరవం తెచ్చుకోవడమే కాకుండా కన్నవారికి ఆత్మ గౌరవాన్ని ఇచ్చి సంతృప్తినిస్తున్నారు. కంటే కూతుర్నే కానాలి అనిపించుకునే రీతిగా నేడు ఆడపిల్లలు వున్నారు. ఉన్న ఊరికి, కన్నతల్లికి పేరు తీసుకురావడమే కాకుండా దేశానికి మంచి పేరు తీసుకువచ్చేందుకు మంచిగా కష్టపడుతున్నారు. అలాంటి బంగారు తల్లుల భవిష్యత్‌కి బాటలు వేయాలి గాని, బీటలు వేసి తగలెట్టేస్తూ, ముక్కలు చేస్తూ ముచ్చటైన జీవితాన్ని చెల్లా



చెదురు చేసేస్తున్నారు అసలు తప్పెక్కడ జరుగుతుంది. శిక్షలు లేవనా! న్యాయస్థానలు తీర్పులు త్వరపెట్టలేవనా! పట్టించుకునే నాయకులు లేరనా! ఎక్కడ ఎక్కడ తెలుసుకునే ప్రయత్నం చెయ్యండి ప్లీజ్.. ప్లీజ్.. ఒడిని చేర్చుకొని పాలిచ్చి, లాలించి పెంచిన నీ తల్లీ ఒక ఆడది. గుండెలకు హత్తుకుని నీ ఇచ్చను తీర్చి మరో బిడ్డకు జన్మ నిచ్చే నీ ఆలీ ఒక ఆడది. అది మరచిపోయి విషం జిమ్మే పాములా బుసకొడుతూ ఆడదాని ఉసురు పోసుకోవద్దు. ప్రభుత్వాలు మారాలి అని కోరుకోవడం కాదు వాడొచ్చి ఏం చేసాడు. వీడొచ్చి ఏం పీకాడు అని కాదు మనిషిగా మన విజ్ఞత ఏమైంది మొదట తెలుసుకోవాలి కదా! ఇప్పటికీ మించి పోయింది ఏమీ లేదు. తప్పు జరిగిన చోట శిక్షలు కఠినంగా అమలు చెయ్యండి. ప్రజల్లో మార్పు వచ్చేలా జీవోలు తీసుకురండి. వ్యక్తిత్వాలు మారాలి. ఆడది వ్యసనం కాదు జీవితాన్ని ప్రసాదించిన దేవత అని తెలిసేలా చెయ్యాలి. తప్పు జరిగాకా అన్ని టీవీ ఛానల్స్‌లో మూడు రోజులు ఒకే దృశ్యాన్ని చూపించి చూపించి ప్రజలకి పిచ్చెంకించడం కాదు. తప్పు చేసినోడి ముసుగు తీసి ఏలాంటి శిక్ష విధించారోఅదే టీవీ ఛానెల్స్‌లో ఒక్కరోజు చూపించినా తప్పు చెయ్యాలి అనే ఆలోచన వచ్చినోడు కూడా కుక్కిన పేనులా పడుంటాడు. విధి విధానాలు మారాలి. మనం బావున్నాం అది చాలు అనుకుంటూపోతే దేశంలో ఆడజాతి అంతరించిపోతుంది. అప్పుడు భవిష్యత్‌లో మగవారికి సరిపడా ఆడపిల్లలు దొరకరు. అప్పుడు అడవుల్లో జంతువుల మాదిరి దేశంలో పరిస్థితి. అంటే, బలహీన జంతువును బలం కలిగిన జంతువు పీక్కు తిన్నట్టు ఉంటుందన్నమాట. ప్రస్తుతం మన దేశంలో సగం ఈమాదిరి ఉందని నిర్మొఖమాటంగా చెప్పవచ్చు. ఇంకా చెప్పాలంటే ఆడపిల్లల్ని కనడానికి భయపడే పరిస్థితులు లేక పోలేదు. కాకపోతే, పుట్టిన బిడ్డకు ఒడ్ల గింజవేసి చంపేసే ఆరోజుల నుండి పుట్టి ఊయలూగే బిడ్డను తీసుకెళ్లి తన కోర్కెలు తీర్చుకునేంతగా మారింది దేశ భవిష్యత్. తప్పు తెలుసుకోవాలి. తెలియజేసే చర్యలు చేపట్టాలి. 'గాంధీ' చెప్పినట్టు ఒక చెంపమీద కొడితే మరోచెంప చూపించే అహింసా వాదం లేదిప్పుడు". తల్లడిల్లుతున్న ఆడబిడ్డల తల్లులకు ప్రశాంతత కావాలి. రగిలే గుండెలకు శాంతి కావాలి. •

# ప్రజావాక్కు



### టర్కీని నిషేధించాలి

**పాకిస్థాన్‌లోని** ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో టర్కీ బహిరంగంగా పాక్‌కు మద్దతు ప్రకటించింది. అంతేకాక పాకిస్థాన్‌కు పలు రకాల ఆయుధాలను సైతం సరఫరాచేసింది. ఇది భారత ప్రజల్లో తీవ్రవ్యతిరేకతకు దారితీసింది. ఫలితంగా, బాయ్‌కాట్ టర్కీ అనేనినాదం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమవుతోంది. టర్కీలో భూకంపం విపత్తు సంభవించినప్పుడు, భారత్ ముందుండి అగ్రరాజ్యాల కంటే మిన్నగా సహాయ సహకారాలను అందించి తన దాతృత్వం, మిత్రవైఖరిని చాటుకుంది. అయితే ఇదంతా మరిచిపోయి టర్కీ ఉగ్రవాదాన్ని పెంచి పోషించే పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతు పలకడం సహించరాని విషయం. ఇటువంటి సహాయం పాకిస్థాన్‌పై ఉగ్రవాద దాడులను మరింత ప్రేరేపిస్తుంది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### పాత స్టేషన్ పాయింట్లు కేటాయించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఉపాధ్యాయ బదిలీల్లో2021ట్రాన్స్ఫర్స్‌లో బదిలీకాబడి2023 2025 సంవత్సరాల వరుసగా రెండుసార్లు రేషనలైజేషన్‌కు గురి కాబడుతున్న ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారు. వారికి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పాత స్టేషన్ పాయింట్లు 2021నుంచి 2023వరకు అనగా రెండు సంవత్సరాల కాలంమాత్రమే వస్తున్నాయి. దీంతో ఆ ఉపాధ్యాయులు బదిలీలలో స్టేషన్ పాయింట్లలో వెనుకబడుతున్నారు. కావున దీన్ని సరిచేసి 2021 లో ట్రాన్స్ఫర్ కాబడి 2023, 2025 సంవత్సరాలలో వరుసగా రెండుసార్లు రేషనలైజేషన్ గురికాబడిన ఉపాధ్యాయులకుపాత స్టేషన్ పాయింట్లు ఎనిమిది సంవత్సరాలు ఇవ్వాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### ప్రత్యేక హోదా కల్పించాలి

ప్రాథమిక పాఠశాల నుండి యూనివర్సిటీ స్థాయి వరకు విద్యాసంస్థలలోపాఠశాలస్థాయి, కళాశాల స్థాయిలో, గురుకుల పాఠశాలలో కళాశాలలో లెక్చరర్, టీచర్స్, యూనివర్సిటీ స్థాయిలో డాక్టరేట్‌పట్టా పొందిన వారిని గుర్తించి తగిన గుర్తింపు ఇవ్వాలి. విద్యార్థులకు తొటి టీచర్స్ లెక్చరర్స్‌లకు ఆదర్శం. స్ఫూర్తి దాయకంగా ఉంటుంది.

- రాపాక రవీందర్, జనగాం

### నేపాల్ ప్రధాని వ్యాఖ్యలు సమంజసం కాదు

శ్రీరాముడి జన్మస్థలం మీద నేపాల్‌ప్రధాని ఒలీ శర్మ వివాదాస్పద మాటలు సమంజసంకాదు. భారత్ లోని అయోధ్య రాముడి జన్మస్థలం ఇక్కడ పెద్దఎత్తున దేవాలయం కట్టించా రు. నిత్యం లక్షలాది భక్తులు రామ భక్తితో అయోధ్య వెళుతూ వుంటారు. నేపాల్ ప్రధాని మతి కోల్పోయి శివుడు విశ్వామిత్రులు రాముడు నేపాల్‌లో పుట్టారని మాట్లాడుతూ భారతీయులను రెచ్చగొడుతూ వున్నారు. మొదటి నుండి సంచలన వ్యాఖ్యలు చేయడం వారికి అలవాటుగా మారింది. ఒలి శర్మ హుందాగా ఉంటూ తన మాటలను వెనక్కు తీసుకోవాలి.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### ఆర్థిక స్వావలంబన

**ఉపాధి** హామీ కేవలం ఆర్థిక శక్తికి ఇచ్చేది మాత్రమే కాదు. కూలీలా స్వీయ అభిమానంను పెంచేదికూడా. 1982లో వచ్చిన డ్వాక్రా పథకం కానీ శివరామ కృష్ణన్ కమిటీ సిఫారసులతో వచ్చిన చిన్న పరిశ్రమలు ఫామ్ చేసే లేదా వాటికి ఆలంబనగా నిలిచే పథకాలు కానీ మహిళలను శక్తివంతం చెయ్యడానికి అని మాత్రమే గమనించాలి. ఉపా డ్వాక్రాలో లోన్ తీసి దానిలో పాడి పశువులను కొనుగోలు చేసి వాటిని ఉపాధి హామీ ద్వారా షెడ్స్ ఫామ్ చేస్తే జంతు సంపద పెరగడంతో పాటు ఆస్తి నిలబడుతుంది అనేది నిర్వివాదాంశం అంత మాత్రమే కాదు ఉపాధి హామీలో పశువులకు ఉపయోగపడే నీటి తొట్లు నిర్మాణం కూడా చేపట్టవచ్చు. ఇకపోతే గొర్రెల, కోళ్ల పెంపకం వాటికి సంబంధించిన కొట్టాల నిర్మాణం చేపట్టడం ద్వారా కూడా ఆర్థిక స్వావలంబన చేపట్టవచ్చు.

-భారత అవినాష్, జనగామ

### డిఏ బకాయిలు చెల్లించాలి

**కరోనా** సమయంలో నిలిపివేసిన 18 నెలల డిఏ బకాయిల చెల్లింపు విషయంలో నేషనల్ కౌన్సిల్ అఫ్ జాయింట్ కన్సల్టేటివ్ మెషినరీ స్టాండింగ్ కమిటీ 63 వ సమావేశంలో ప్రభుత్వం తిరిగిచెల్లించాలి అనివాక్కాణించడం కొంచెం సహృదయనతో ఆలోచించవలసిన విషయం. ఆ సమయములో చాలా కుదేలైన ఆర్థిక వ్యవస్థవల్ల ఈ నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది. అంతేకాని ఎవ్వరి జీతాలు ఆపలేదుకదా. సరిఅయిన పనులు లేక దుర్భర స్థితిలో ఉన్న జనాలను, వ్యవస్థలను చూసాం. 8వ వేతన సంఘం పూర్తిగా అమలు చేయాలి.

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# జనాభా నియంత్రణపై అవగాహన పెంచాలి



రామ కిష్టయ్య సంగనభట్ల

నిర్ణీత ప్రాంతంలో నివసించే ఒకే జాతికి చెందిన జీవుల సమూహమే జనాభా. ఒక నిర్ణీత కాల వ్యవధిలో జనాభాలో వచ్చే జననాల సంఖ్యను జనన రేటు అంటారు. ఇందులో సమగ్ర జనన రేటు, విశిష్ట జనన రేటు, శక్యార్థ జనన రేటు, జీవావరణ జనన రేటు అనే వివిధ లెక్కింపు విధానాలున్నాయి. అలాగే మరణాల రేటులో సమగ్ర, విశిష్ట, శక్యార్థ, జీవావరణ మరణ రేట్లు ఉంటాయి. మరణాల రేటుకంటే జననాల రేటు ఎక్కువ ఉన్నపుడే ఆ జనాభా పరిమాణం పెరుగుతుంది. రోజు రోజుకు పెరిగిపోతున్న జనాభా, తద్వారా తలెత్తే దుష్పరిణామాలను వివరించేందుకు, సమస్యలపై అవగాహన కలిగించేందుకు ఏటా జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదల, తగ్గుదలకు సంబంధించిన విషయాలపై ప్రజలలో చైతన్యం కలిగించడానికి ఐక్యరాజ్య సమితి 1989లో దీనిని ప్రారంభించింది. 1987న జన్మించిన ఒక శిశువుతో ప్రపంచ జనాభా 500 కోట్లకు చేరింది. ఆరోజునే ప్రపంచ జనాభా దినంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. 1989 నుండి జులై 11వ తేదీన ప్రపంచ జనాభా దినోత్సవంగా పాటిస్తున్నారు. ప్రపంచ జనాభాలో 40 శాతం మూడవ ప్రపంచ దేశాలైన ఇండియా, చైనాలలోనే ఉన్నారు. ప్రపంచ జనాభా ప్రతి సంవత్సరం 9కోట్ల 20లక్షలు అదనంగా పెరుగుతోంది. 1850లలో మొదటిసారి జనాభా వందకోట్లను దాటింది. అక్కడి నుంచి కేవలం 150 ఏళ్ల కాలంలోనే 650 కోట్లను దాటేసింది. వచ్చే యాభైఏళ్లలో 900కోట్లకు చేరుకుంటుందని అంచనా. ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం 2024కల్లా భారత్, చైనాల జనాభా 1.44 బిలియన్లుగా ఉంటుంది. అప్పటికే చైనా జనాభాను మించుతుంది. భారతదేశంలో 1872నుంచి 2011 వరకు మొత్తం 15 పర్యాయాలు జనగణన చేశారు. 2011లో 15వసారి 28 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాల్లో జనగణన నిర్వహించారు. అప్పటికి తెలంగాణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఉంది. భారతదేశంలో తెలంగాణ 29వ రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత జనగణన ఒక్కసారి కూడా చేపట్టలేదు. 2011 గణాంకాల ప్రకారం భారతదేశ జనాభా 1,21,05,69,573. తెలంగాణ రాష్ట్ర జనాభా 3,51, 93,978. తెలంగాణ ప్రస్తుత జనాభా 3,50,03,674. ఖమ్మం జిల్లాలో 327 గ్రామాలను (7 మండలాలు) ఆంధ్రప్రదేశ్‌లో కలిపారు. 2011లో భారతదేశ జనాభా వృద్ధిరేటు 17.7శాతం. రాష్ట్రంలో 2011 మధ్య కాలంలో జనాభా వృద్ధిరేటు 13.58 శాతం. 2011 లెక్కల ప్రకారం భారత్‌లో సగటు పట్టణ జనాభా శాతం 31.2 ఉండగా, రాష్ట్రంలో పట్టణ జనాభా శాతం 38.67గా ఉంది. అంటే రాష్ట్ర పట్టణ జనాభా జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉన్నట్లు గమనించవచ్చు. రాష్ట్రంలో గ్రామీణ జనాభా ప్రస్తుతం 213.95 లక్షల మంది. రాష్ట్ర మొత్తం జనాభాలో గ్రామీణ జనాభా వాటా ప్రస్తుతం 61.12 శాతం. 2020



మార్చి నాటికి ప్రపంచ జనాభా7.8 బిలియన్లకు చేరినట్లు అంచనా. 2023 వరకు 8 బిలియన్లకు, 2037 వరకు 9, 2055 వరకు 10 బిలియన్లకు చేరనున్నట్లు అంచనా. యునైటెడ్ నేషన్స్ డాటా ప్రకారం 2020 జూలై 9 నాటికి భారత జనాభా 1,380,270,828 ఉన్నట్లు అంచనా. అంటే ప్రపంచ జనాభాలో ఇది 17.7 శాతం. పెరుగుతున్న జనాభాలో అభివృద్ధి చెందుతున్న దేశాలు కీలకపాత్ర పోషిస్తున్నట్టు ఈ సందర్భంగా ఐక్యరాజ్య సమితి అభిప్రాయపడింది. భారత్, అమెరికా, చైనా, బంగ్లాదేశ్, పాకిస్థాన్ తదితర తొమ్మిది దేశాలు వచ్చే 2050 నాటికి ప్రపంచ జనాభాలో సగం శాతాన్ని ఆక్రమిస్తాయని సమితి తెలిపింది. ప్రపంచ జనాభా మొత్తంగా అడ్డూఅదుపూ లేకుండా పెరిగిపోతోంది. అవసరాలు తీర్చే వనరులు ఆ స్థాయిని అందుకోలేకపోతున్నాయి. ఆశలు, ఆకాంక్షలు అపరిమితం అయిపోతున్నాయి. తీర్చగలిగే సంపద, సేవలు, సరుకులు అంతరించిపోతున్నాయి. పర్యవసానం జన విస్ఫోటనం. ప్రజలు భూమికి భారమై, శాపమైపోతున్నారు. కనుకనే దేశాలమధ్య జల, జన యుద్ధాలు, ఆధిపత్య పోరాటాలు, భూమి, సహజ సంపదలను దోచుకోవడాలు, దాచుకోవడాలు జరుగుతున్నాయి. జనాభా పెరుగుదల ఆహార పదార్థాల ఉత్పత్తి పెరుగుదల కంటే చాలా ఎక్కువగా ఉంటోంది. అందువల్ల డిమాండ్ అధికంగా పెరిగి సప్లై తగ్గుముఖం పట్టడంతో ధరలు పెరిగిపోతున్నాయి. డిమాండ్, సప్లయిల మధ్య అగాధం పెరిగిపోతోంది. పర్యవసానంగా ఉన్నవాడు కొనుక్కోగలుగుతున్నాడు. లేనివాడు ఆకలికి గురి అవుతున్నాడు. కనుక ప్రపంచంలో అనేకచోట్ల ఆకలిచావులు సంభవిస్తున్నాయి. ఆఫ్రికా దేశాలలో సంభవించే లక్షల ఆకలి చావులే దీనికి సాక్షీభూతాలు. ప్రకృతి వనరులకు సహజ సంపదలకు, జల, భూవనరులకు ఒక పరిమితి ఉంది. అవి ఒక పరిమితికి మించని జనాభా అవసరాలకు మాత్రమే ఉపకరించబడతాయి. ఆ పరిమితికి మించి జనాభా ఉంటే నిరుపయోగస్థాయికి చేరుకుంటాయి. పైగా మితిమీరిన సేద్యం, వినియోగం, దుర్వినియోగం వలన భూసారం తగ్గి తరుగుదల కాలుష్యం చోటు చేసుకుంటాయి. సంపదలు సరిపోవు. ఆపైన దారిద్ర్యం, ప్రకృతి వైపరీత్యాలతో పాటు ఒకరి నొకరు దోచుకోవడాలు, మోసాలు, దౌర్జన్యాలు, దొంగతనాలు చోటు చేసుకుంటాయి. సమాజం అదుపు తప్పుతుంది. మన దేశం జనాభా పెరుగుదల ఇదే రీతిలో కొనసాగితే 2025 నాటికల్లా భారత్ చైనాను అధిగమించి ప్రపంచంలో అత్యధిక జనాభాగల దేశంగా ఆవిర్భవించడం తథ్యం అని అమెరికా గణన సంస్థ వెల్లడించింది. సత్వరమే భారత్ దిద్దుబాటు చర్యలు, జనస్థిరీకరణ, నియంత్రణకు పూనుకోకుంటే ఆఫ్రికా దేశాల మాదిరి ఆకలి, దారిద్ర్యం, కరవు రక్కసులు పడగలు విప్పడం అనివార్యం అనడంలో సందేహం అక్కర లేదు. ప్రపంచంలోనే కుటుంబనియంత్రణ పథకాలను అధికారికంగా ప్రవేశపెట్టిన దేశం మన దేశమే. 1950లోనే కుటుంబ నియంత్రణ కొరకై నూతన సూత్రీకరణాలను చేసి లక్షలు, కోట్లు ఖర్చు చేసింది. కారణాలు ఎవయినా ఆశించిన ఫలితాలు సాధించలేకపోయాం. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రాకపోవడం, ప్రభుత్వ పథకాలలో అవకతవకలు, పారదర్శకత లోపించడం, మూఢనమ్మకాలు, అవిద్య, స్త్రీ సాధికారిత లేకపోవడం లాంటివి అవరోధాలైనాయి. భారత్‌లో జనాభా నియంత్రణ పథక అమలు వల్ల మన ఆర్థిక రంగానికి అనుగుణంగా అన్ని కోణాలలో తీర్చిదిద్దడం, ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చడం, జన జీవన శైలిని, ప్రమాణాలను వృద్ధి పర్చడం జరిగింది. ఈ భూమ్మీద వందకోట్ల మందికి పౌష్టికాహారం దొరకడం లేదు. 40 కోట్ల మందికి ఆహారం దొరకడం లేదు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని అధిక జనాభాగల దేశాలు తక్షణమే జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలు మూఢనమ్మకాలను వీడి, కులాలకు, మతాలకు అతీతంగా కుటుంబ నియంత్రణ పథకాలను ఆచరించాలి. మహిళా సాధికారిత పెంచాలి. స్త్రీ విద్యను ప్రోత్సహించాలి. స్త్రీ విద్యావంతు రాలైతే సమాజం ఉన్నతస్థాయికి చేరడం ఖాయమని గ్రహించాలి. విద్యా వ్యాప్తిచేసి ప్రతిఒక్కరు మానవ వనరుగా మారిన రోజున దేశభ్యుదయానికి ఎన్నో మార్గాలున్నాయి అనడంలో అతిశయోక్తి లేదు. •



# ఐదేళ్లూ నేనే సిఎం..

## సిద్ధరామయ్య స్పష్టీకరణ

**బెంగళూరు, జులై 10:** కర్ణాటక ముఖ్యమంత్రి మార్పుపై వస్తున్న వార్తలపై సిఎం సిద్ధరామయ్య క్లారిటీ ఇచ్చారు. కర్ణాటకలో సిఎంగా ఐదేళ్ల పాటు తానే కొనసాగుతానని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టం చేశారు. ఓ ఆంగ్ల ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై వస్తున్న ఊహాగానాలను కొట్టిపారేశారు. డికె శివకుమార్‌ను ముఖ్యమంత్రిగా చేయడం కోసం తనను కాంగ్రెస్ హైకమాండ్ రాజీనామా చేయమని కోరినట్లు జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని వెల్లడించారు. ఐదేళ్లూ నేనే సిఎంగా ఉంటాను. ఈ విషయాన్ని నేను ఎప్పుడో స్పష్టంగా చెప్పాను. జులై 2వ తేదీన కూడా దీనిపై ప్రకటన రిలీజ్‌చేశాను. ఆ సమయంలో డికె శివకుమార్‌కూడా అక్కడే ఉన్నారు. ఆయన కూడా పోటీదారే. అందులో తప్పు ఏముంది. 'కుర్చీ ఇప్పుడు ఖాళీగా లేదు' అని శివకుమారే అన్నారని తెలిపారు. నాయకత్వం మార్పుపై పార్టీ హైకమాండ్ టైమ్‌లైన్ లేదా సూచనలు ఏమీ చేయలేదని సిఎం సిద్ధరామయ్య ప్రకటించారు. రెండున్నర సంవత్సరాల అంశాన్ని ఎవరూ నిర్ణయించలేదని వెల్లడించారు. హైకమాండ్ నిర్ణయం తీసుకొంటే తమకు చెబుతుందని, వాటిని తాము అమలు చేస్తామని వివరించారు. ఇక పార్టీ నాయకత్వంపై కాంగ్రెస్ రణ్‌దీప్ సుర్జేవాలా ఎటువంటి ప్రశ్నలు లేవనెత లేదని చెప్పారు. అయితే, డికె శివకుమార్‌కు మద్దతు ఇచ్చే కొద్దిమంది ఎమ్మెల్యేలు కూడా ఉన్నారని ఆయన అంగీకరించారు. తాను గురువారం అగ్రనేత రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ కోరానని, కానీ ఇప్పటివరకు దానిపై ఎలాంటి కన్వర్‌మేషన్‌లేదని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఆరోగ్యకరంగానే ఉందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు.

# కోర్టుకంటే ఐఎఎస్ అధికారి గొప్పవారా?

## జిసిసి కమిషనర్‌కు హైకోర్టు చురకలు

**చెన్నై,జులై 10:** ఐఎఎస్‌అధికారి కోర్టుకంటే గొప్పవారా అని జిసిసి కమిషనర్ కుమరగురుపరన్‌ను ఉద్దేశించి మద్రాస్ హైకోర్టు ప్రశ్నించింది. కోర్టు ఉల్లంఘన కేసులో గురువారం విచారణకు తప్పనిసరిగా హాజరుకావల్సిందేనని ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. జిసిసి పరిధిలోని ఐదవ జోన్ రాయపురంలో అనుమతి లేకుండా నిర్మించిన భవనాలపై జిసిసి ఎటువంటి చర్యలు చేపట్టలేదని దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు చట్టవిరుద్ధ నిర్మాణాలపై చర్యలు తీసుకోవల్సిందిగా 2021 డిసెంబర్‌లో ఉత్తర్వులు జారీచేసింది. అయితే ఎటువంటి చర్యలు తీసుకోని జిసిసికి వ్యతిరేకంగా రుక్మాంగదన్ హైకోర్టులో కోర్టు ఉల్లంఘన కేసు దాఖలు చేశారు. బుధవారం ఈ పిటిషన్ విచారణకు రాగా, హైకోర్టు ప్రథమ ధర్మాసనం ముందు అడినల్ సోలిసిట్ జనరల్ జె.రవీంద్రన్ హాజరై జిసిసి కమిషనర్‌కు విధించిన రూ.లక్ష జరిమానా ఉత్తర్వులను రద్దుచేయాలని కోరారు. అప్పుడు జోక్యంకలుగజేసుకున్న ప్రధాన న్యాయమూర్తి శ్రీరామ్ తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. తన తరుపు న్యాయవాదులు సమర్పించే ప్రమాణపత్రాలను చదవకుండా సంతకం పెడితే ఆయన కమిషనర్‌గా ఉండేందుకు అర్హత లేదన్నారు. కోర్టు కంటే ఐఎఎస్ అధికారి గొప్పవారా అని మందలింపు ధోరణిలో ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించారు. కోర్టు ఉల్లంఘన కేసు విచారణకు మంగళవారం హాజరుకాని జిసిసి కమిషనర్ కుమరగురుపరన్ తప్పనిసరిగా హాజరుకావల్సిందేనని ఉత్తర్వులు జారీచేశారు.

# వడోదరలో 17కి పెరిగిన మృతుల సంఖ్య

**వడోదర,జులై 10:** గుజరాత్‌లోని వడోదరలో నదిపై కూలిన వంతెన ప్రమాదంలో మృతుల సంఖ్య 17కి పెరిగింది. సహాయక బృందాలు మరో నలుగురు మృతదేహాలను వెలికితీసారు. మహీసాగర్ నదిపై నిర్మించిన వంతెన కూలిపోయి పదిమందికిపైగా మృతిచెందిన సంగతి తెలిసిందే. బుధవారం రాత్రినుంచి నిర్వహించిన గాలింపుచర్యల్లో మరో నలుగురి మృతదేహాలు లభించాయని వదోదర కలెక్టర్ అనిల్ ధామేలియా వెల్లడించారు. ఇప్పటికీ ముగ్గురు వ్యక్తుల ఆచూకీ లభించడంలేదని ఆయన చెప్పారు. ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలునదిలో ఇప్పటికీ గాలింపు జరుపుతూనే ఉన్నాయి. ప్రజలు తాము ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూమ్‌కు కాల్ చేయవచ్చని ఆయన స్పష్టంచేసారు. భారీ వర్షాలు నదిలో భారీగాఉన్నబురద కూడా గాలింపుచర్యలకు విఘాతం కలిగిస్తోంది. ఈ వంతెన కూలిన ప్రాంతంలో మరో ప్రత్యేక వంతెనను నిర్మించి ముందు నదిలో కూలిపోయిన వాహనాలను వెలికి తీసేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. ముజ్‌పూర్‌బ్రిడ్జి శ్లాబు కూలిపోవడంతో ఈ ఘోరప్రమాదం జరిగింది.

# బీహార్ ఓటరు జాబితా సవరణకు సుప్రీం ఓకే



## ప్రాథమిక పత్రాలుగా ఆధార్, రేషన్‌కార్డు, ఐడి కార్డును పరిగణనలోకి తీసుకోవాలని సూచన

**న్యూఢిల్లీ, జులై 10:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు గురువారం సుప్రీంకోర్టు అనుమతించింది. ఎస్ఐఆర్‌ను నిర్వహించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయంపై స్టే విధించేందుకు నిరాకరించింది. ప్రాథమిక పత్రాలుగా ఆధార్, రేషన్‌కార్డుతో పాటు స్వయంగా ఎన్నికల సంఘం జారీ చేసిన ఐడి కార్డును పరిగణనలోకి తీసుకోవాల్సిన సూచించింది. వెరిఫికేషన్ కోసం పరిశీలించాలనుకుంటున్న 11 పత్రాల్లో ఆధార్, ఓటర్ ఐడి కార్డులను చేర్చకపోవడం వివాదాస్పదమైంది. ఎన్నికల సంఘం ప్రస్తావించిన ఆ పత్రాలు సమగ్రంగా లేవని తాజాగా అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను పరిగణనలోకి తీసుకోవడం న్యాయబద్ధమైందని మా అభిప్రాయం. వాటిని పరిగణించాలా లేదా? అన్నది ఎన్నికల సంఘమే నిర్ణయించాలి.. ఒకవేళ తీసుకోకపోతే అందుకు గల కారణాలను వెల్లడించాలి అని సుప్రీం పేర్కొంది.

ఇసిని అనుమానించడానికి ఏమీ లేదని, ఈ అంశంపై మరింత విచారణ జర గాల్సి ఉందని వ్యాఖ్యానించింది. అలాగే తదుపరి విచారణను జులై 28కి వాయిదా వేసింది. జులై 21కి కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ఈసిని ఆదేశించింది. ఇదే అంశంపై గురువారం జరిగిన విచారణలో కొన్ని ప్రశ్నలు సంధించింది. ఈ ప్రక్రియలో ఎలాంటి తప్పులేదు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఒక వ్యక్తి ఓటును కోల్పోతే దాని గురించి అడిగేందుకు సదరు వ్యక్తికి సమయం ఉండదు. ఆ సవరించిన జాబితాను సవాలు చేసేందుకు వీలు ఉండదు. అలాగే ఈ ప్రక్రియ నిర్వహించడానికి ఇసికి ఉన్న అధికారం ఈ సవరణ ప్రక్రియ చెల్లుబాటు నిర్వహిస్తున్న సమయంపై వివరణ ఇవ్వాలి అని ఆదేశించిన సంగతి తెలిసిందే. దాదాపు 20 ఏళ్ల క్రితం ఓటర్ల జాబితా ప్రక్షాళన జరిగింది. ఈ క్రమంలో మరోసారి సవరణలు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఎన్నికల సంఘం ఎంచుకున్న సమయంపై కొంత వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ వివాదంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంలో నేడు విచారణ జరిగింది.

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను నిర్వహించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయం బీహార్ రాజకీయాల్లో వివాదాస్పదమవుతోంది. దీనిని వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు సుప్రీంకోర్టును ఆశ్రయించగా అక్కడ చుక్కెదురైంది. ఇసి చర్యలను సుప్రీం ధర్మాసనం సమర్థించింది. ఇది రాజ్యాంగం ప్రకారం జరుగుతోన్న ప్రక్రియే నని వ్యాఖ్యానించింది. అయితే ఎన్నికల ముందు నిర్వహించడాన్ని మాత్రం ప్రశ్నించింది.

# హసీనాపై ప్రత్యేక ట్రిబ్యునల్ అభియోగాలు



**ఢాకా, జులై 10:** బంగ్లాదేశ్‌లో పదవీచ్యుతి పొంది భారత్‌లో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాని షేక్ హసీనాపై పలు అభియోగాలను నమోదుచేస్తూ ప్రత్యేక విచారణకమిటీ నిర్ణయించింది. ఆమెతోపాటు ఆనాటి హోంమంత్రి అసదుజ్జమాన్‌ఖాన్, మాజీ పోలీస్‌చీఫ్ చౌదరి అబ్దుల్లా అల్‌మమన్‌లపైనా ఐదు అభియోగాలు నమోదుచేసారు. హసీనా వీరు లేకుండానే వీరిపై విచారణచేసి తీవ్రస్థాయి నేరాలకు పాల్పడినట్లు ముగ్గురుసభ్యుల ప్రత్యేకకమిటీ నిర్ణయించింది. జస్టిస్ గోలమ్ మొర్తుజా మొజుందార్ అధ్యక్షతన ఉన్న ఈకమిటీ వీరుముగ్గురిపైనా ఐదు అభియోగాలునమోదుచేసింది. ఈట్రిబ్యునల్ జూన్ ఐదో తేదీ ప్రారంభం అయింది. హసీనాను హాజరుకావాలని, వార్తాపత్రికల్లో ప్రకటనలు కూడా ఇచ్చారు. గత ఏడాది ఆగస్టు ఐదోతేదీ నుంచి షేక్ హసీనా భారత్‌లోనే ఆశ్రయం పొందుతున్నారు. నోబల్ పురస్కార గ్రహీత మహ్మద్‌యూనస్ అధ్యక్షతన తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటయింది. హసీనాను తమదేశానికి అప్పగించాలంటూ భారత్‌కు విజ్ఞప్తిచేసింది. అల్‌మమెన్‌ను గురువారమే అరెస్టుచేసారు. జడ్జిలు ఆమనపై అభియోగాలు నమోదుచేసిన వెంటనే ఆయన్ను అరెస్టుచేసారు. ఆలహమమన్ తాను నిర్దోషినని, విచారణలో ప్రాసిక్యూషన్‌కు అనుకూలంగానే నివేదిక ఇస్తానని ఆయన అభ్యర్థించారు.

ప్రాసిక్యూటర్లు హసీనా చేసిన వ్యాఖ్యలకు సంబంధించి లీక్ అయిన ఆడియో లను ఆధారాలుగాచూపిస్తున్నారు. షేక్ హసీనా, ఖాన్‌ల తరపున ప్రభుత్వమే న్యాయవాదిని నియమించింది. ట్రిబ్యునల్‌ముందు ఆయన తమ క్లయింట్లపేర్లను విత్‌డ్రాచేయాలనికోరుతూ పిటిషన్‌వేస్తే ట్రిబ్యునల్ వాటిని తిరస్కరించింది. తదుపరి విచారణను ఆగస్టు 3వ తేదీకి వాయిదా వేసింది. ఆమరుసటిరోజు ప్రాసిక్యూషన్ అందించిన నివేదికపై విచారణ జరుగుతుందని, సాక్షుల వాంగ్మూలాలుకూడా నమోదు అవుతా యని ట్రిబ్యునల్ జడ్జి వెల్లడించారు. హసీనా, ఆమె అవామీ లీగ్‌పార్టీలు ట్రిబ్యునల్, ప్రాసిక్యూషన్ టీమ్‌ను తీవ్రస్థాయిలో విమర్శించాయి. వీరికి రాజకీయ పార్టీలతో సంబంధాలున్నాయని, ప్రత్యేకించి జమాతే ఇస్లామీ పార్టీతో విస్తృత సంబంధాలున్నాయని ఆరోపించారు. రాష్ట్ర బలగాలకు ఆదేశాలు జారీచేసినందుకుగాను హసీనా బాధ్యతవహిస్తారని ఆవామీ లీగ్‌పార్టీ అనుబంధ విభాగాలు మూకుమ్మడి దాడులు చేసి సామూహిక దాడులు, హత్యలు తీవ్రంగా గాయపరచడం వంటి హింసాత్మక విధానాలు అవలంభించడానికి కారణం అయ్యారని ప్రాసిక్యూషన్ ఆరోపిస్తోంది.

క్షతగాత్రులకు చికిత్సను కూడా నిరాకరించారని ఆరోపించారు. గత ఫిబ్రవరిలోనే ఐక్యరాజ్యసమితి మానవహక్కుల విభాగం సుమారు 1400 మందికిపైగా చనిపో యారని, విద్యార్థుల నిరసనలతో కూడిన హింసాత్మక వాతావరణంతో ఈ మారణకాండ కొనసాగిందని ఆరోపించింది. 227 మంది హత్యకు బాధ్యులైన షేక్ హసీనా హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని చెపుతూ ఆరునెలల జైలు శిక్ష విధించింది. ఈట్రిబ్యునల్‌ను షేక్ హసీనా 2009లో ఏర్పాటుచేసారు. బంగ్లాదేశ్ విముక్తిపోరాటంలో జరిగిన నేరాల విచారణకు ఈ ట్రిబ్యునల్ ఏర్పాటయింది. జమాతే ఇస్లామీ పార్టీకి చెందిన అనేక మందిని ఈ ట్రిబ్యునల్ విచారించింది. తొమ్మిది నెలల యుద్ధంలో ఈ పార్టీనేతలపైనే ఎక్కువ విచారణ చేసింది.

# తైవాన్ తీరంలో చైనా భారీ సైనిక విన్యాసాలు



**తైపేయి, జులై 10:** చైనా మరోసారి పసిఫిక్ మహాసముద్రంలో సైనిక ఉద్రిక్తతలను పెంచింది. తైవాన్ తీరాన్ని గురువారం చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన 12 యుద్ధవిమానాలు, 7 నౌకలు చుట్టుముట్టాయి. తమ పరిసర జలాల్లో యుద్ధ విమానాలు, నౌకలు కదలాడినట్లు తైవాన్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ విమానాల్లో పది విమానాలు మధ్యరేఖను దాటి, తైవాన్ దక్షిణ-పశ్చిమగగన రక్షణ గుర్తింపు మండలిలోకి చొరబడ్డాయని వివరించింది. అయితే చైనాకు దీటుగా బదులిచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఎంఎన్‌డీ పేర్కొంది. చైనా సైనిక కదలికలపై తైవాన్ తగిన జవాబు ఇచ్చింది. మా సార్వభౌమత్వాన్ని, ప్రాంతీయ భద్రతను పరిరక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మా విమానాలు, నావికాదళ నౌకలు, తీర రక్షణ క్షిపణి వ్యవస్థలు మోహరించాం. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తైవాన్ రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. తీరంలో చైనా ఉద్రిక్తతలు పెంచుతున్న నేపథ్యంలో 'హాన్ గువాంగ్ 2025' పేరుతో తైవాన్ భారీ స్థాయిలో సైనిక డ్రిల్స్ చేపట్టింది. ఇప్పటి వరకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఎక్కువ రోజులుపాటు ఈ డ్రిల్స్ నిర్వహించాలని తైవాన్ నిర్ణయించింది. ఈ డ్రిల్స్‌లో తాజా తయారు చేసిన ఆయుధాలు, అమెరికా నుంచి దిగుమతి చేసిన అబ్రామ్స్ ట్యాంకులు, హై మొబిలిటీ ఆర్టిల్లరీ రాకెట్ సిస్టమ్ వంటివి వినియోగించనున్నారు. ఈ డ్రిల్స్‌లో అన్ని సర్వీసుల రెగ్యులర్ దళాలతో పాటు 22,000 మంది రిజర్వ్ ఫోర్స్ కూడా పాల్గొననుంది. రాత్రి పగలు అనే తేడా లేకుండా ఈ డ్రిల్స్ జరగనున్నాయి. సైనిక విన్యాసాల సమయంలో విమాన ప్రయాణాలు, రవాణా వ్యవస్థలో తాత్కాలిక అంతరాయాలు ఏర్పడే అవకాశమున్నాయని తైవాన్ ప్రభుత్వం హెచ్చరించింది. అలాగే డ్రిల్స్ నేపథ్యంలో ప్రచారమవుతున్న తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. తైవాన్ సైనిక డ్రిల్స్‌పై చైనా ధ్వజమెత్తింది. హాన్ గువాంగ్ డ్రిల్స్ పేరుతో తైవాన్ అధికార పార్టీ డిపిపి ఆదేశ ప్రజలను మోసం చేస్తోందని చైనా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి కర్నల్ జియాంగ్ బింగ్ విమర్శించారు. డిపిపి పార్టీ ప్రస్తుతం తైవాన్‌లో అధికారంలో ఉంది. తైవాన్‌పై చైనా ఆధిపత్యాన్ని డిపిపి వ్యతిరేకిస్తోంది. తైవాన్ స్వతంత్ర్యాన్ని డిపిపి కోరుతోంది. ఈ క్రమంలో అధికార డిపిపి చర్యలపై చైనా తీవ్ర విమర్శిస్తోంది. తైవాన్ ప్రజలను 'స్వతంత్ర్యం' పేరిట డిపిపి భ్రమింపజేస్తోందని కర్నల్ జియాంగ్ బింగ్ అన్నారు. వాళ్లు ఎంత శిక్షణ తీసుకున్నా, ఎంత ఆధునిక ఆయుధాలు వినియోగించినా, చైనా దాడిని తట్టుకోలేరు. తైవాన్ – చైనా పునఃఏకీకరణ చారిత్రక అవసరం అని ఆయన వ్యాఖ్యానించారు.

# మరణశిక్ష పడిన కేరళ నర్సుపై విచారణకు సుప్రీంకోర్టు ఆమోదం



**న్యూఢిల్లీ, జులై 10:** యెమెన్‌లో వ్యాపార భాగస్వామిని హత్య చేసిన కేసులో కేరళ నర్సు నిమిష ప్రియకు మరణశిక్ష పడిన సంగతి తెలిసిందే. ఈ నెల 16న ప్రియకు ఉరిశిక్ష అమలుకానున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుపై నమోదైన పిటిషన్‌ను విచారించేందుకు తాజాగా అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. మరణశిక్ష నుంచి నిమిషను రక్షించేందుకు దౌత్యమార్గాన్ని ఉపయోగించాలని కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంలో పిటిషన్ దాఖలైంది. తాజాగా ఈ పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం అంగీకరించింది. దీనిపై తదుపరి విచారణ ఈ నెల 14న ఉండనున్నట్లు తెలిపింది. కాగా 16న మరణశిక్ష అమలు నేపథ్యంలో దౌత్య చర్చలకు కేవలం రెండు రోజులు మాత్రమే ఉంటుందని, అది ప్రభావం చూపకపోవచ్చని సీనియర్ న్యాయవాది రాజేంత్ బసంత్ పేర్కొన్నారు. కాబట్టి త్వరగా విచారణ జరపాలని కోరారు.

ఈ సందర్భంగా షరియత్ చట్టం ప్రకారం బాధిత కుటుంబ సభ్యులకు నష్ట పరిహారం చెల్లిస్తే నిమిషను విడుదల చేయవచ్చని ఆయన ధర్మాసనానికి తెలిపారు. పాలక్కాడ్ జిల్లాకు చెందిన నిమిష నర్సు కోర్సు పూర్తిచేసిన తర్వాత 2008లో యెమెన్‌కు వెళ్లారు. 2011లో వివాహం చేసుకున్న ఆమె అక్కడే ఓ క్లినిక్ తెరవాలనుకున్నారు. యెమెన్ చట్టాల ప్రకారం ఆ దేశానికి చెందిన తలాల్ అదిబ్ మెహదీనికి ఆమె వ్యాపార భాగస్వామిగా చేసుకుంది. వీరిద్దరూ కలిసి అల్ అమన్ మెడికల్ కౌన్సిల్ అనే సెంటర్‌ను ప్రారంభించగా అది కొంతకాలం సజావుగా సాగింది. భర్త, కుమార్తె కేరళకు వెళ్లిపోయాక నిమిష ప్రియకు మెహదీ నుంచి వేధింపులు మొదలయ్యాయి. 2017లో అక్కడి నుంచి పారిపోయేందుకు ఆమె ప్రయత్నించింది. మెహదీకి మత్తుమందు ఇచ్చి, తన పాస్‌పోర్టు లాక్కోవాలని భావించింది. ఈ ప్రయత్నంలో మత్తుమందు మోతాదు ఎక్కువకావడంతో మెహదీ చనిపోయాడు. ఈ కేసును విచారించిన కోర్టు ఆమెకు మరణశిక్ష విధించింది. గత ఏడాది నిమిష తల్లి ప్రేమకుమారి యెమెన్‌కు వెళ్లారు. బాధిత కుటుంబానికి నష్ట పరిహారం ఇచ్చి తన కుమార్తెను కాపాడుకునేందుకు ప్రయత్నించినప్పటికీ అవి ఫలించలేదు.



## బ్రెజిల్‌సహా 8 దేశాలపై

# ట్రంప్ భారీగా సుంకాలు!

**వాషింగ్టన్,జులై 10:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి గ్లోబల్ వాణిజ్యాన్ని ఉలిక్కిపడేలా చేశారు. బ్రెజిల్‌తో సహా ఎనిమిది దేశాలపై భారీ దిగుమతి సుంకాలు విధిస్తున్నట్టు బుధవారం అధికారికంగా ప్రకటించారు. వాటిలో బ్రెజిల్‌పై ఏకంగా 50 శాతం టారిఫ్ విధించడం సంచలనంగా మారింది. ఆగస్టు 1 నుంచి కొత్త సుంకాలు అమల్లోకి రానున్నాయి. ఈ విషయాన్ని ట్రంప్ తన ట్రూత్ సోషల్ వేదికగా వెల్లడించారు. ఈ మేరకు బ్రెజిల్ సహా 8 దేశాలకు సుంకాల విధింపుపై లేఖలు రాసినట్లు పేర్కొన్నారు. కొత్తగా టారిఫ్‌లు విధించిన 8 దేశాల్లో బ్రెజిల్- 50శాతం, అల్జీరియా, ఇరాక్, లిబియా, శ్రీలంక-30 శాతం, బ్రునై, మోల్డోవా - 25 శాతం, ఫిలిప్పీన్స్ - 20 శాతం. ఈ దేశాలతో ట్రంప్ సుంకాలు విధించిన దేశాల సంఖ్య 22కి పెరిగింది. కేసు విచారణ వల్ల ఏప్రిల్‌లో అమలు చేసిన 10శాతం టారిఫ్‌ను ఇప్పుడు ఐదింతలుగా పెంచారు. ట్రంప్ దక్షిణ కొరియా, జపాన్‌లపై25శాతం టారిఫ్ విధించిన అనంతరం మయన్మార్, లావోస్, దక్షిణాఫ్రికా, కజకస్తాన్, మలేషియా, టునీషియా, ఇండోనేసియా, బోస్నియా, బాంగ్లాదేశ్, సెర్బియా, కంబోడియా, థాయ్‌లాండ్‌పై సుంకాలను పెంచారు. ఇప్పుడు మరో 8 దేశాలపై సుంకాలను విధించారు. బ్రిక్స్ కూటమిపై ఇప్పటికే ట్రంప్ తీవ్ర విమర్శలు చేశారు. బ్రిక్స్ కూటమి ఉద్దేశపూర్వకంగా అమెరికాకు నష్టం కలిగించేందుకు ఏర్పాటయ్యిందని ఆరోపించారు. అందుకే అందులో భాగస్వాములైన భారతదేశంతో సహా అన్ని దేశాలపై త్వరలో 10 శాతం టారిఫ్ విధిస్తామని తెలిపారు. బ్రిక్స్‌లో ఉన్న ఎవరైనా 10శాతం టారిఫ్ చెల్లించాల్సిందే.

బ్రిక్స్ ఏర్పాటుఅనేది అమెరికా డాలర్‌ను దిగజార్చడా నికే అని స్పష్టంగా కనిపిస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. ప్రపంచ వాణిజ్యంలో డాలర్ ప్రామాణిక కరెన్సీగా కొనసాగాలి. అదే ఒక దేశ బలాన్ని నిర్ధారిస్తుంది. గతంలో పాలన సాగించిన కొందరు నేతల వల్లే డాలర్ స్థానం ప్రమాదంలో పడింది. కానీ నేను అలా జరగనివ్వనని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అంతేకాక, తమ దేశంలో ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పే విదేశీ కంపెనీలకు ఈ టారిఫ్‌ల నుంచి మినహాయింపు కల్పిస్తామని ట్రంప్ వెల్లడించారు.

# చైనాతో అరుణాచల్‌కు సరిహద్దేలేదు..

## మా సరిహద్దు అంతా టిబెట్‌తోనే: సిఎం పెమా ఖండూ




**ఇటానగర్, జులై 10:** అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండు, చైనాకు గట్టి షాకిచ్చేలా సంచలన వ్యాఖ్యలు చేశారు. అరుణాచల్ ప్రదేశ్‌కు చైనాతో అసలు సరిహద్దే లేదని, తమ రాష్ట్రానికి టిబెట్‌తో మాత్రమే సరిహద్దు ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదంపై కొత్త చర్చకు దారితీశాయి. ప్రముఖ వార్తా సంస్థ పిటిఐకి ఇచ్చినఇంటర్వ్యూలో పెమాఖండు ఈ వ్యాఖ్యలు చేశారు. ఇంటర్వ్యూలో భాగంగా, అరుణాచల్ ప్రదేశ్ చైనాతో 1200 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటుందని విలేకరి ప్రస్తావించగా, సిఎం ఖండు వెంటనే కలగజేసుకున్నారు. ఈ విషయంలో నేను మిమ్మల్ని సరిదిద్దాలి. మాకు చైనాతో కాదు, టిబెట్‌తో సరిహద్దు ఉందని ఆయన వివరించారు. భారతదేశంలోని ఏ రాష్ట్రానికీ చైనాతో సరిహద్దు లేదని ఆయన అన్నారు. చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ, 1950లో చైనా టిబెట్‌ను బలవంతంగా ఆక్రమించుకుందని పెమా ఖండు గుర్తుచేశారు. అధికారికంగా టిబెట్ ఇప్పుడు చైనాఆధీనంలో ఉందని మాకు తెలుసు. కానీ వాస్తవానికి మా సరిహద్దు ఎప్పుడూ టిబెట్‌తోనే ఉండేది. అరుణాచల్ ప్రదేశ్ భూటాన్, మయన్మార్‌లతో పాటు టిబెట్‌తో అంతర్జాతీయ సరిహద్దులను పంచుకుంటోందని ఆయన తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌ను తమ భూభాగంలోని దక్షిణ టిబెట్ (జాంగ్నాన్) అని చైనా చాలాకాలంగావాదిస్తోంది. తమ మ్యాపుల్లో కూడాచూపిస్తూ వివాదాన్ని రాజేస్తోంది. అయితే, చైనా వాదనలను భారత్ ఎప్పటికప్పుడు తీవ్రంగా ఖండిస్తూ వస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని తేల్చి చెబుతోంది. ఈ నేపథ్యంలో పెమా ఖండు చేసిన వ్యాఖ్యలు చైనా వాదనను మరింత బలహీనపరిచేలా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# సంక్షిప్తంగా..

## గాలిలోనే విమానాలు ఢీకొని కేరళ పైలట్‌మృతి

**టొరంటో, జులై 10:** కెనడాలో జరిగిన విమాన ప్రమాదంలో కేరళకు చెందిన భారతీయ యువ పైలట్ ఒకరు మరణించారు. మానిటోబా ప్రావిన్స్‌లో రెండు శిక్షణా విమానాలు గాల్లో ఢీకొనడంతో ఈ విషాదకర సంఘటన చోటుచేసుకుంది. మృతుడిని కేరళకు చెందిన శ్రీహరి సుకేష్ (21)గా గుర్తించారు. ఈ ప్రమాదంలో కెనడాకు చెందిన సవన్నా మే రాయ్స్ (20) అనే మరో యువ పైలట్ కూడా మరణించాడు. శ్రీహరి, సవన్నా ఇద్దరూ మానిటోబాలోని హార్వ్స్ ఎయిర్ పైలట్ ట్రైనింగ్ స్కూల్‌లో శిక్షణ పొందుతున్నారు. స్టెయిన్‌బాచ్ పట్టణం వద్ద శిక్షణలో భాగంగా చిన్న విమానాల్లో టేకాఫ్, ల్యాండింగ్‌లను ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ ఒకే రన్‌వేపై ఒకేసారి ల్యాండ్ అయ్యేందుకు ప్రయత్నించారు. దీంతో సుమారు 400 మీటర్ల ఎత్తులో వారి విమానాలు ఒకదానికొకటి ఢీకొన్నాయని ట్రైనింగ్ స్కూల్ అధ్యక్షుడు ఆడమ్ పెన్నర్ పేర్కొన్నారు.

## మాకూ 'నోబెల్' ఇవ్వాలి: కేజ్రీవాల్



**చండీగడ్, జులై 10:** తన పాలనకు గానూ తనకు నోబెల్ బహుమతి ఇవ్వాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రివాల్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని రేపాయి. ఆయన వ్యాఖ్యలపై బిజెపి తీవ్రస్థాయిలో మండిపడింది. చండీగఢ్‌లో జరిగిన ది కేజ్రివాల్ మోడల్ పుస్త కావిష్కరణ కార్యక్రమంలో కేజ్రివాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ సహా ఎన్నో శక్తులు మా ప్రభుత్వాన్ని అడ్డుకున్నా, మేము అద్భుతంగా పనిచేశాం. ఇన్ని అడ్డంకుల మధ్య ఇంత గొప్ప పాలన అందించినందుకు నాకు నోబెల్ బహుమతి ఇవ్వాలని కేజ్రీవాల్ అన్నారు. ఈవ్యాఖ్యలపై బిజెపి ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా స్పందిస్తూ.. అసమ ర్థత, అరాచకం, అవినీతి విభాగాల్లో నోబెల్ బహుమతి ఉండుంటే కేజ్రీవాల్‌కు తప్పకుండా వచ్చేదని ఎద్దేవా చేశారు.

## ట్రంప్‌పై దాడి కేసు: ఆరుగురి సస్పెన్షన్

**వాషింగ్టన్, జులై 10:** అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో పెన్సిల్వేనియాలోని బట్లర్ కౌంటీలో డొనాల్డ్ ట్రంప్‌పై కాల్పులు ఘటనకు సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ల వైఫల్యమే కారణమని తేల్చారు. ఈ క్రమంలో నాడు విధుల్లో ఉన్న ఆరుగురిని సస్పెండ్ చేస్తూ సీక్రెట్ సర్వీస్ నిర్ణయం తీసుకొంది. ఈ విషయాన్ని ఆ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మ్యాట్ క్విన్న్ వెల్లడించారు. వీరందరిని భవిష్య త్తులో కీలక విధులకు దూరంగా ఉంచుతామన్నారు. బట్లర్‌లో జరిగిన ఘటనకు పూర్తి బాధ్యత సీక్రెట్ సర్వీస్‌దేనని చెప్పారు. అదో ఆపరేషనల్ వైఫల్యమని అంగీకరించారు. మరోసారి ఇలాంటివి జరగకుండా జాగ్రత్త పడతామన్నారు. ట్రంప్‌పై దాడి జరిగి మరో మూడు రోజుల్లో యేడాది పూర్తికానున్న వేళ సీక్రెట్ సర్వీస్ ఏజెన్సీ ఈ నిర్ణయం వెలువరించడం గమనార్హం.

## తాయెత్తులతో సంపాదన రూ.106 కోట్లు!

**లక్నో, జులై 10:** ఒకప్పుడు సైకిల్‌పై తిరుగుతూ ఉంగరాలు,తాయెత్తులు అమ్ముకునే ఒక సాధారణ వ్యక్తి ఇప్పుడు ఏకంగా రూ.106 కోట్ల సామ్రాజ్యాన్ని సృష్టించాడు. ఉత్తరప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మతమార్పిడుల ముఠా గుట్టు రట్టుకావడంతో జమాలుద్దీన్ అలియాస్ ఛంగూర్ బాబా అక్రమాల పుట్ట పగిలింది. ఈ కేసు తీవ్రత దృష్ట్యా ఇప్పుడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కూడా రంగంలోకి దిగింది. బలరాంపూర్ జిల్లాకు చెందిన ఛంగూర్ బాబా, అతని సహచరి నీతూ అలియాస్ నస్రీన్‌ను పోలీసులు ఇటీవల లక్నోలో అరెస్ట్ చేశారు. పేదలు, నిస్సహాయ కార్మికులు, వితంతువులే లక్ష్యంగా డబ్బు,పెళ్లి ఆశచూపి లేదా బెదిరించి ఈముఠా మత మార్పిడులకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఛంగూర్ బాబాకు చెందిన 40 వేర్వేరు బ్యాంకు ఖాతాల్లోకి మధ్యప్రాచ్య దేశాల నుంచి రూ.106 కోట్లకు పైగా నిధులు వచ్చినట్టు అధికారులు గుర్తించారు.

## రష్యాకు గట్టి ఎదురుదెబ్బ

**బ్రస్సెల్స్, జులై 10:** అంతర్జాతీయ వేదికపై రష్యాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దశాబ్దం క్రితం మలేసియా ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎంహెచ్17 విమానాన్ని కూల్చివేసింది రష్యానే అని యూరప్ అగ్రశ్రేణి మానవ హక్కుల న్యాయస్థానం (ఇసిహెచ్‌ఆర్) సంచలన తీర్పు వెలువరించింది. అంతేకాకుండా, 2022 నుంచి ఉక్రెయిన్‌లో రష్యా పాల్పడుతున్న హత్యలు, అత్యాచారాలు, మౌలిక సదుపాయాల ధ్వంసం వంటి అఘాయిత్యాలకు కూడా మాస్కోనే బాధ్యురాలని స్పష్టం చేసింది. 2014 జులై 17న ఆమ్‌స్టర్‌డామ్ నుంచి కౌలాలంపూర్‌కు వెళ్తున్న మలేసియా ఎయిర్‌లైన్స్ విమానం తూర్పు ఉక్రెయిన్‌లో కూలిపోయిన విషయం తెలిసిందే.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త



# విద్యార్థులే నవసమాజ నిర్మాతలు...

## - రెండు జిల్లాల్లో ఉత్సాహంగా రికార్డు స్థాయిలో.....
## - ఆత్మీయ సమావేశాలు
## - ప్రభాత వార్త బృందం....



పాలకొల్లు లో మంత్రి నిమ్మల రామానాయుడు



ముత్యాలపల్లిలో జేసీ అనిల్ కుమార్ రెడ్డి

డొక్కా సీతమ్మ బడి భోజనంలో నాణ్యమైన పౌష్టిహారాన్ని అందించాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. నూజివీడులోని ఎస్.ఆర్.ఆర్. బాలుర పాఠశాలలో 'మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఆనంతరం విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదని , ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంతోపాటు, పౌష్టికాహార లోపం లేకుండా నాణ్యమైన భోజనాన్ని అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న డొక్కా సీతమ్మ బడి భోజనంలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ లోనే నాణ్యమైన భోజనాన్ని అందించాలని, భోజన నాణ్యతలో ఏదైనా లోపాలుంటే వెంటనే తన దృష్టికి గాని, సబ్ కలెక్టర్ తహసీల్దార్ దృష్టికి తీసుకొస్తే, సంబంధిత ఏజెన్సీ పై చర్యలు తీసుకుంటామన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, పురపాలక సంఘం వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, ఎంఈఓ జమలయ్య, వేములపండు శ్రీనివాస్, జెడ్పిటిసి కృష్ణం రాజు, కౌన్సిలర్ కందుల సత్యనారాయణ, తహసీల్దార్ బద్రు, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ లక్ష్మి, ఏరియా హాస్పిటల్ కమిటి సభ్యులు కె. దుర్గ, ప్రభృతులు పాల్గొన్నారు



విద్యార్థులతో జిల్లా కలెక్టర్ నాగరాణి



శతమానంభవతి... ఏలూరు కలెక్టర్ వెట్రి సెల్వి

# శ్రీ బండి ముత్యాలమ్మ ఆలయం నందు గురు పౌర్ణమి వేడుకలు


**మొగల్తూరు జులై 10(ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 216 నేషనల్ హైవేను ఆనుకుని ఉన్న ముత్యాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వెలసి ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ ఆలయమునందు, గురువారం గురు పౌర్ణిమ ను పురస్కరించుకొని పశ్చిమగోదావరి జిల్లా బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు దాసరి బాబి ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి పాలకొల్లు వాస్తవ్యులు ఆధ్యాత్మిక గురువు చాగంటి లింగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు, అనంతరం ఆయన మాట్లాడుతూ పురాణాల ప్రకారం గురుపౌర్ణమి చాలా ప్రత్యేకమైనది ప్రతి ఏడాది ఆషాడ మాసం పౌర్ణమి రోజున గురు పౌర్ణమి వేడుకలు జరుపుకుంటారు ఈ రోజున పంచమ వేదం మహాభారతాన్ని మానవాళికి అందించిన వ్యాసుడు జన్మదినం అందుకే దీనిని వ్యాస పూర్ణిమ అని కూడా పిలుస్తారు, అని ఆయన తెలియజేశారు, ఈ కార్యక్రమం లో సదాశివం, ఎంపీటీసీ తిరుమని స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు పులపర్తి రమేష్, ఓ బి సి మెర్చ జిల్లా సెక్రెటరీ ఆముదాలపల్లి వెంకటాచార్యులు, బొరుసు శివ, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు ఇంటి ఏడుకొండలు,



కొల్లాటి చూడామని, కొపనాతి పెద్దిరాజు, బల్ల సూరిబాబు, మోకా వెంకన్న, దాసరి కృష్ణాజి, అడ్డాల శివన్నారాయణ, రాంబాబు, ప్రసాదు, సుబ్బరాయుడు, మధుసూదన్, సాంబశివరావు లు కలసి గురువు చాగంటి లింగరాజుకు పూలమాలవేసి సాలువా కప్పి గురు పౌర్ణమి సందర్భంగా ఘనంగా సత్కరించారు, సందర్భంగా స్థానికులు ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు


# అనూహ్యమైన మార్పులతో శ్రీరామచంద్ర విద్యాసంస్థలు

**జంగారెడ్డిగూడెం,ప్రభాత వార్త:** శ్రీ రామచంద్ర విద్యాసంస్థలను స్థాపించి 21 సంవత్సరాలు పూర్తి చేసుకుని 22వ సంవత్సరాన్ని ఎంతో ఆశావహ దృక్పధంతో ప్రారంభించాం. గత విద్యా సంవత్సరం (2024%-%25) ఆహ్లాదకరమైన వాతావరణంలో, సమిష్టి కృషితో అద్భుత విజయాలను సాధించాం. స్కూల్, ఇంటర్, డిగ్రీ కాలేజ్‌ల ఫలితాల్లో మునుపెన్నడూ లేని విధంగా విద్యార్థులు ర్యాంకులు సాధించారు. నేడు జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంతో పాటు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించగలిగాం. మధ్యాహ్నపు మౌనిక 600 మార్కులకు గాను 595 మార్కులు సాధించింది. ఇంటర్మీడియేట్ సెకండ్ ఇయర్‌లో మునుపెన్నడూ సాధించని రీతిలో 1000మార్కులకు గాను984 మార్కులను సాధించగలిగాం. 950కు పైబడి అత్యధిక మార్కులు సాధించేందుకు లెక్చరర్స్ కృషి ఎనలేనిది. ఈ విద్యాసంవత్సరం 2025%-%26లో అడ్మిషన్‌లు సైతం పెరిగాయని తెలియజేసారు. ఐఐటీ, ఎంసెట్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ అందించాం. అకడమిక్ షెడ్యూల్‌ను నిర్వహించేందుకు ఎం.ఉమని, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్‌ను సక్రమంగా నడిపేలా



ఎం.మౌనికని,మొత్తం విద్యాసంస్థలకు సంబంధించి అన్ని కార్యక్రమాలను పర్యవేక్షించేలా టి.సురేష్‌ని నియమించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ ఇన్‌ఛార్జ్ ఎం.రాధిక, హైస్కూల్ ఇన్‌ఛార్జ్ టి.హిమబిందు, ఇంటర్మీడియేట్ ఇన్‌ఛార్జ్ ఎ.బోస్, డిగ్రీ ఇన్‌ఛార్జ్ ఎం.సూర్యకుమారి, పూర్తి సహాయ సహకారాలతో వ్యవస్థను ముందుకు నడిపిస్తామని చైర్మన్ బీవీ కృష్ణారావు, కరస్పాండెంట్ వీవీఎస్ జగదీష్ కుమార్‌లు తెలియజేశారు.


# జంగారెడ్డిగూడెంలో పి టి ఎం సమావేశాలు

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తల్లికి వందనం కార్యక్రమం క్రింద చింతలపూడి నియోజకవర్గంలో 31 వేల మంది విద్యార్థులకు రూ. 46 కోట్ల 50 లక్షలు, ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున అందజేస్తామని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలిపారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం పేరెంట్, టీచర్స్ మీటింగ్ లో ఎమ్మెల్యే రోషన్ కుమార్ ప్రసంగించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కూడా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు ఇస్తున్న సౌకర్యములను, ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యావంతులు కావాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జడ్పిటిసి పోల్నాటి బాబ్జి, టిడిపి నాయకులు కొంగ్రెడ్డి కిషోర్,రావూరి కృష్ణ, డాక్టర్ దాసరి శేషు, ప్రధానోపాధ్యాయులు పట్నాల సోమశేఖర్, ఎంఈవో లు బి. రాములు, కమిషనర్ కే.వెంకటరమణ, తహసిల్దార్ స్లీవ జోజి, కౌన్సిలర్లు రమాదేవి, జ్యోతి, సౌభాగ్యవతి తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రోషన్ కుమార్ కు ఘన స్వాగతం లభించింది.

# గురువును పూజిస్తే దేవుడిని పూజించినట్టే -మండల తెదేపా అధ్యక్షుడు ఇజ్జిగాని

**చాట్రాయి, జులై 10, ప్రభాతవార్త :** గురువును పూజిస్తే సాక్షాత్తు దేవుడిని పూజించినట్లేనని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆరుగొలను పేట ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవం సందర్భంగా ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయగా నాయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువును ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిన అవసరం ఉందని గురువు నేర్పిన విద్యతోనే మానవుడి జీవన నడవడిక ఆధారపడి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రులు కూడా పాఠశాలలకు వచ్చి తమ పిల్లలు ఏ విధంగా చదువుతున్నారో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ప్రాథమిక దశలోనే విలువలతో కూడిన విద్యను నేర్చుకుంటే భావితరానికి మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. జనార్ధన వరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి వి బ్రహ్మాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మానవ జీవనానికి గురువు పాత్ర కీలకమైనదని చెప్పారు. గురువు అడుగుజాడల్లో నడిచిన ప్రతి వ్యక్తి సమాజానికి మేలు చేకూరే విధంగా వృద్ధి చెందుతారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరుగొలను పేట ప్రధానోపాధ్యాయులు ఎం చంద్రు, సహచర ఉపాధ్యాయులు ధనలక్ష్మి, ఇందిరా, ఎం సత్యనారాయణ, కె శివ రాజేశ్వరి, ఆరుగొలను పేట తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పానుగళ్ళ కోటేశ్వరరావు, జనార్ధనవరంలో మాజీ సర్పంచ్ పలగాని దుర్గారావు, వంగల సుబ్బారావు, పోలవరం కోనేరు



రంగారావు కాలనీలో మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, ప్రధానోపాధ్యాయులు ఆర్. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మండలంలో దాదాపుగా అన్ని పాఠశాలలో ఆత్మీయ సమావేశ కార్యక్రమాలు నిర్వహించగా విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ 165 భూసేకరణలో ఉండి రైతుల అభ్యంతరాల పరిష్కారం

## - జె. సి. .రాహుల్ కుమార్ రెడ్డి

**భీమవరం జులై 10 ప్రభాతవార్త :** జాతీయ రహదారి 165 నిర్మాణంలో భాగంగా ఉండి మండలం పెద్ద పుల్లేరు గ్రామం రైతులు లేవనెత్తిన అభ్యంతరాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి గురువారం జాతీయ రహదారుల అధికారుల సమక్షంలో విచారణ చేపట్టడం జరిగింది. భూసేకరణపై జూన్ 14న అభ్యంతరాలు గడువు ముగియడంతో, ఆ గ్రామం నుండి అందిన ఐదు మంది రైతులు అభ్యంతరాలపై ఈరోజు విచారణ చేపట్టారు. ముఖ్యంగా మూడు అంశాలపై రైతులు అభ్యంతరాలను వ్యక్తపరచగా వీటిని ఎన్.హెచ్ అధికారులు పరిష్కరించేందుకు రైతులకు హామీ ఇవ్వడంతో రైతుల అభ్యంతరాలను ఉపసంహరించుకుని, భూ సేకరణకు ఆమోదం తెలిపారు. చెరువులు, సాగునీటి కాలువలు మధ్య నుండి రహదారి వెళితే ఇరువైపులా అనుసంధానికి డక్ట్ ల ఏర్పాటుకు ఎన్.హెచ్ అధికారులు అంగీకారం తెలిపారు.



అలాగే అలైన్మెంట్ ఏ సర్వే నెంబర్ నుండి వెళ్తుంది అనే వివరాలను రైతులు కోరగా, త్వరలో క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను అందజేస్తామని తెలిపారు. ఎక్కడైనా అవసరమైన చోట అండర్ పాస్ లు, జంక్షన్లు నిర్మించి ఇవ్వడానికే ఎన్ హెచ్ అధికారులు ఆమోదం తెలిపారు. ఈ విచారణలో ఎన్.హెచ్ ఈఈ సంజీవ నాయుడు, డిఇ శ్రీనివాస్, పెద్ద పుల్లేరు రైతులు, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సిహెచ్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# సోమవరం సాయిబాబా ఆలయంలో అన్నదానం

**చాట్రాయి, జులై 10,ప్రభాతవార్త :** గురు పౌర్ణమి సందర్భంగా చాట్రాయి మండలం సోమవరం గ్రామంలో భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రతికంటి రామచంద్రరావు ఆధ్వర్యంలో గురువారం ఉదయం నుండి సాయిబాబాకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుండి ఆలయంలో భక్తులు కిటకిటలు ఆడారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించగా సుమారు రెండువేల మంది పైగా భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ చైర్మన్ రామచంద్రరావు మాట్లాడుతూ గురు పౌర్ణమి సందర్భంగా సాయి బాబా అనుగ్రహం ప్రతి ఒక్కరికి కలగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని సాయిబాబా అని కోరుకుంటున్నట్లు ఆయన చెప్పారు. భక్తుల సహాయ సహకారాలతో సోమవరం లోని సాయిబాబా దేవాలయం



దినదినాభివృద్ధి చెందుతోందని ఆయన అన్నారు. ప్రతి గురువారం సాయిబాబా కు ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండగా వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారని ఆయన వివరించారు. మండల కేంద్రమైన చాట్రాయిలో సాయిబాబా ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు సాయిబాబాను దర్శించుకుని వేడుకున్నారు.

# మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కారం ఉత్తమం

**నరసాపురం ప్రభాతవార్త :** ఉమ్మడి గోదావరి జిల్లా న్యాయ సేవల సంస్థ ఏలూరు వారి ఆదేశాల మేరకు నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తులుగా శిక్షణ పొందిన న్యాయవాదులకు, ప్యానెల్ లాయర్స్ కు, న్యాయ సేవా సంస్థ సభ్యులకు, పారా లీగల్ వాలంటీర్లకు, కక్షిదారులకు ఈ రోజు ఉదయం సీనియర్ సివిల్ జడ్జి జి. గంగరాజు "మధ్యవర్తిత్వం " పై దిశా నిర్దేశం కార్యక్రమాన్ని కోర్టు హాల్ నందు నిర్వహించారు. సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా త్వరితగతిన కక్షిదారులకు కేసుల నుండి ఉపశమనం కల్పించవచ్చునన్నారు. ఇందుకు ఇరుపక్షాల న్యాయవాదుల సహకారం అవసరమని, ప్రస్తుతం ఉన్నత న్యాయస్థానాలు మధ్యవర్తిత్వం ను ఎక్కువ ప్రధ్యాన్యత ఇస్తున్నారన్నారు. న్యాయమూర్తులు కు కూడా మధ్యవర్తిత్వం పై శిక్షణ పొందినట్లు తెలిపారు. మధ్యవర్తులుగా శిక్షణ పొందిన న్యాయవాదులు ఇరుపక్షాల వారిని సమన్వయ పరిచి సమన్యాయం అందించుటకు ప్రయత్నించాలన్నారు. 2023 లో రూపొందిన మధ్యవర్తిత్వం చట్టం , దానిలోని అంశాలు వివరించారు. మధ్యవర్తిత్వ చట్టం పై ప్రతి న్యాయవాది అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్యానెల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్. వరలక్ష్మి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. రాజ్య లక్ష్మి, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చేగొండి బాలాజీ, కార్యదర్శి ఆర్ పుల్లాజి , శిక్షణ పొందిన న్యాయవాదులు, ప్యానెల్ లాయర్లు, లీగల్ సర్వీసెస్ సభ్యులు, పై. ఎల్ .వి లు , కక్షిదారులు పాల్గొన్నట్లు న్యాయమూర్తి జి. గంగరాజు పత్రికలకు తెలిపారు. శుక్రవారం ఉదయం 1 కె వాక్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.




# తల్లిదండ్రులు విద్యార్థులకు సమయం కేటాయించాలి పిల్లలు విద్యాభ్యాసం ప్రవర్తనపై పరిశీలించాలి

## - జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి - ఎమ్మెల్యే నాయకర్





**ప్రభాతవార్త నరసాపురం మొగల్తూరు:** మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో శ్రీ బండి ముత్యాలమ్మ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం అత్యంత వైభవంగా పండుగ వాతావరణంలో నిర్వహించిన మెగా పేరెంట్స్, మీట్ కార్యక్రమంకు రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు నరసాపురం నియోజకవర్గం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ప్రభుత్వం విప్ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ కార్యక్రమం ఒక వేదికగా ఏర్పాటు చేసి పిల్లల చదువుల విషయంలో ఉన్న సమస్యలపై పేరెంట్స్, టీచర్స్ మాట్లాడుకొనుటకు రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సారాథ్యంలో ఈ కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పిల్లల చదువులు విషయంలో తల్లిదండ్రులు అందరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నరసాపురం, మొగల్తూరు మండలాలు తీర ప్రాంతాలు కావడం వలన ఆర్థికంగా ఇబ్బందులు ఎక్కువగా ఉండటం కారణంగా చూపి తల్లిదండ్రులు పిల్లలను పనులకు తీసుకువెళ్లకుండా బాగా చదివించాలన్నారు. తల్లిదండ్రుల తలరాతలను మార్చే విధంగా పిల్లలు కూడా ఉన్నత చదువులను చదువుకోవాలని అన్నారు. చదువుకునే వారికి ప్రభుత్వం పెద్ద ఎత్తున సహాయం అందిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం పేద ప్రజలను అన్ని విధాల ఆదుకుంటుందని తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్, పథకములను అమలుచేస్తుందని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు త్వరలో ప్రవేశ పెట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇల్లు ఎంత ముఖ్యమో, పాఠశాలలో పిల్లలు ఎలా చదువుతున్నారో, ఎలా ఉంటున్నారో అని తెలుసుకోవడం అంతే ముఖ్యమన్నారు. ప్రతి ఒక్క తల్లి దండ్రులు తరచూ స్కూలుకు వచ్చి మంచి చెడ్డలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులకు సమయమును కేటాయించాలని అన్నారు. వారి యొక్క విద్యాభ్యాసం ప్రవర్తనపై పరిశీలిస్తూ మార్గదర్శకులు కావాలన్నారు. విద్యార్థులు ఇంటిలో కన్నా పాఠశాలలో ఎక్కువ సమయం ఉంటారని అన్నారు.

# శ్రీదత్త జ్ఞానసాయి బాబా ఆలయం నందు గురు పౌర్ణమి వేడుకలు

మొగల్తూరు జులై 10(ప్రభాతవార్త) 216 నేషనల్ హైవేను ఆనుకుని రామాలయం వైపు వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కన వెలసి ఉన్న శ్రీ దత్త జ్ఞాన సాయి బాబా ఆలయం నందు ఆలయ నిర్వాహకులు శెట్టి మోహన రావు ఆధ్వర్యంలో గురువారం, గురు పౌర్ణమి సందర్భంగా ఉదయం 6 గంటల నుండి భక్తులు పలు గ్రామాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేసి అభిషేకములు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో 12 గంటల నుండి భారీ అఖండ అన్న సమారాధన నిర్వహించారు

## గోదావరి వరద ఉధృతిని ఎదుర్కొనేందుకు అధికార యంత్రంగం సన్నద్ధంగా ఉండాలి
### కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు ప్రత్యేక అధికారులు

**వేలేరుపాడు. ప్రభాతవార్త** : గోదావరి పరివాహక ప్రాంతాలలో వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో సిబ్బంది అందరిని అప్రమత్తం చేయాలన్నారు. బలహీనంగా ఉన్న కాలువలు, నదీ పరీవాహక ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జూలై నుండి సెప్టెంబర్ వరకు అధికవర్షాలు, వరదలను దృష్టిలోఉంచుకుని, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలలో వరద పునరావాస కార్యక్రమాల నిర్వహణకు మండల ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని చెప్పారు. వేలేరుపాడు మండలానికి డిఆర్డిఏ పీడీ



ఆర్. విజయరాజు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి జితేంద్ర, కుక్కునూరు మండలానికి జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి అన్సారీలను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.

# నేటి విద్యుత్ సరఫరాల అంతరాయం

పోడూరు, జూలై-10, ప్రభాతవార్త:: పోడూరు మండల పరిది లోని పెనుమదం 33/11 కేవి సబ్ స్టేషన్ నందు లోకల్ ఫీడర్ మరియు వాటర్ వర్క్స్ ఫీడర్ లైన్ల పై మరమ్మత్తులు మరియు చెట్లు కొమ్మలు తొలగించడం కారణం చేత పెనుమదం, అప్పన చెరువు, రాజులగరువు గ్రామాలకు నేడు ఉదయం 7:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ట్రాన్స్- కో నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే మధు కుమార్ తెలిపారు. కనుక విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## పోడూరులో మెగా పేరెంట్స్- టీచర్స్ ఆత్మీయ సమావేశం



పోడూరు, జూలై-10, ప్రభాతవార్త: మండల కేంద్రం పోడూరు గ్రామంలో కర్నూల్ డిఎస్ రాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నందు మెగా పేరెంట్స్- టీచర్స్ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నట్లు స్థానిక తహసీల్దార్ సయ్యద్ మౌలానా పాజిల్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధికారులు, ఉపాధ్యాయులు, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతంగా జరిగినట్లు తెలిపారు. ఆటల పోటీలు నిర్వహించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు బహుమతి ప్రధానం చేసి ఉన్నారు. విద్యార్థులకు మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ గ్రౌండ్ వాటర్ డి డి గంగాధర్, ఎంపీడీవో మంగా కుమారి పోదూరు సర్పంచ్, మాజీ సర్పంచ్ సుజాత, విద్యా కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# మెగా పేరెంట్స్ మీటింగ్

పెనుగొండ (పెనుమంట్ర), జూలై-10, ప్రభాతవార్త: పెనుగొండ జుపిటర్ మాస్టర్ మైండ్స్ పాఠశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్ గురువారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా పెనుగొండకు చెందిన డా. కలిందిండి రామచంద్ర రాజు హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ శ్యామల విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేసించి మాట్లాడారు. అనంతరం తల్లిదండ్రులకు మొక్కలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో చైర్మన్ జక్కం విజయ్ ,వైస్ చైర్మన్ జక్కం కరుణ , ప్రిన్సిపాల్ మురళి మోహన్ ,వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, చాంప్స్ ఇంచార్జ్ రాణి, విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# పంటల భీమా ప్రీమియం చెల్లించండి.

అత్తిలి – జూలై 10 (ప్రభాతవార్త): అత్తిలి మండలం ఉనికిలి, లక్ష్మీనారాయణ పురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వ్యవసాధికారి టి.కే రాజేష్ తెలిపారు. ఆ గ్రామాలలో నూరు శాతం నారుమళ్ల పూర్తయినట్లు తెలిపారు. ఊడ్చేటప్పుడు నారు సుతలు తెంచి ఊడ్చలని తెలిపారు. రైతులు ఖరీఫ్ పంటకు సంబంధించి ఆగస్టు మొదటివారంలోగా భీమా చెల్లించాలని తెలిపారు. ఎకరాకు 210 చెల్లించాలని అన్నారు. బ్యాంకులో అప్పు తీసుకున్న వారైతే ప్రీమియం మినహాయించడం జరుగుతుందని తెలిపారు. అప్పు తీసుకొని వారు కౌలు రైతులు మీసేవ కేంద్రంలో కానీ,రైతు సేవా కేంద్రాల్లో గాని చెల్లించాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ జాబితాలో పేరు లేని రైతులు గ్రీవెన్స్ సెల్ లో నమోదు చేయించుకోవాలని సూచించారు.



# ఘనంగా పిటిఎం సమావేశం

ఆచంట, (పెనుమంట్ర) జూలై-10, ప్రభాతవార్త:, ఆచంట మండలం ఆచంట వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుసూరి సత్యనారాయణ అధ్యక్షతన గురువారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన భారత సంతతి అమెరికా నివాసి సంకురాత్రి రాజేశ్వరి ప్రకాశ్ మాట్లాడుతూ స్వీయ క్రమశిక్షణతో కూడిన విద్య బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని అన్నారు. ప్రధానోపాధ్యాయుల సత్యనారాయణ మాట్లాడుతూ తల్లి ప్రేమకు సమానమైనది ఏదీ లేదు ఆమె సేవను గుర్తించి ప్రతిరోజు మనం తల్లికి వందనం చేయాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విద్యార్థుల చేత థాంక్యూ



సీఎం సార్ అని చెప్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జి నాగ సత్యనారాయణ, గుత్తుల శ్రీనివాస్, యేసు రత్నం, సంకురాత్రి సోమరాజు, జి నారాయణమూర్తి, ఎస్ఎంసి చైర్మన్ గుత్తుల చిరంజీవి, పేరెంట్స్ కమిటీ సభ్యులు ,తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా మెగా పిటిఏ సమావేశాలు.

అత్తిలి జులై 10( ప్రభాత వార్త )( గణపవరం): గణపవరం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలో పిటిఏ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలను సుందరంగా అలంకరించారు. ప్రత్యేక అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు చేత ప్రతిజ్ఞ చేయించారు. గణపవరం బాలుర ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి జి బాలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలలో నిర్వహించారు. దాతల సహకారంతో బహుమతులను అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు మొక్కలను పంపిణీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి మధ్యాహ్న భోజనం కార్యక్రమాన్ని నిర్వహించారు.



## సామాన్యుడి లా షోడా తాగుతున్న శాసనసభ్యులు రోషన్ కుమార్

జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త: చింతలపూడి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పి.టి.ఎం మీటింగ్ లలో పాల్గొనడానికి సుడిగాలి పర్యటన చేసిన అనంతరం సేద తీర్చడానికి జంగారెడ్డిగూడెం నుండి చింతలపూడి తిరుగు ప్రయాణంలో మెయిన్ రోడ్డు పక్కన ఉన్న షోడా దుకాణ దారుడితో సరదాగా గడిపి షోడా తగిన ఎమ్మెల్యే రోషన్ కుమార్.



# మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం అదరహో
### -సందడి వాతావరణం నడుమ మండలం మొత్తం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం విజయవంతం

వేలేరుపాడు, జులై 10,ప్రభాత వార్త : తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశాన్ని మెగా పీటీమ్ 2.0 ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు కళాశాలలో సందడి వాతావరణం నెలకొంది, ఆటపాటలు సాంస్కృతిక కార్యక్రమాలు,తీపి జ్ఞాపకాలు, తల్లిదండ్రుల ఆనంద భాష్పాలు, ఉపాధ్యాయుల ఆత్మీయ పలకరింపులు, చిన్నారుల కేరింతల నడుమ మెగా పేటిమ్ 2.0 విజయవంతమైంది. అన్ని పాఠశాలలో నందు గెలుపొందిన విద్యార్థులకు ప్రైజులు, తల్లిదండ్రులకు అతిథులకు పసందైన విందులు, వక్తల తీయని మాటలు విద్యార్థి భవిష్యత్తు బాటలు ఈరోజు నుండే మొదలు అన్న విధంగా కార్యక్రమం జరిగింది. చిన్నారుల నుండి తల్లిదండ్రుల వరకు క్రీడలు నిర్వహించి ప్రైజులు డిస్ట్రిబ్యూట్ చేశారు. ఒక పక్క పేటీఎం సమావేశం మరోపక్క తల్లికి వందనం 13 వేల రూపాయలు అకౌంట్లో జమ అయినట్లు మెసేజ్లు రావడంతో ఆనందం ఆశ్చర్యం నడుమ సమావేశం వెలసి అంతా సందడి అన్న విధంగా పాఠశాలలో వాతావరణం కనిపించింది. జిల్లా పరిషత్ హై స్కూల్ నందు తల్లిదండ్రుల ఆలోచనలకు తగ్గట్టుగా విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెదాపా మండల అధ్యక్షులు అమరవరపు అశోక్ అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బేతీ



శ్రీను, హెచ్ఎం సత్యనారాయణ కురిమెళ్ళ సుధాకర్ కుకునూరు సత్యనారాయణ కొమ్మన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా 2.0 :** ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశ ప్రత్యేక అధికారి హనుమాన్ ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. క్రీడల నందు గెలుపొందిన విద్యార్థులకు రేపాకగొమ్ము సర్పంచ్ వెంకమ్మ,శాఖమూరి సంజీవులు,క్రాంతి కుమార్, సారే బాబ్జి చేతుల మీదుగా ప్రైసెస్ డిస్ట్రిబ్యూట్ చేశారు. కార్యక్రమాన్ని నిర్వహించిన వారిలో లెక్చరర్స్ సుజాత, హరిబాబు, ఇందిరా, ప్రసాద్ బాబు, ప్రదీప్తం, సాయి, సుహాన ఉన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల నందు మెగా పేరెంట్స్ టీచర్ సమావేశం ఘనంగా నిర్వహించారు.

# బీజేపీ ఆధ్వర్యంలో గురుపూర్ణిమ

చాట్రాయి, జులై 10,ప్రభాతవార్త :గురు పూర్ణిమ సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన చాట్రాయిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు ఓబిళ్ళనేని రాజా మాట్లాడుతూ భారతీయ సంప్రదాయంలో గురు పరంపరకు ఎంతో ప్రాధాన్యం ఉందని చెప్పారు. జ్ఞాన విజ్ఞాన విషయాలపై అవగాహన కల్పిస్తూ జీవితంలోని ప్రతి దశను ఎలా తీర్చుదిద్దుకోవాలో మార్గదర్శనం చేసే గురువులను దైవ సమానులుగా భావించే సంస్కృతి మనదన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా విశ్వకర్మ చేతివృత్తులు మరియు మోటార్ మెకానిజంలో ప్రావీణ్యం కలిగి ఎంతోమందికీ పనులను నేర్పించి ఎంతోమందినికి ఉపాధి కల్పించిన ఇటువంటి కుమ్మరి కుంట నవీన్ ను గురువుగా పూజించుకోవడం మనకు ఎంతో గర్వకారణం అన్నారు.



ఈ గురుపూజోత్సవ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు గడ్డం సంజీవరెడ్డి, కనుమతిరెడ్డి ముత్తారెడ్డి , బుర్రి శ్రీకర్ , వాసుదేవరావు, బాలస్వామి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రావిపాడు లో మెగా పి టి ఏ సమావేశం.

అత్తిలి -జులై 10( ప్రభాతవార్త): పెంటపాడు మండలం రావి పాడు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కందిపప్పు కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో మెగా పిటి ఏ సమావేశం నిర్వహించారు. ఎస్ఎంసి చైర్మన్ కరిబండి రాజేశ్వరి, వైస్ చైర్మన్ అశ్విని చేతుల మీదుగా మొక్కలు పంపిణీ చేశారు. మండల విద్యాధికారి 2 టీవీ రామకృష్ణ పరిశీలకునిగా పాల్గొన్నారు. ఉ పాధ్యాయులు పరదేశి,మంగతుయారు పాల్గొన్నారు. తల్లిదండ్రులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు తల్లికి వందనం కార్యక్రమాన్ని



నిర్వహించారు.

## పెన్షన్ దారుల బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలి,

పెనుమంట్ర, జూలై-10, ప్రభాతవార్త: మండలంలో మార్టేరులో రోటరీ క్లబ్ భవనము నందు పెన్షనర్ల సంఘం సమావేశం అధ్యక్షులు తామాడ సత్యనారాయణ అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్యదర్శి పాల ప్రసాద్ రావు మాట్లాడుతూ పెన్షనర్లకు రావలసిన డి. ఆర్, పి. ఆర్. సి, బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పి ఆర్ సి ని వెంటనే నియమించాలని అన్నారు. ఈ లోపు ఇంటీరియం రిలీఫ్, (ఐ ఆర్) ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కార్యదర్శి సిహెచ్ .సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఈనెల15వ తేదీన రాష్ట్ర సంఘం పిలుపుమేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాకు వచ్చి విజయవంతం చేయాలని అన్నారు. హెల్త్ కార్డు ద్వారాఅన్ని వ్యాధులకు క్యాష్ లెస్ వైద్యం అందించాలని కోరారు. తగ్గించిన అడిషనల్ క్వాంటంను యధా విధిగా కొనసాగించాలని



అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కె. సత్యనారాయణ మూర్తి, సహాయ కార్యదర్శి. ఎస్ నందన కుమార్, కే వెంకటలక్ష్మి,ఆర్. గణపతి, పి సువర్ణ గౌరీ తదితరులు హాజరయ్యారు.

## విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి: ఎంపీపీ మక్కా

అత్తిలి– జులై 10 (ప్రభాతవార్త) రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధి కోసం విశేషమైన కృషి చేస్తోందని అత్తిలి మండల పరిషత్ అధ్యక్షుడు మక్కా సూర్యనారాయణ అన్నారు. అత్తిలి బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేటీఎ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల తో పాటు దుస్తులు అందజేస్తుందని అన్నారు. తల్లికి వందనం కింద 15 వేల రూపాయలు అందజేసిందని తెలిపారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని కోరారు. గ్రామ సర్పంచి గంట విజేత నాగరాజు మండల ఉపాధ్యక్షురాలు కొనకళ్ల విజయనిర్మల, టిడిపి మండల అధ్యక్షుడు పోలిశెట్టి చందు, ఆల్తి అజయ్,జనసేన మండల అధ్యక్షులు దాసం ప్రసాద్, ఎంపీటీసీ కుసంపూడి గీతారత్నం, మండల బిజెపి అధ్యక్షుడు మామిడి



శెట్టి నాగబాబు, పట్టణ టిడిపి అధ్యక్షుడుకొరిపల్లి ప్రసాదు, నీటి పంపిణీ కమిటీ చైర్మన్ నల్లూరి సురేష్, మాజీ డిఎస్పి పంజా భరతమాతాజీ, ఎస్ఎంసి చైర్మన్ కే. వీరన్న, ప్రత్యేక అధికారి మురళీ కృష్ణ, ఎంపీడీవో పి. శామ్యూల్, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఎన్ రమేష్, ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు వై.లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులకు చేయూత

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: పట్టణంలోని డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నడవలేని వృద్ధులు వికలాంగులకు వీల్ చైర్, వాకింగ్ స్టాండ్,చేతి కర్రలను అందించడం జరిగింది. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపకులు అమృతల రంగా మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్ కు చెందిన గడ్డం రాంబాబు జ్ఞాపకార్థం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బాలాజీ నగర్ నివాసి శ్రీనివాసరావు కు వాకింగ్ స్టాండ్, ఎల్ 4 కాలనీ నివాసి మల్లిఖార్జునరావుకు వీల్ చైర్, చేతికర్రలను అందించామని తెలిపారు. గతంలో రోటరీ క్లబ్ ద్వారా గెడ్డం రాంబాబుకు అందించిన వీల్ చైర్ ని రాంబాబు మృతి చెందవల్ల మరొక వికలాంగ యువకుడు మల్లిఖార్జున కు అందచేసినట్లు తెలిపారు. డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలకు



సహకారం అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు నేలపోలు ప్రభాకర్ రావు,అధ్యక్ష కార్యదర్శులు కె.లక్ష్మణరావు, పఠాన్ బాజీ, ఉ పాధ్యక్షులు ఎల్ శ్రీనివాస్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పారిజాతగిరి హుండీ ఆదాయం లెక్కింపు

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం జంగారెడ్డిగూడెం దేవాలయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకి ఈ స్వామివారి ఆరాధన తోమాల సేవ తీర్థ ప్రసాద గోష్టి అనంతరం భక్తులు దర్శించారు. నరసాపురం, పాలకొల్లు,తణుకు,భక్తులు యాత్రికి బస్సుల ద్వారా స్వామివారిని కొండా పైకి వచ్చి ప్రత్యేక దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణధికారి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసారు. ఈరోజు ఉదయం 9 గంటలకు శ్రీ స్వామివారి హుండీ ఆదాయం లెక్కింపు ఇన్స్పెక్టర్ వి సురేష్ కుమార్ పర్యవేక్షణలో ఈ హుండీ ఆదాయం లెక్కింపు జరిగింది. 105 రోజులకు రూ.11 లక్షల 35వేల 112 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కలగర శ్రీనివాస్ తెలియజేశారు.



## మావుళ్ళమ్మను దర్శించుకున్న కలెక్టర్ నాగరాణి



భీమవరం జులై 10 ప్రభాతవార్త : శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారిని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ప్రసాదాలు అందచేసారు.

# శాకాంబరిగా కళ్యాణ గణపతి



అత్తిలి జులై 10 (ప్రభాతవార్త ): అత్తిలి బ్రాహ్మణ సేవా సంఘం భవనం వద్ద గల కళ్యాణ గణపతి ఆలయం వద్ద గురు పౌర్ణమి సందర్భంగా స్వామివారిని శాకాంబరిగా అలంకరించారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో స్వామివారిని విశేషంగా అలంకరించారు. బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు పమ్మి గోపాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కూరగాయలు వితరణ చేసిన గూనా వెంకన్నకు, పిండి శ్రీనివాసుకు కృతజ్ఞతలు తెలిపారు..

## మధ్యవర్తిత్వం పై అవగాహన కార్యక్రమం



భీమవరం జులై 10 ప్రభాతవార్త : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 10 నుండి 16 వరకూ "మధ్యవర్తిత్వం" పై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు గురువారం భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డా. బి.లక్ష్మీ నారాయణ అధ్యక్షతన పోక్సో కోర్టు లో మధ్యవర్తి న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, కక్షిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మధ్యవర్తిత్వంపై న్యాయవాదులు, కక్షిదారులు అవగాహన పెంచుకోవాలని, రాబోయే రోజుల్లో కోర్టుల్లో మధ్యవర్తిత్వం ప్రాముఖ్యం పెరుగుతుందని న్యాయమూర్తి డా. బి.లక్ష్మీ నారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యవర్తిత్వ న్యాయవాదులు ఆర్.హరి, కె.బి.రాజశేఖర్, జి.వి.స్టీఫేన్ బాబు, కె.విజయలక్ష్మీ, ఎస్.సుబ్బారాయుడు, ఎస్.మాణిక్యాలరావు, ప్యానల్ న్యాయవాదులు బి.సురేష్ కుమార్, డి.రవికుమార్, కె.జ్యోతి, బి.లోకేశ్వరరావు, ఎం.బి.భవాని, ఎన్.సుధీర్, పి.అంబేద్కర్, పారా లీగల్ వాలంటీర్లు కె.చంద్రరావు, వి.శ్రీలక్ష్మీ, పి.సూర్యనారాయణ, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మావుళ్ళమ్మ ఆలయంలో ఘనంగా పౌర్ణమి చండీ యాగం



భీమవరం జులై 10 ప్రభాతవార్త :శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం నందు పౌర్ణమి సందర్భంగా ఆలయ అర్చకులు వేదపండితులు చండీహోమం నిర్వహించారు 70 మంది దంపతులు ఈ హోమం లో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## వివేకానంద పాఠశాల యందు
### మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్



పెనుమంట్ర, జూలై-10, ప్రభాతవార్త: మండలంలోని మార్టేరు వివేకానంద పాఠశాలలో గురువారం తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా నరసాపురం ఆర్ టీ సి డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి యం పి టీ సి గుడిమెట్ల లక్ష్మణరెడ్డి హాజరయ్యారు. వివిధ ఆటలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ప్రతి విద్యార్థి ఇంటి వద్ద తల్లి పేరు మీద ఒక మొక్క నాటలని తెలిపి విద్యార్థులకు మొక్కలు పంపిణి చేసారు. తల్లిదండ్రులు విద్యార్థుల ఫోటోషూట్ ఏర్పాటు చేసారు. తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో గ్రామ పంచాయతీ సిబ్బంది, స్కూల్ డైరెక్టర్ గుడిమెట్ల రామారెడ్డి, స్కూల్ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తెర

## లంబకోణాలు నేర్పిన చోటే..
# కుంభకోణాలు

స్నేహ చిత్ర పిక్చర్స్ బ్యానర్‌లో ఆర్ నారాయణ మూర్తి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం యూనివర్సిటీ (పేపర్ లీక్). ఈ చిత్రం ఆగస్టు 22 న ప్రేక్షకుల ముందుకు వస్తున్న సందర్భంగా ప్రసాద్ ల్యాబ్ లో మీడియా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ నారాయణ మూర్తి,



గోరేటి వెంకన్న, అద్దంకి దయాకర్, దేశపతి శ్రీనివాస్, అందేశ్రీ, జయరాజ్, నందిని సిద్దారెడ్డి, ప్రొఫెసర్ ఖాసీంతో పాటు పలువురు విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు. వక్తలు ప్రసంగిస్తూ .. యూనివర్సిటీ పేపర్ లీక్ సినిమా కేవలం విద్యార్థులే కాదు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరూ చూడదగిన మంచి చిత్రం అని కొనియాడారు. ఆర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ ఈ సినిమాలో 5 పాటలు ఉన్నాయి. కీర్తిశేషులు స్వర్గీయ గద్దర్ గారు, జలదంకి సుధాకర్, వేల్పుల నారాయణ, మోటపలుకుల రమేష్ గొప్పగా రాశారు. ఈ చిత్రం కథాశం ఏమిటంటే..గత కొన్నేళ్లుగా మన విద్యారంగంలో జరుగుతున్న పేపరు లీక్‌లు..గ్రూపు 12 లాంటి ఉద్యోగ ప్రశ్న పత్రాల లీకులు చూస్తుంటే ఈ చదువులకేమైంది అని పిస్తుంది. ఇలా జరుగుతూ వుంటే విద్యార్థుల భవిష్యత్ ఏం కావాలి ? నిరుద్యోగుల జీవితాలు ఏమైపోవాలి ? లంబకోణాలు నేర్పిన వాళ్ళే కుంభకోణాలు జేస్తూ ఉంటుంటే రెక్కలు తెగిన జ్ఞాన పావురాలు విలవిల కొట్టుకుంటూ ఊపిరాడక నెల రాలుతుంటే కన్న తల్లితండ్రులు ఏమై పోవాలి. వాళ్లకు పాఠాలు బోధించిన గురువులు ఏమి కావాలి. రెండవ ప్రపంచ యుద్ధంలో అమెరికా నాగాసాకి హిరోషిమాల మీద వేసిన ఆటంబాంబులు కంటే హైడ్రోజెన్ బాంబులు కంటే టోర్నాడోటార్పిడో ల కంటే సునామీల కంటే చాలా ప్రమాదకరమైనది కాపీయింగ్. చూసి రాసిన వాళ్ళు డాక్టర్లు అయితే పేషెంట్ బ్రతుకుతాడా?? అలాంటి వాళ్ల ఇంజినీర్ అయితే బ్రిడ్జిలు నిలబడుతయా? పేషెంట్లు బ్రతకాలి అన్న బ్రిడ్జిలు కూలిపోకుండా ఉండాలి అన్న, ప్రశ్న పత్రాలు లీకులు మాయం కాకూడదు. అందుకే విద్యను ప్రవేటు మాఫియా కబంధ హస్తాల నుంచి విముక్తి చేసి విద్యను జాతీయం చేయాలి. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. అని చాటి చెప్పేదే ఈ యూనివర్సిటీ పేపర్ లీక్ చిత్రం. ఆగస్టు 22 న ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నాము అని అన్నారు.



# సూర్యుడికే కన్ను గప్పి..

పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా జ్యోతి కృష్ణ తెరకెక్కించిన చిత్రం హరిహర వీరమల్లు. ఏ.ఎం.రత్నం నిర్మించారు. నిధి అగర్వాల్ కథానాయిక. ఈ నెల 24న చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది. బాబీ డియోల్ ప్రతినాయకుడి పాత్రను పోషించారు. పవన్ తొలిసారి చారిత్రక యోధుడి పాత్రను పోషించడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు ఆకట్టుకున్నాయి. తాజాగా, ఈ సినిమా నుంచి ఎవరది ఎవరది.. అతగాడో పొడుపు కథ.. దొరకనే దొరకడే అతగాడో మెరుపుకథ.. సూర్యుడికే కన్నుగప్పి సంచరించే యోధుడు.. చంద్రుడ్నే సంచికెత్తి తస్కరించె ధీరుడు అంటూ సాగే పాటను విడుదల చేసింది చిత్రబృందం.

## రాజా సాబ్‌తో చిందు ?



ప్రభాస్ నటిస్తున్న ది రాజా సాబ్ సినిమాలో తమన్నా ఐటెమ్ సాంగ్ చేస్తుందన్న వార్తలు సినీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి.

మిల్కీ బ్యూటీ ఇటీవల ఐటెమ్ సాంగ్‌తో సందడి చేస్తోంది. తాజాగా ఈ చిత్రంలో తమన్ కంపోజ్ చేసిన బీట్స్ పై ప్రభాస్‌తో కలిసి డాన్స్ చేస్తుందట. గతంలో వీరిద్దరు రెబల్ సినిమాలో జంటగా కనిపించారు. ఇప్పుడు మళ్లీ ఈ కాంబో ఐటెమ్ సాంగ్‌లో రీయూనియన్ కానుందన్న టాక్‌తో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. డిసెంబర్ 5న విడుదలయ్యే ఈ హారర్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో ఐటెమ్ సాంగ్ మినహా షూటింగ్ పూర్తయిందని సమాచారం. సినిమా అంటే ప్రేక్షకులకు ఎమోషన్. మూడ్ బాగున్నా, బాగోలేకపోయినా, అకేషన్ ఉన్నా, సెలబ్రేషన్ ఉన్నా సినిమా చూస్తేనే అదొక కిక్కు. సినిమాల్లో కథ, స్క్రీన్‌ప్లే ఎంత బాగున్నా సాంగ్స్ కూడా రిజల్ట్‌ని డిసైడ్ చేస్తుంటాయి. మూవీలో హీరో హీరోయిన్ల మధ్య ఎన్ని సాంగ్స్ ఉన్నా ఐటెమ్ సాంగ్స్ కూడా పెడుతుంటారు మేకర్స్. ఇందులో అందంతో పాటు డ్యాన్స్ బాగా చేసే నటీమణులను తీసుకుంటుంటారు. గతంలో తెలుగు సినిమాల్లో ఎన్టీఆర్, ఏఎన్నార్ తరంలో ఐటెమ్ సాంగ్స్ చేసేందుకు జ్యోతిలక్ష్మి, జయమాలిని, అనురాధ, సిల్క్‌స్మిత, ఆ తర్వాత అభినయశ్రీ, ఆల్ఫాన్సా లాంటి తారలు ప్రత్యేకంగా ఉండేవారు.



## పత్తి మంటల్లో
# దిగాలుగా

నేషనల్ అవార్డ్ విన్నింగ్ యాక్టర్ ధనుష్ తన లేటెస్ట్ బ్లాక్‌బస్టర్ కుబేర తర్వాత ఇదే జోరులో 54వ చిత్రం అధికారికంగా అనౌన్స్ చేశారు. విమర్శకుల ప్రశంసలు పొందిన థ్రిల్లర్ పోర్ తోజిల్ ఫేం విఘ్నేష్ రాజా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ఈరోజు ప్రారంభమైంది. రెగ్యులర్ షూటింగ్ కూడా ప్రారంభమైంది. అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో ధనుష్ పవర్ ఫుల్ లుక్‌లో, అగ్ని దగ్గర నిలబడటం సినిమా సీరియస్ టోన్‌ని సూచిస్తుంది. ఇందులో ధనుష్ నిలబడి దిగాలుగా కనిపిస్తుండగా తన పత్తి పంట కాలిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. దీనితో ఈ సినిమాలో ధనుష్ ఒక రైతుగా కనిపిస్తాడని అనిపిస్తుంది. మొత్తానికి మాత్రం ధనుష్ మరో సాలిడ్ రూరల్ ఎమోషనల్ డ్రామాతో రాబోతున్నాడని చెప్పవచ్చు. ఇక ఈ చిత్రానికి జీవి ప్రకాష్ సంగీతం అందిస్తుండగా వేల్స్ ఫిల్మ్స్ ఎంటర్టైన్మెంట్స్ అలాగే థింక్ స్టూడియోస్ వారు నిర్మాణం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ మొదలు పెట్టుకుంది.



## ఈసారి గూఢచారి?

అక్కినేని నాగచైతన్య రీసెంట్‌గా తండేల్ చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్నాడు. ఈ సినిమా ఇచ్చిన బూస్ట్‌తో ఆయన ఇప్పుడు తన నెక్స్ట్ చిత్రాన్ని విరూపాక్ష ఫేం దర్శకుడు కార్తీక్ దండుతో చేస్తున్నాడు.

ఈ సినిమా మిస్టిక్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే, ఇప్పుడు చైతూ ఈ సినిమా షూటింగ్ దశలో ఉండగానే మరో ప్రాజెక్ట్‌ని ఒకే చేసే పనిలో ఉన్నాడు. తమిళ దర్శకుడు పిఎస్. మిత్రన్ డైరెక్షన్‌లో చైతూ ఓ సినిమా చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో నాగ చైతన్య ఓ స్పై పాత్రలో నటిస్తాడనే టాక్ సినీ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. మిత్రన్ ఇప్పటికే అభిమన్యుడు, సర్దార్ వంటి సినిమాలతో మంచి ఫేం తెచ్చుకున్నారు. ఇక ఇప్పుడు మరోసారి యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రంతో నాగచైతన్యను స్పై గా మనకు చూపెట్టేందుకు ఆయన రెడీ అవుతున్నారు. మరి ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఎప్పుడు వస్తుందో చూడాలి.



# మార్షల్ షూటింగ్ షురూ

సత్యం సుందరంతో అలరించిన హీరో కార్తీ ఇప్పుడు విమర్శకుల ప్రశంసలు పొందిన తానక్కారన్ ఫేం డైరెక్టర్ తమిజ్ తో కలిసి తన 29వ చిత్రం కోసం చేతులు కలిపారు. ఈ ప్రాజెక్టును డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ఆర్ ప్రకాష్ బాబు,ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తారు. ఇషాన్ సక్సేనా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కార్తీని ఇంటెన్స్‌గా ప్రెజెంట్ చేసిన అద్భుతమైన పోస్టర్‌తో మేకర్స్ మార్షల్ అనే టైటిల్‌ను రిలీజ్ చేశారు. గురూరం శుభ పూజా కార్యక్రమంతో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. ఈ భారీ బడ్జెట్ చిత్రంలో కళ్యాణి ప్రియదర్శన్ కథానాయికగా నటిస్తోంది. సత్యరాజ్, ప్రభు, లాల్, జాన్ కొక్కెన్, ఈశ్వరి రావు, మురళీ శర్మ ఇందులో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మార్షల్‌ను అత్యున్నత స్థాయి సాంకేతిక, నిర్మాణ విలువలతో భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ సత్యన్ సూర్యన్ కెమెరామెన్‌గా వ్యవహరిస్తుండగా, సంగీత సంచలనం సాయి అభ్యాంకర్ సంగీతం అందిస్తున్నారు. ఫిలోమిన్ రాజ్ ఎడిటర్‌గా, అరుణ్ వెంజరమూడు ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. ఎక్సయిటింగ్ టైటిల్ రివీల్‌తో మార్షల్ కార్తీ ఫిల్మోగ్రఫీకి మెమరబుల్ మూవీగా ఉంటుందని హామీ ఇచ్చారు.


## గ్రామీణ ప్రేమకథగా ఉసురే

యదార్థ సంఘటనలతో, సమాజంలో జరిగిన వాస్తవ కథను తెరపై ఆసక్తికరంగా చూపిస్తే ఆ చిత్రాలు తప్పకుండా ప్రేక్షకాదరణ పొందుతాయి. ఇప్పుడు ఈ కోవలోనే యదార్థ సంఘటనలతో రూపొందిన ఓ వైవిధ్యమైన గ్రామీణ ప్రేమకథగా ఉసురే ఆగస్టు 1న థియేటర్స్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. టీజయ్ అరుణాసలం, జననీ కునశీలన్ హీరో, హీరోయిన్స్‌గా




రూపొందుతోన్న ఈ చిత్రానికి నవీన్ డి.గోపాల్ దర్శకుడు. శ్రీకృష్ణ ప్రొడక్షన్స్ సమర్పణలో బకియా లక్ష్మీ ్మ టాకీస్ పతాకంపై మోళి ఎం రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 1న విడుదల చేస్తున్నారు మేకర్స్. సీనియర్ హీరోయిన్ రాశి ఈ చిత్రంలో ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. దర్శకుడు చిత్ర విశేషాలను తెలియజేస్తూ ఇదొక వైవిధ్యమైన ప్రేమకథ. ఎంతో రియలిస్టిక్ అప్రోచ్‌తో ఈ ప్రేమకథ అందరి హృదయాలకు హత్తుకుంటుంది. సమాజంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాం. రొమాన్స్, కామెడి, డ్రామా గా రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రతి అంశం ఎంతో ఆస్తికికరంగా, ఉత్కంఠగా ఉంటుంది.

# ఏ ఊరికి వెళతావే పిల్లా..



యాక్షన్ కింగ్ అర్జున్ తొలిసారి తెలుగులో దర్శకత్వం వహిస్తూ కూతురు ఐశ్వర్యను హీరోయిన్‌గా టాలీవుడ్‌కు పరిచయం చేస్తున్న చిత్రం సీతా పయనం. అర్జున్ స్వయంగా నిర్మిస్తూ, కథ, స్క్రీన్ ప్లే అందించిన ఈ సినిమాతో కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర సోదరుడి కుమారుడు నిరంజన్ హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించాడు. అర్జున్, ప్రకాశ్ రాజ్, ధృవ్ సర్జా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే.. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదల చేసిన టీజర్ సినిమాపై మంచి హైప్ తీసుకు రాగా తాజాగా ఈ ఏ ఊరికి వెళతావే పిల్లా అంటూ సాగే మెలోడీ పాటను విడుదల చేశారు. అస్కార్ విన్నర్ చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను రాహుల్ సిప్లీగంజ్, మధు ప్రియ పాడారు. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాలలోని ప్రముఖ ప్రాంతాల పేర్లను వాడుతూ సాగిన పాట వినడానికి చూడడానికి వినడానికి వినసొంపుగా కనులకింపుగా ఉండి అద్యంతం అకట్టుకునేలా ఉంది. శ్రేష్టి వర్మ అందించిన డ్యాన్స్ కూడా అదిరిపోయేలా ఉంది.



## కొత్తపల్లిలో ఒకప్పుడు ఏం జరిగింది?

కేరాఫ్ కంచరపాలెం చిత్రంతో విమర్శకుల ప్రశంసలతోపాటు చక్కని విజయం అందుకున్నారు నిర్మాత ప్రవీణ పరుచూరి. తదుపరి ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఇప్పుడామె కొత్తపల్లిలో ఒకప్పుడు అనే సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రవీంద్ర విజయ్ ప్రధాన పాత్రలో నటించారు. రానా నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమా జులై 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ట్రైలర్‌ను

## విశాఖలో అల్లు భారీ మల్టీప్లెక్స్

అల్లు అర్జున్ మల్టీప్లెక్స్ ప్రస్తుతం వైజాగ్ ఆడియెన్స్ కోసం రాబోతోంది. ఏసియన్ సునీల్ నారంగ్‌తో కలిసి టాలీవుడ్ హీరోలంతా థియేటర్ బిజినెస్‌లో దిగుతున్న సంగతి తెలిసిందే. మహేష్ బాబుతో ఏఎంబీ, బన్నీతో ఎఎఎ, రవితేజతో ఏఆర్‌టీ మల్టీప్లెక్సుల్ని సునీల్ నారంగ్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. విజయ్ దేవరకొండతో ఏవీడీ అనే మల్టీప్లెక్స్‌ని కూడా ప్రారంభించారు. అయితే ఇప్పుడు వైజాగ్ సిటీలో ఎఎఎ మల్టీప్లెక్స్ రాబోతోంది. త్వరలోనే ఈ మల్టీప్లెక్సుని ప్రారంభించబోతోన్నారు.


వైజాగ్‌లోని ఎఎఎలో 8 స్క్రీన్లు ఉంటాయని తెలుస్తోంది. అత్యంత అధునాతన సాంకేతికత, సౌకర్యాలతో ఈ మల్టీ ప్లెక్సుని నిర్మించినట్టుగా సమాచారం. ఇక ఈ మల్టీప్లెక్‌ని వార్ 2, కూలీ చిత్రాలతోనే ఓపెన్ చేసేలా ఉన్నారు. ఒక వేళ వైజాగ్‌లో కూడా అమీర్ పేట్‌లోని ఎఎఎ క్లిక్ అయినట్టుగా అయితే ఇతర నగరాల్లోనే మరిన్ని మల్టీప్లెక్సులు ఓపెన్ చేస్తారేమో చూడాలి.

## దీపావళికి 'రీర్యాంప్'

యంగ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'రీర్యాంప్'. కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న 11వ చిత్రమిది. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. జెట్ స్పీడ్‌తో షూటింగ్ జరుపుకుంటున్న 'రీర్యాంప్' సినిమా తాజాగా కేరళ షెడ్యూల్ కంప్లీట్ చేసుకుంది. ఇక్కడి బ్యూటిఫుల్ లొకేషన్స్‌లో చిత్రీకరించిన సీన్స్ మూవీలో ఐ ఫీస్ట్‌గా ఉండబోతున్నాయి. ఇటీవల ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన హీరో కిరణ్ అబ్బవరం ఫస్ట్ లుక్ పోస్టర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం చిత్రీకరణ తుది దశకు చేరుకున్న 'రీర్యాంప్' మూవీ దీపావళికి గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

# ప్రహ్లాదుడిని రక్షించడానికి మహావతార్

హోంబాలే ఫిల్మ్స్ సమర్పణలో క్లీమ్ ప్రొడక్షన్స్ మహావతార్ నరసింహా విజువల్ వండర్, శక్తివంతమైన కథనంతో ఒక ప్రత్యేకమైన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వబోతోంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మహావతార్ నరసింహా ట్రైలర్ రిలీజ్ అయ్యింది. ట్రైలర్ అత్యద్భుతంగా వుంది. హిరణ్యకశిపుడు బ్రహ్మ దేవుడి వరం కోసం ఘోర తపస్సు చేసే సీక్వెన్స్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం కట్టిపడేసింది. విష్ణువుపై భక్తితో ప్రహ్లాదుడు, తన



నాస్తిక తండ్రి హిరణ్యకశిపుడి నుండి వ్యతిరేకతను ఎదుర్కొంటాడు. ప్రహ్లాదుడిని రక్షించడానికి దిగివచ్చిన విష్ణువు అవతారమైన మహావతార్ నరసింహుడి రాకతో ట్రైలర్ గూస్ బంప్స్ తెప్పించింది.

ఎపిక్ విజువల్స్, అద్భుతమైన నేపథ్య సంగీతంతో ఈ ట్రైలర్ విజువల్ వండర్ లా వుంది. సినిమా నెక్స్ట్ లెవల్ కి చేరుకుంది. భారతీయ చరిత్ర నుండి ఈ ఐకానిక్ కథను ఇంత అద్భుతంగా చూపడం ఇంతకు ముందు చూడలేదు.

# స్త్రీల ఆత్మగౌరవాన్ని తగ్గించకూడదని..

చిన్న పిల్లలకోసం ఓ క్లినిక్, కుక్క పిల్లలకోసం ఓ క్లినిక్.. ముక్కు, గొంతు, చెవి, కన్ను అంటూ అవయవానికో ఆసుపత్రి ఉండటం మనకు తెలిసిందే. కానీ, బిహార్‌లోని బిషన్‌పూర్ బాగ్‌నగరి సర్పంచ్ బబితా కుమారి మాత్రం వాళ్ల ఊరిలో ఓ 'టాయిలెట్ క్లినిక్' ఏర్పాటు చేశారు.

అదెందుకో తెలుసుకుందాం..

మార్పు ఒక్కరోజులో రాదు.. కానీ, ఆ ప్రయత్నాలకు మహిళలు తోడైతే సామాజికాభివృద్ధిలో విప్లవం మొదలవుతుంది. అంటారు బబిత. అందుకే స్త్రీల ఆత్మగౌరవాన్ని తగ్గనివ్వకూడదని.. పాడైన, నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను బాగు చేయడానికి నడుం బిగించారు. మరుగుదొడ్ల క్లినిక్' ఏర్పాటు చేశారు. తమ ప్రాంతంలో స్వచ్ఛభారత్ మిషన్-గ్రామీణ్ కింద నిర్మించిన 1269 మరుగుదొడ్లలో దాదాపు 190 శిథిలావస్థకు చేరాయని తెలిశాకే తాను ఈ నిర్ణయం తీసుకున్నా అంటారామె. 11 మంది కార్మికులను అందులోనూ ఆరుగురు ఆడవాళ్లను పారిశుద్ధ్య కార్మికులుగా నియమించి ఈ పనిచేస్తున్నారు. డిస్ట్రిక్ట్ వాటర్ అండ్ శానిటేషన్ కమిటీ, యేనిసెఫ్ మద్దతుతో, జీవిక లైవ్లీ హుడ్ మిషన్ వంటి సంస్థలు ఈ విషయంలో బబితకు తోడుగా నిలుస్తున్నాయి. 'స్వచ్ఛతా హీ సేవా' ప్రచారం సందర్భంగా ఇంటింటికీ వెళ్లి తోలు బొమ్మల ప్రదర్శనలు, కొవ్వొత్తుల ప్రచారంతో పారిశుద్ధ్య శుభ్రత సామాజిక వ్యవహారంగా మారింది.



**గృహహింస నుంచి బయటపడేలా..**

2021లో సర్పంచ్‌గా ఎన్నికైన బబిత అందరిలా భర్త చాటు భార్యలా కాకుండా.. స్పష్టమైన ప్రణాళికలతో మహిళ భాగస్వామ్యంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కున్నారు. తాను ఎన్నికయ్యాక మొదటిసారి ఏర్పాటు చేసిన గ్రామసభలో మహిళలెవరూ లేకపోవడాన్ని గుర్తించారు. వారికోసమే ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రతి పనిలోనూ వారిని భాగస్వాముల్ని చేయాలనుకున్నారు. గృహహింస నుంచి డ్రైనేజీ ప్రణాళికల వరకూ అనేక నిర్ణయాల్లో మహిళల పాత్రను పెంచారు. హింస నుంచి బయటపడటానికి మహిళలకు నైతిక మద్దతు ఇస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసేలా పంచాయతీ వ్యవస్థలను అలర్ట్‌గా ఉంచుతున్నారు. ఇక, టాయిలెట్ల పునర్వినియోగంతో పాటు నీటి కొరతను కూడా తీర్చారామె. గ్రామ ప్రణాళికలో బావుల పునరుజ్జీవనాన్ని చెర్చారు. ఎండిపోయిన 27 బావుల్లో 17ని వినియోగంలోకి తెచ్చారు. చెట్ల పెంపకం ద్వారా భూగర్భ జలాలను రీఛార్జ్ చేస్తున్నారు. అంతేనా, గ్రామంలో తొమ్మిది రకాల కంపోస్ట్‌లను తయారు చేస్తూ వాటిని అమ్ముతూ ఆదాయాన్ని అందుకుంటున్నారు. ఈ కృషికే ఎన్నో అవార్డులూ, రివార్డులూ బబితను వరించాయి.

# పర్యావరణ పరిరక్షణకు కృషి

**పెళ్లిళ్లు, రాజకీయ, సామాజిక కార్యక్రమాలు ఎక్కడికెళ్లినా ఆమె సందడే. తాను స్వయంగా తయారుచేసిన తాను ఉత్పత్తులను బహుమతులుగా అందరికి అందిస్తాను కూడా. తనెవరు? ఎందుకలా వస్తోందో తెలుసుకుదాం..**



కన్యాకుమారికి దగ్గర్లోని ఎతవిలై గ్రామం ఈఎల్ ప్రతీజీన్‌ది. ఎత్తైన తాటి చెట్లు, వాటినుంచి వచ్చే చల్లని గాలి, తాటి ఆకుల్లో షర్బత్ తాగటం. నార చాపలపైనే పడుకోవటం, తాటి బెల్లం, ముంజలు తినటం.. తన బాల్యమంతా గడిచిపోయింది. ఇలానే ఇలాంటి వాతావరణంలో పెరగటం వల్లేమో, తాటి చెట్లతో ఆమెకు తెలియని అనుబంధం ఏర్పడింది. పెరిగి పెద్దయ్యాక ఆ ప్రేమ పోలేదు హిస్టరీలో పిజి, తమిళ్ లిటరేచర్‌లో డిగ్రీ, మాంటిస్సోరి ట్రైనింగ్ తీసుకున్న జీన్ టీచర్‌గా పనిచేసింది. పదేళ్లకు పైగా అనుభవం సంపాదించాక ఆ వృత్తిని విడిచిపెట్టి, 40 ఏళ్ల వయసులో జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. అదే తాటి చెట్ల సంరక్షణ. తన చిన్ననాటి రోజులు మళ్లీ రావాలనుకుంది. తాటి చెట్లు కోల్పోయిన వైభవాన్ని తిరిగి తీసుకురావాలనే తపనతో తాన్(టిఎఎన్) పామ్ ఫౌండేషన్ ప్రారంభానికి శ్రీకారం చుట్టింది.

**టీచింగ్ అనుభవంతోనే...**

ఈ ఫౌండేషన్ ద్వారానే తమిళనాడు అంతటా తిరుగుతూ తాటి మొక్కల ప్లాంటింగ్ డ్రైవ్‌లు నిర్వహిస్తోందీమె. భవిష్యత్ తరాలకూ తాటి చెట్లు, వాటి ఉత్పత్తుల వల్ల లాభాలు ఏముంటాయో తెలియజేయాలని స్కూళ్లు, కాలేజీల్లో వర్క్‌షాప్‌ఐ నిర్వహిస్తోంది. రైతులకి తాటి విత్తనాలను పంచుతూ, అవగాహన కార్యక్రమాలూ చేపడుతోంది. అంతేకాదు, తాటాకులతో బుట్టలు, టోపీలు, ఫ్యాన్‌లు, డెకరేటివ్ ఉత్పత్తులు వంటివి తయారుచేయటంలో మహిళలకు శిక్షణా ఇస్తోంది కోస్తా తీరంలో నీటి వనరులు ఉన్న చోట తాటి చెట్లు పెంచటం వల్ల అవి నేల కొట్టుకుపోకుండా కాపాడతాయి. జీవవైవిధ్యానికి సాయపడతాయి. వీటన్నింటి గురించీ ప్రజలకు తెలియజేస్తోంది. ఇవి అక్కడి వాళ్లను బాగా ఆకర్షించాయి. ఆలోచింపచేశాయి కూడా. అందుకే, అక్కడి వాళ్లంతా జీన్‌ను 'పామ్ స్టార్' అంటూ పిలుచుకుంటారు. అంతగా ప్రజల్లోకి ఈ విషయాలు చేరువ చేయటంలో జీన్‌కు ఉన్న టీచింగ్ అనుభవం బాగా ఉపయోగపడిందట. చిన్నప్పటి నుంచీ తాటిచెట్ల మధ్యే పెరిగా. అవి కేవలం చెట్లు కాదు. మా జీవితంలో ఓ భాగం, జీవనరేఖ. ఆహారం, నివాసం, ఆదాయం.. ఇలా అన్నింటినీ ఇస్తాయి మరి. వాటినిసంరక్షిస్తే.. మన వారసత్వాన్ని రక్షించుకున్నట్లే. ఇది కేవలం చెట్ల సంరక్షణ గురించి చేసే ఓ పోరాటం కాదు, పర్యా వరణాన్ని కాపాడే జీవన విధానం కూడా. హోమియో వైద్యురాలైన అమ్మ లీలాబాయి వల్లే ఈ జీవన విధానం నాకు అలవాటయ్యింది. దీనిపై గౌరవం పెరిగింది. అని చెబుతోంది జీన్. తాటి చెట్ల సంరక్షణ మీద, వాటి ఉత్పత్తుల ప్రోత్సాహం కోసంఎంతగానో కృషిచేస్తున్నారు జీన్ అంటూ అక్కడి అధికారుల మెప్పునూ పొందింది జీన్. తాటిచెట్ల సంరక్షణకూ, తద్వారా సస్టైనబుల్ జీవన విధానానికీ, పర్యావరణ పరిరక్షణకూ కృషి చేస్తోన్న జీన్ ప్రయత్నం అభినందనీయమే కదా!



# తమలపాకు పండింది..



అమ్మాయి అరచేయి.. ఎర్రగాపండి కనిపిస్తోంటే ఎంత అందమో కదా! వేడుకలప్పుడు చేతిపై ఆ అందం లేకపోతే బోసిపోయినట్లే అనిపిస్తుంది. కానీ అస్తమానం గోరింటాకేకావాలంటే చాలామందికి కష్టమే. అయితే తమలపాకు తెచ్చేసుకోండి. దానితోనూ అరచేత ఎర్రదనం పండించుకోవచ్చు. ఎలాగంటే తాజా తమలపాకులు ఓ పది తీసుకుని, కాడలు తీసేయండి. వాటికి అరస్పూను చొప్పున పసుపు, సున్నం కలిపి, మెత్తగా మిక్సీ పట్టండి. నీళ్లు కలపొద్దు, నిల్వ ఉన్న ఆకుల్నీ వాడొద్దు. తరవాత రసాన్ని వడకట్టి, బాగా ఎర్రగా ఉన్న కుంకుమ కలుపుకోవాలి. ఆ మిశ్రమంతో చేతిపై నచ్చిన డిజైను వేసుకోండి. ఆరిన తరువాత కడిగేసి చూసుకోండి. అచ్చమైన గోరింటాకు లాగే పండుతుంది. మొత్తం ప్రక్రియకు ఎక్కువ సమయం కూడా పట్టదు. కావాలంటే ప్రయత్నించి చూడండి.



# సేమియా బొబ్బట్లు

**కావలసినవి:**

సేమియా, గోధుమపిండి కప్పు చొప్పున, పంచదార, కొబ్బరి తురుము ముపా కప్పు చొప్పున, నూనె రెండు స్పూన్లు, నెయ్యి తగినంత, ఉప్పు రుచికి సరిపడా, బాదం, జీడిపప్పు రెండు టేబుల్‌స్పూన్ల చొప్పున, యాలకుల పొడి అర చెంచా



**తయారీ:** ఒక గిన్నెలో గోధుమపిండి, తగినన్ని నీళ్లు, ఉప్పు, నూనె వేసి కలపండి. పిండి మెత్త అయ్యిందనుకున్నాక పక్కన పెట్టండి బాదం, జీడిపప్పులను గ్రైండ్ చేయండి. కడాయిలో నెయ్యి వేడయ్యాక సేమియాను వేయించి.. లేత గోధుమరంగులోకి మారాక పళ్లెంలోకి తీయండి. కడాయిలో రెండు కప్పుల నీళ్లను మరిగించి.. అందులో వేయించిన సేమియా, పంచదార వేసి దగ్గరగా అయ్యేవరకు ఉడికించండి. సెగ తగించి కొబ్బరి తురుము, బాదం, జీడిపప్పుల పొడి యాలకుల పొడి వేసి కలియబెట్టి, నిమిషం తర్వాత సెగ తీసేయండి. సేమియా మిశ్రమం చల్లారాక.. చిన్న బాల్స్ చేయండి. గోధుమ పిండితో చపాతీ చేసి.. మ సేమియా ముద్ద ఉంచి మరోసారి రోల్ చేయండి అన్నీ అయ్యాక.. నేతితో రెండువైపులా కాల్చుకోండి. అంతే టేస్టీ సేమియా బొబ్బట్లు తయారై పోతాయి. వీటి మీద కాస్త నెయ్యి రాసు తింటే మరింత రుచిగా ఉంటాయి.

# ఇవి ఇతరులతో పంచుకోరాదు

**ఆపాదమస్తకం అందంగా మెరిసిపోవలని అందరికీ ఉంటుంది. అందుకోసం మేకప్‌ను కూడా ఆశ్రయిస్తూ ఉంటాం. ఈ క్రమంలో కొందరు మేకప్ ఉత్పత్తులు అందులో ఉపయోగించే బ్రష్‌లను సైతం ఇతరులతో పంచుకొంటూ ఉంటారు. మీరూ అంతేనా? అయితే జాగ్రత్త! అలా చేయడం వల్ల చర్మానికి హాని కలిగే అవకాశాలు చాలానే ఉన్నాయంటున్నారు నిపుణులు. మరి, సౌందర్య సంరక్షణలో భాగంగా ఏయే ఉత్పత్తులను ఇతరులతో పంచుకోకూడదో తెలుసుకుందామా..**

స్నేహితులు లేదా బంధువుల్లో ఎవరివైనా లిప్‌స్టిక్/లిప్‌గ్లాస్/ మేకప్ నరబష్.. ఇలా ఏది కనిపించకపోయినా వెంటనే పక్కనున్న వాళ్లు ఇదిగో.. నాది తీసుకో అంటూ అందించడం లేదంటే మనమే వాళ్లను అడగడం సర్వసాధారణమే. అయితే ఆ క్షణానికి అందంగా కనిపించడానికి అది ఉపయోగపడినా ముందు ముందు మాత్రం సౌందర్యపరంగా చాలా నష్టాలే ఎదుర్కోవాల్సి రావచ్చు. అందుకే సౌందర్య సంరక్షణలో భాగంగా కొన్ని ఉత్పత్తులను ఇతరులతో అస్సలు పంచుకోకూడదు.



**పౌడర్ రూపంలో ఉంటే...** మేకప్‌లో ఉపయోగించే ఫౌండేషన్, ఐ షాడో.. వంటివి కొన్ని పౌడర్ రూపంలో కూడా ఉంటాయి. అయితే వీటిని ఒకరి కంటే ఎక్కువమంది చేతితో తాకినా లేదా బ్రష్‌తో అప్లై చేసుకున్నా అందులో బ్యాక్టీరియా చేరే అవకాశాలు ఎక్కువ. ఫలితంగా మొటిమలు రావడం, చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు దరిచేరడం వంటి సమస్యలు రావచ్చు. కాబట్టి పౌడర్ రూపంలో ఉన్న ఉత్పత్తులను ఇతరులతో అస్సలు పంచుకోకూడదు.



**లిప్‌స్టిక్/లిప్‌గ్లాస్:..** చాలామంది రంగు బాగుందనో లేక మంచి లుక్ ఇస్తుందనో ఇతరుల లిప్‌స్టిక్/ లిప్‌గ్లాస్ ఉపయోగిస్తూ ఉంటారు. అయితే ఇతరులవి మనం ఉపయోగించడం వల్ల వాటిపై ఉన్న బ్యాక్టీరియా మన అధరాల పైకి చేరే అవకాశాలు లేకపోలేవు. అలాగే మన అధరాలపై ఉన్న తేమలో ఉండే బ్యాక్టీరియా కూడా వాటికి తోడై పెదాలకు హాని కలిగించవచ్చు. కాబట్టి ఇవి కూడా ఎవరివి వారూ ఉపయోగించుకోవడం శ్రేయస్కరం.

**కళ్ల సంబంధిత ఉత్పత్తులు.....** ఐ షాడో, మస్కారా, ఐ లైనర్.. వంటి ఐ మేకప్ ఉత్పత్తులను చాలా జాగ్రత్తగా ఉపయోగించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఇతరుల ఐ మేకప్ ఉత్పత్తులు ఉపయోగించేటప్పుడు వారికి ఏమైనా కళ్ల సంబంధిత ఇన్ఫెక్షన్లు ఉంటే అవి మనకు కూడా వచ్చే అవకాశాలు లేకపోలేవు. అలాగే ఆ ఉత్పత్తుల్లోని బ్యాక్టీరియా వల్ల కళ్లు ఎర్రబడడం, నీళ్లు కారడం, మండడం.. వంటి సమస్యలు కూడా తలెత్తుతాయి.



**మూతలు ఉండేవి..** కొన్ని రకాల క్రీమ్‌లు, పౌడర్లు మూతలు ఉండే చిన్న చిన్న సీసాల్లో లభ్యమవుతుంటాయి. వీటిని కూడా ఇతరులతో పంచుకోకూడదు. అలా షేర్ చేసుకోవడం వల్ల వారు ఉపయోగించినప్పుడు వారి చేతుల్లో ఉండే హానికారక బ్యాక్టీరియా ఈ ఉత్పత్తుల్లోకి చేరుతుంది. అవి మనం వాడడం వల్ల మన చర్మానికి కూడా నష్టం వాటిల్లుతుంది.

**మేకప్ బ్రష్‌లు...** మేకప్ వేసుకోవడానికి ఉపయోగించే బ్రష్‌లను కూడా ఇతరులతో పంచుకోకూడదు. ఇతరులు వాటిని ఉపయోగించినప్పుడు వారి చర్మం మీద ఉండే బ్యాక్టీరియా, క్రిములు వంటివి మేకప్ ఉత్పత్తుల్లోకే కాదు. వాటిని తిరిగి మనం ఉపయోగించినప్పుడు మన చర్మం మీదకు కూడా చేరతాయి. కాబట్టి మేకప్ వేసుకోవడానికి ఉపయోగించే బ్రష్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడంతో పాటు ఇతరులతో పంచుకోకుండా ఉండడం మంచిది.



ఇవి కూడా.. లిక్విడ్ ఫౌండేషన్, లిక్విడ్ ఐ లైనర్, క్రీమ్ రూపంలో ఉండే ఉత్పత్తులు, నెయిల్‌పాలిష్, హెయిర్ బ్రష్‌లు, క్లెన్సింగ్‌కి ఉపయోగించే స్పాంజ్‌లు మేకప్ వేసుకోవడానికి వాడే పఫ్‌లు, ఐ లాష్ కర్లర్, ట్వీజర్స్, ప్లక్కర్స్, లిప్‌బామ్, స్నానానికి ఉపయోగించే ఉత్పత్తులు, సాధనాలు.. మొదలైనవన్నీ ఇతరులతో పంచుకోకుండా ఉండడం మంచిది.

# పిల్లలకు లెక్కలు సులభంగా..

కొంతమంది చిన్నారులు కొన్ని సబ్జెక్టుల్లో ముందుంటే లెక్కల్లో మాత్రం వెనకబడి ఉంటారు. మీ పిల్లల్లో



కూడా ఇదే తీరు కనిపిస్తే ఈ చిన్న చిట్కాలు పాటించండి. ఇవి ముందు వారిలో ఆ సబ్జెక్టుపై ఉంటే భయాన్ని పోగొడతాయి..

ఏ అంశాన్నైనా సరదాగా చేయిస్తే పిల్లలు సులభంగా గుర్తుంచుకుంటారు. లెక్కలను పాఠంలా కాకుండా ఒక ఆటలా నేర్పించాలి. అందుకే వారికి కార్డు గేమ్, సుడోకు, బోర్డు గేమ్‌లు, కలర్ చార్టు చూపిస్తూ చెప్పాలి. అప్పుడే వాటిపై ఆసక్తి పెరుగుతుంది. అంతేకాదు, ఆటలతో వారిలో నైపుణ్యాలు మెరుగుపడతాయి. లెక్కలపై ఆసక్తి పెరుగుతుంది నిజానికి మనం రోజూ చేసే పనుల్లోనే లెక్కలు దాగున్నాయని వారికి తెలిస్తే చాలు, ఉదాహరణగా కూరగాయలు కొనడం, తోటి పిల్లలకి ఎత్తూ, బరువులు కొలవడం నేర్పండి. వారికిచ్చే ప్యాకెట్ మనీని పిగ్గీ బ్యాంక్‌లో దాచుకుని ప్రతి నెలా ఎంత మొత్తం పెరిగిందో లెక్కేసి చెప్పమనండి. వారిలో పొదుపుపై అవగాహన కలగడమే కాదు. సులభంగా లెక్కలూ నేర్చు కుంటారు. ఏదైనా పని సాధనలోనే దాగుందనే రహస్యాన్ని చెప్పాలి, సులభమైన వర్క్‌లతో సాధన ప్రారంభించడం కష్టంగా ఉంటే పరిష్కరించేలా చూడాలి, అప్పుడే వాటిని, మరచిపోకుండా ఉంటారు చేసిన తప్పులు పునరావృతం కాకుండా ఉండేందుకు అర్థమయ్యేలా చెప్పండి. ఎంత చెప్పినా తప్పులు తెలియకుండా వాటిని వివరిస్తే తిరిగి ప్రయత్నించా లంటే ఉత్సుకత పెరుగుతుంది.

# బొమ్మలు వేయడానికి చిట్టి పెన్సిళ్లు

**అక్షరాలు రాకపోయినా పిల్లలు బొమ్మలు గీయడం, రంగులు వేయడం వంటివి ఎంచక్కా చేసేస్తారు.** ప్రీస్కూల్లోనే వీళ్లకి ఇవి పరిచయం అవుతున్నాయి. అంటే పెన్సిల్ ఎంతముఖ్యమో రంగు పెన్సిళ్లే, క్రేయాన్లూ అంతే అవసరమనేగా! మనమేమో. అరెరే ఎంత చక్కగా బొమ్మలు గీస్తున్నారో, ఎంత ముచ్చటగా రంగులద్దుతున్నారో' అని పెద్ద పెద్ద కలరింగ్ బాక్సులు కొని తెచ్చేస్తాం. వాళ్లేమో అన్నింటినీ కలగా



పులగం చేస్తారు. అంతటితో ఆగుతారా? ఎంత ఖర్చు పెట్టి కొన్నవైనా వాళ్లకి కొద్దిరోజుల్లోనే బోర్ కొట్టేస్తాయి. వాటిని విరిచేయడం, పడేయడం సరేసరి. ఇక్కడ రంగు లేకపోయినా మళ్లీ బాక్సు అంతా కొనాల్సిందే ఆ పాత వాటిని వేయడానికి మళ్లీ ఓ డబ్బా వెతకాలి. ఎందు కొచ్చిన శ్రమ ఇదంతా? పైగా డబ్బులూ వృథా వీటన్నింటికీ 'మినీ' ఉపాయం. ఏం లేదండీ.. కలర్ పెన్సిళ్లు, క్రేయాన్స్ చిట్టి సైజుల్లో దొరుకుతాయి. వాటిని తెచ్చేయండి. ఇవైతే చక్కగా డబ్బాల్లోనూ వస్తాయి. పనయ్యాక వాళ్లే దానిలో సర్దుకుంటారు. ఖర్చూ తక్కువే కాబట్టి, పోగొట్టినా, బోర్ కొట్టాయన్నా కొనడానికి మనకీ ఇబ్బంది అనిపించదు ఏమంటారు?



# మహాభారతం

**దేవతలంతా దేవేంద్రునితో**

అగ్నికుమారుడు చాలా పరాక్రమవంతుడు. నీ పదవి ఆక్రమించాలనే దురుద్దేశ్యముతో ఉన్నాడు. ముందు నువ్వే పోయి అతణ్ణి సంహరించు అన్నారు. వెంటనే సప్త మాతృకల్ని అగ్నిపుత్రుణ్ణి చంపటానికి పంపాడు. వారు అగ్నిపుత్రుణి తేజస్సుకు భయపడి శరణు వేడారు. ఆ బాలుడు వారికి అభయమిచ్చి పంపేశాడు. ఇంద్రుడే స్వయంగా దండెత్తాడు. కానీ చివరకు ఆయన కూడా అగ్నిపుత్రుణ్ణి (కుమారస్వామిని) శరణువేడాడు. ఋషులు, దేవతలు, ఇంద్ర పదవిని నువ్వే చేపట్టు అని అన్నారు. దేవేంద్రుడు కూడా దేవతలు కోరినట్టు నీవే ఇంద్రపదవిని చేపట్టు. నీవే అర్హుడవు, అన్నాడు అపుడు కుమారస్వామి ఇంద్రునితో, నీవే ఇంద్ర, పదవిలో కొనసాగు, నేను నీ శ్రేయోభిలాషిగా నీకు సాయపడుతాను, నీసైన్యాధిపతిగా వ్యవహరిస్తాను అన్నాడు. దేవతలందరి సమక్షంలో కుమారస్వామికి సర్వసైన్యాధ్యక్షుడిగా పట్టం కట్టాడు ఇంద్రుడు. ఇది కథ (పుటలు 359, 360. అరణ్యపర్వము పంచమాశ్వాసము శ్రీమదాంధ్ర మహాభారతము, రామకృష్ణ మఠం) నేటి రాజకీయనాయకులకు, సంస్థల్లో, సంఘాల్లో పదవుల కొరకుపాటుబడేవారికి కావాలసినంత నీతి లభిస్తుంది. భారతములోని ఈ చిన్న కథలో. కుమారస్వామి ఒక బాలుడు పదవిపై కాంక్ష ఎందుకుంటుంది? దేవతలు వెళ్లి దేవేంద్రునితో నీ పదవిని చేపట్టాలనే దురుద్దేశము కుమార స్వామికి ఉందని చెప్పారు. అలా చెప్పేవారు నేడు అన్నిట్లోనూ ఉన్నారు. జాగ్రత్తపడాలి అది నిజమా, కాదా అని విచారించక దేవేంద్రుడు కుమారస్వామిని అంతమొందించాలని పోయి అవమానాల పాలయ్యాడు. అదే దేవతలే మళ్లీ ఇంద్రుని ఎదుటే కుమారస్వామితో, నీవే ఇంద్రపదవి చేపట్టు అన్నారు. అచ్చం అలాగే ఉంటారు. నేడు ఎంతో మంది తప్పని పరిస్థితుల్లో, ఔను, వారు చెబుతున్నది సరైనదే, నీవే ఇంద్రపదవి చేపట్టు అన్నాడు ఇంద్రుడు కూమారస్వామితో. అప్పుడు కుమారస్వామి, పదవిలో నీవే ఉండు, నేను నీకు తోడ్పడుతాను. అన్నాడు. ఎంత బాగుంది నేడు సేవా సంస్థల్లో కూడా పదవులకు పోటీపడుతున్నారు. పదవిలో ఉండటానికి ఎవరు ముందుకు వచ్చినా వారికి పదవినిచ్చి కేవలం సేవలో ఇతరులు నిమగ్నం కావాలి.

**- రాచమడుగు శ్రీనివాసులు**

ఆధ్యాత్మికం

# డైటింగులు అవసరం లేదు

**అందానికి ప్రాధాన్యం ఇచ్చేవారిలో అమ్మాయిలే ముందుంటారు కదా!** దానికోసం చేయని డైటింగులు, శారీరక వ్యాయామాలుండవు. అంతేకాదు, వారు బరువు పెరగకుండా ఉండేందుకు ఆహారాన్ని చాలవరకు పరిమితం చేసుకుంటారు. ఎంత బరువు తగ్గినా ఇంకా పెరిగిపోతున్నామనే భయం వీరిని వెంటాడుతుందట. దీనివల్ల తరవాత వారికి తినాలని ఆసక్తి కొద్దీ తిన్నా పొట్ట కుంచించుకుపోయి, ఆహారం కాస్త ఎక్కువైనా వాంతులు అవుతుంటాయి. నెమ్మదిగా ఇదే వ్యాధిలా కూడా మారుతుంది. దీనినే



అనోరెక్సియా అంటారు. ఈ లక్షణం ఉన్నవారు ఎంత బరువు తగ్గినా ఇంకా పెరిగిపోతున్నామనే భయం వీరిని వెంటాడుతుందట. అయితే ఈ లక్షణాలు, టీనేజీ అమ్మాయిల్లోనూ, ముప్పైల్లోపు స్త్రీలలోనూ ఎక్కువగా కనిపిస్తుంది. దీనివల్ల పోషకాహారలోపానికి గురవ్వడమే కాకుండా, మెదడు, గుండె, మూత్రపిండాలతో సహా శరీరంలో ప్రతి అవయవం దెబ్బతినే ప్రమాదం ఉందట. దీనిని అదుపు చేయాలంటే మాత్రం వైద్యుల్ని సంప్రదించి ఆహార నియమాల్లో మార్పులు తప్పనిసరి అంటున్నారు నిపుణులు. కాబట్టి అమ్మాయిలు ముందు మనం ఆరోగ్యంగా ఉంటేనే ఎన్ని జాగ్రత్తలు అయినా పాటించవచ్చు.

యూరప్ పర్యటనలో..

# భారత్ హాకీ జట్టు విక్టరీ

## ఐర్లాండ్‌పై 6-1 తేడాతో విజయం



**న్యూఢిల్లీ:** భారత పురుషుల హాకీ జట్టు హాకీ క్లబ్ ఆరంజేరూడ్‌లో ఐర్లాండ్‌పై 6-1 తేడాతో ఆధిపత్య విజయంతో తమ యూరప్ పర్యటనను ప్రారంభించింది. కనీసం ఒక్క అడుగు కూడా తప్పు చేయకుండా నాలుగు క్వార్టర్లలో భారత్ పూర్తి ప్రదర్శన కనబరిచింది. ఉత్తమ్ సింగ్ పురుషుల జట్టుకు గోల్ చేయడం ప్రారంభించగా, తరువాత అమన్‌దీప్ లక్రా జట్టు ఆధిక్యాన్ని పెంచాడు. దీని తర్వాత ఆదిత్య లాలేజ్ వరుసగా గోల్స్ చేయడంతో అద్భుతమైన బ్రేస్‌ను సాధించాడు. ఫార్వర్డ్ ఆటగాళ్లు సెల్వం కార్తీ మరియు బాబీ సింగ్ ధామి కూడా ఒక్కొక్క గోల్ చేసి స్కోరు షీట్‌లో చోటు సంపాదించారు. భారత్ తమ డిఫెండింగ్‌లో పటిష్టంగా ఉండటంతో ఐర్లాండ్ ఒక ఓదార్పు గోల్ మాత్రమే చేయగలిగింది. కాగా యూరప్ పర్యటనలో ఐర్లాండ్ తర్వాత భారత్ తదుపరి ఫ్రాన్స్, ఇంగ్లాండ్, బెల్జియం మరియు ఆతిథ్య నెదర్లాండ్స్‌తో తదుపరి రెండు వారాల పాటు ఆడుతుంది. ఈ పర్యటనతో, హాకీ ఇండియా భారత పురుషుల జాతీయ జట్టు కోసం ప్రతిభ సమూహాన్ని బలోపేతం చేయడం మరియు తదుపరి తరం భారత హాకీ స్టార్‌లకు అంతర్జాతీయ మ్యాచ్ సమయాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుంది.

యుఎస్ స్మాష్ టేబుల్ టెన్నిస్‌లో..

# క్వార్టర్ ఫైనల్స్‌కు మానవ్-మనుష్

## సింగిల్స్‌లో శ్రీజ, సత్యన్ నిష్క్రమణ




**న్యూఢిల్లీ:** యుఎస్ స్మాష్ 2025 ప్రారంభ ఎడిషన్‌లో భారత నంబర్ 1 పురుషుల డబుల్స్ జోడీ మానవ్ ఠక్కర్ మరియు మనుష్ షా క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. అమెరికాలోని లాస్ వెగాస్‌లోని ఓర్లీన్స్ అరీనాలో జరిగిన ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో క్రొయేషియాకు చెందిన టోమిస్లావ్ పుకార్ మరియు స్లోవేనియాకు చెందిన లుబోమిర్ పిస్తేజ్ మిక్స్‌డ్ జోడీపై భారత ద్వయం 4గేమ్‌ల (12-14, 11-9, 11-8, 11-7) తేడాతో విజయం సాధించింది. వారు ఇప్పుడు క్వార్టర్ ఫైనల్స్‌లో నాల్గవ సీడ్ దక్షిణ కొరియా జంట లిమ్ జోంగ్‌హూన్ మరియు అన్ జేహ్యున్‌తో తలపడనున్నారు. కాగా డబ్ల్యూటీటీ గ్రాండ్ స్మాష్ ఈవెంట్‌లో తమ తొలి సెమీఫైనల్ ప్రదర్శనను భారత్ జోడీ లక్ష్యంగా పెట్టుకుంది. తదుపరి దియా చిటాలేతో జతకట్టిన మనుష్, ప్రపంచ పతక విజేత హాంకాంగ్ జంట వాంగ్ చున్ టింగ్-దూ హోయ్ కెమ్ చేతిలో తీవ్రంగా పోరాడిన ఐదు గేమ్‌ల (3-11, 7-11, 11-5, 11-4, 7-11) మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఓడిపోయారు. రెండు ఆటలలో వెనుకబడిన భారత జంట అద్భుతమైన పునరాగమనం చేసి నిర్ణయాత్మక జట్టును నిలబెట్టింది. కానీ చివరికి, అనుభవజ్ఞులైన హాంకాంగ్ జంట చివరి ఆటలో వ్యూహాత్మక విజయంతో భారతీయులను అధిగమించింది. ఇక రెండో రౌండ్‌లో ముగిసిన భారత సింగిల్స్ ప్రచారం పురుషుల సింగిల్స్‌లో సత్యన్ జ్ఞానశేఖరన్ మరియు మహిళల సింగిల్స్‌లో శ్రీజ అకుల ఇద్దరూ తమ తమ మ్యాచ్‌ల్లో ఓడిపోవడంతో భారత సింగిల్స్ ప్రచారం రెండో రౌండ్‌లో ముగిసింది. సాథియాన్ తొలి గేమ్ గెలిచినప్పటికీ, నాలుగు గేమ్‌లలో చైనాకు చెందిన పెంగ్ జియాంగ్ చేతిలో ఓడిపోయింది, శ్రీజ తన వరుస గేమ్ రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌అప్‌లో జపాన్ ప్యాడ్లర్ హునోకా హషిమోటో చేతిలో ఓడిపోయింది.

మహిళల తొలి టి20లో..

# భారత్ సూపర్ విక్టరీ




## ఇంగ్లండ్‌పై 6 వికెట్ల తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** తొలి టీ20 సిరీస్‌లో ఇంగ్లండ్‌పై భారత మహిళలువిజయాన్ని నమోదు చేశారు. మాంచెస్టర్‌లో జరిగిన ఐదు మ్యాచ్‌ల నాల్గవ టీ20 సిరీస్‌లో ఇంగ్లాండ్‌పై 6 వికెట్ల తేడాతో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. ఇంగ్లండ్‌పై 3-1 తేడాతో భారత మహిళా క్రికెట్ జట్టు టీ20లో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. ఈ సిరీస్‌లో ఇంకా ఒక ఆట మిగిలి ఉండగానే ఈ విజయం సాధించింది. దాదాపు రెండు దశాబ్దాల టీ20 క్రికెట్ ప్రయాణంలో ఈ విజయం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇక ఈ సిరీస్ అంతటా భారత స్పిన్నర్లు తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు, ఇంగ్లాండ్‌ను 126 పరుగులకే పరిమితం చేశారు. ఆ తర్వాత భారత బ్యాటర్లు కేవలం 17 ఓవర్లలోనే 4 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించారు. ఆతిథ్య జట్టు టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. ఇంగ్లీష్ ఓపెనర్ సోఫియా డంక్లీ ప్రారంభంలోనే రెండు బౌండరీలతో భారత్‌పై ఒత్తిడి పెంచడం ప్రారంభించింది. కానీ ఆరో ఓవర్‌లో స్టార్ ఇండియన్ బౌలర్ దీప్తి శర్మ ఆమె ఇన్నింగ్స్‌ను తగ్గించింది. రెండు వికెట్లు త్వరగా కోల్పోయిన తర్వాత, కెప్టెన్ టామీ బ్యూమాంట్ మరియు ఆలిస్ కాప్సే భాగస్వామ్యాన్ని నిర్మించడం మరియు ఆట వేగాన్ని నియంత్రించడం ప్రారంభించారు. అయితే, భారత స్పిన్నర్లు వారి ప్రయత్నాలకు అడ్డుకట్ట వేశారు. 11వ ఓవర్లో వారి భాగస్వామ్యానికి చెక్ పెట్టి 17వ ఓవర్లో 7 వికెట్లకు 101 పరుగులకు అకస్మాత్తుగా పతనానికి కారణమయ్యారు. ఆల్ రౌండర్లు సోఫీ ఎక్లెస్టోన్ మరియు ఇస్సీ వాంగ్ ఏదో ఒకవిధంగా ఇంగ్లాండ్‌ను గౌరవప్రదమైన స్కోరుకు తీసుకెళ్లగలిగారు. ఇచ్చిన 20 ఓవర్లలో 126 పరుగులు చేశారు. 127 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత ఓపెనర్లు షఫాలీ వర్మ (31), స్మృతి మంధాన (32) 56 పరుగుల భాగస్వామ్యంతో బలమైన ఆరంభాన్ని అందించారు. తరువాతి 15 పరుగులలోపు ఇద్దరు ఓపెనర్లు వెనుదిరిగినప్పటికీ, వారు జెమిమా రోడ్రిగ్స్ మరియు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు గట్టి పునాది వేశారు, వారు రెండు వికెట్లు ఆలస్యంగా కోల్పోయినప్పటికీ భారతదేశాన్ని విజయపథంలో నడిపించారు. ఇక ఈ నెల 12న జరిగే టీ20 సిరీస్‌లోని చివరి మ్యాచ్ కోసం భారత జట్టు బర్మింగ్‌హామ్‌కు బయలుదేరింది.



## ఆర్చరీ ప్రపంచ కప్ ఫైనల్స్‌కు


# భారత్ మహిళల జట్టు

### క్వార్టర్ ఫైనల్స్‌లో పురుషుల టీం ఔట్

**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్-2025 టోర్నమెంట్‌లో భారత మహిళల కాంపౌండ్ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. అంటాల్యలో నిరాశపరిచిన ప్రపంచ కప్ తర్వాత భారత కాంపౌండ్ ఆర్చర్లు తిరిగి ఫామ్‌లోకి వచ్చారు, స్పెయిన్‌లో జరిగిన మాడ్రిడ్ ఆర్చరీ ప్రపంచ కప్‌లో మహిళల జట్టు బంగారు పతక మ్యాచ్‌కు చేరుకున్నారు. జ్యోతి సురేఖ వెన్నం, ప్రితికా ప్రదీప్, పర్నీత్ కౌర్‌లతో కూడిన భారత త్రయం సెమీఫైనల్లో ఇండోనేషియాను 230-226 తేడాతో ఓడించి, ప్రపంచ కప్ సర్క్యూట్‌లో ఈ సీజన్‌లో రెండవ ఫైనల్ ప్రవేశాన్ని నిర్ధారించుకుంది. అంతకుముందు, భారత్ ర్యాంకింగ్ రౌండ్‌లో అద్భుతమైన 2116 పాయింట్లను నమోదు చేసి చార్టులలో అగ్రస్థానంలో నిలిచింది. ఇక మొదటి రౌండ్ ఎలిమినేషన్లలో బైను పొందింది. ఆ తర్వాత, క్వార్టర్ ఫైనల్స్‌లో తమ ప్రచారాన్ని ప్రారంభించిన ఈ బృందం 235-226 విజయంతో ఎల్ సాల్వడార్‌పై ఆధిపత్యం చెలాయించారు. కాగా భారత పురుషుల కాంపౌండ్ జట్టు వరుసగా రెండోసారి ప్రపంచ కప్ పతకాన్ని కోల్పోయింది, క్వార్టర్ ఫైనల్‌లో ఫ్రాన్స్ చేతిలో 233-234 స్కోరు చేసి ఒక్క పాయింట్ తేడాతో ఓడిపోయింది.

# వింబుల్డన్‌లో స్వియాటెక్ విజయం

**న్యూఢిల్లీ:** వింబుల్డన్-2025లో ఇగా స్వియాటెక్ వరుస విజయాలతో దూసుకుపోతోంది. ప్రపంచ 8వ సీడ్ క్రీడాకారిణి లియుడ్మిలా సామ్సోనోవాను 6-2, 7-5 తేడాతో ఓడించి తన కెరీర్‌లో తొలిసారిగా వింబుల్డన్ సెమీఫైనల్లో తన స్థానాన్ని బుక్ చేసుకుంది. ఐదుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ అయిన సామ్సోనోవాపై కమాండింగ్ ప్రదర్శనను ప్రదర్శించింది. ఆమె తొలిసారి మేజర్ క్వార్టర్ ఫైనలిస్ట్ అయిన సామ్సోనోవాపై ఆడింది.



19వ సీడ్ రష్యన్ క్రీడాకారిణిపై వరుసగా ఐదవ విజయాన్ని నమోదు చేయడానికి స్వియాటెక్ 1 గంటా 49 నిమిషాలు పట్టింది. డబ్ల్యూటీఏ ప్రకారం ఆమె అజేయమైన హెడ్ టు హెడ్ రికార్డును 50కి పెంచుకుంది. ప్రపంచ నంబర్ 1గా మొత్తం 125 వారాలు గడిపిన స్వియాటెక్, ఇప్పుడు నాలుగు గ్రాండ్ స్లామ్‌లలోనూ సెమీఫైనల్‌కు చేరుకున్న నాల్గవ క్రియాశీల క్రీడాకారిణిగా నిలిచింది. అరినా సబలెంకా, విక్టోరియా అజరెంకా, కరోలినా ప్లిస్కోవా తర్వాతి స్థానంలో నిలిచింది. అలాగే 23 ఏళ్ల పోల్ ఈ సంవత్సరం 8-1 తేడాతో ఫైనల్ చేరుకుంది. ఈ సంవత్సరం, ఆమె రెండు వారాల క్రితం బాడ్ హోంబర్గ్‌లో జరిగిన తన మొట్టమొదటి గ్రాస్‌కోర్ట్ ఫైనల్‌కు చేరుకుంది. జెస్సికా పెగులాతో రన్నరప్‌గా నిలిచింది. తొలి గేమ్‌లో బ్రేక్ పాయింట్‌ను సేవ్ చేసుకుని, మొదటి సెట్‌ను ఆధిపత్యం చేయడంతో పాటు స్వియాటెక్ బలంగా ప్రారంభమైంది. ఆమె తన ఫస్ట్ సర్వ్ పాయింట్లన్నింటినీ గెలుచుకుంది. రెండుసార్లు సామ్సోనోవాను బ్రేక్ చేసి 6-2తో కైవసం చేసుకుంది. రెండవ సెట్‌లో, స్వియాటెక్ 6-2, 4-2, 40-0తో ఆధిక్యంలో ఉంది, కానీ సామ్సోనోవా ఆలస్యంగా పునరాగమనం చేసి 5-5తో సమం చేసింది. కానీ స్వియాటెక్ తిరిగి 5-5తో సర్వ్ చేస్తూ, ఆమె 0-30తో వెనుకబడినప్పటి నుండి దృఢంగా నిలిచింది, తర్వాత తదుపరి గేమ్‌లో సామ్సోనోవాను ఓడించి విజయాన్ని సాధించింది. ప్రపంచ నంబర్ 1 అరినా సబలెంకా జర్మనీకి చెందిన లారా సీజ్‌మండ్ నుండి బలమైన సవాలును ఎదుర్కొని మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో చోటు దక్కించుకుంది. మరో మ్యాచ్‌లో, క్వార్టర్ ఫైనల్ పోరులో అనస్తాసియా పావ్లియుచెంకోవాను 6-1, 7-6(9) తేడాతో ఓడించి చివరినాలుగు దశలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది.

# వాణిజ్యం

# టాటా కన్సల్టెన్సీ నికర లాభం రూ.12,760కోట్లు

**ముంబై, జులై 10:** ఐటీ దిగ్గజం టిసిఎస్ 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం ఫలితాలను గురువారం ప్రకటించింది. ఏకీకృత నికర లాభంలో 6 శాతం పెరిగి కంపెనీ నికర లాభం 12,760 కోట్లుగా నమోదైంది. గతేడాదితో పోలిస్తే, ఏకీకృత నికర లాభం 4.4 శాతం పెరిగింది. కార్యకలాపాల నుండి ఏకీకృత ఆదాయం వార్షిక ప్రాతిపదికన (సంవత్సరానికి) 1.3 శాతం స్వల్పంగా పెరిగి 63,437 కోట్లకు చేరింది. గత యేడాది ఇదే కాలంతో పోలిస్తే, 64,479 కోట్ల నుండి 1.6 శాతం తగ్గింది. మార్కెట్ నిపుణులు రూ.64,342.93 కోట్లుగా అంచనా వేశారు. ఒక రూపాయి ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేరుకు 11 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. చెల్లింపుకు అర్హత కలిగిన వాటాదారులను నిర్ణయించడానికి కంపెనీ జూలై 16, 2025ని రికార్డు తేదీగా నిర్ణయించింది. విభాగాల వారీగా, ఇంధనం, వనరులు మరియు యుటిలిటీలు స్థిరమైన కరెన్సీలో 2.8 శాతంతో సంవత్సరానికి అత్యధిక వృద్ధిని నమోదు చేశాయి, తరువాత సాంకేతికత మరియు సేవలు 1.8 శాతం వృద్ధిని నమోదు చేశాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగం 1.0 శాతం స్వల్ప పెరుగుదలతో స్థిరంగా ఉంది. దీనికి విరుద్ధంగా, లైఫ్ సైన్సెస్ మరియు హెల్త్‌కేర్ మరియు కమ్యూనికేషన్ మరియు మీడియా రెండూ ఒక్కొక్కటి 9.6 శాతం పదునైన క్షీణతను చవిచూశాయి.




# సెకండాఫ్‌లో ఐపిఓల సందడి..

**ముంబై, జులై 10:** ప్రైమరీ మార్కెట్‌లో ఈ యేడాది ఇప్పటి వరకు ఐపిఒల సందడి పెద్దగా లేదనే చెప్పాలి. మార్కెట్ ఒడుదుడుకుల కారణంగా ఈ కేలండర్ ఇయర్‌లో తొలి అర్ధభాగంలో పరిమిత సంఖ్యలోనే కంపెనీలు పబ్లిక్‌ఇష్యూకు వచ్చాయి. అందులోనూ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకుకు చెందిన హెచ్‌డిబి ఫైనాన్షియల్ రూ.12,599కోట్ల ఐపిఒ మినహా చెప్పుకోదగ్గవి ఏవీ మార్కెట్లోకి రాలేదు. ఈ యేడాది ద్వితీయార్థంలో మాత్రం పెద్ద పెద్ద కంపెనీలు ఎంట్రీ ఇవ్వనున్నాయి. మొత్తంగా 50కిపైగా కంపెనీలు సుమారు రూ.1.50 లక్షల కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనున్నాయని జెఫ్రీస్ ఫైనాన్షియల్ గ్రూప్ అంచనా వేస్తోంది. సెకండాఫ్‌లో రానున్న ఐపిఒల జాబితాలో టాటా కేపిటల్ లిమిటెడ్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్, ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియా, మీషో, గ్రో ఇన్వెస్ట్‌మెంట్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్, లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. ఈ యేడాది తొలి అర్ధభాగంలో కేవలం




24 ఐపిఒలు మాత్రమే ఐపిఒకు వచ్చాయి. అంతకు ముందు యేడాది ఇదే సమయంలో 91 సంస్థలు పబ్లిక్ ఇష్యూకు రావడం విశేషం. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, ఆర్‌బిఐ వడ్డీరేట్ల తగ్గింపు వంటివి మార్కెట్‌లో కొత్త ఉత్సాహానికి కారణమని జెఫ్రీస్ పేర్కొంది. టాటా గ్రూప్‌నకు చెందిన టాటా కేపిటల్ ఈ యేడాది చివరికి ఐపిఒకు రావొచ్చు. మార్కెట్ నుంచి దాదాపు రూ.17,200 కోట్లు సమీకరించనుందని అంచనా. దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియా కూడా రూ.15వేల కోట్లు సమీకరించేందుకు పబ్లిక్ ఇష్యూకు రానుంది. ప్రమోటర్లు తమ వాటాలను విక్రయించనున్నారు. కళ్లజోళ్ల తయారీ సంస్థ లెన్స్‌కార్ట్ కూడా సుమారు రూ.8,600 కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనుంది. ఇవికాకుండా హీరో ఫిన్‌కార్ప్ రూ.3,408 కోట్లు, జెఎస్‌డబ్ల్యూ సిమెంట్ రూ.4వేల కోట్లు, ఎన్‌ఎస్‌డిఎల్ రూ.3,421 కోట్లు సమీకరించేందుకు ఐపిఒకు వచ్చేందుకు సన్నద్ధమవుతున్నాయి.


# మరోసారి ఎల్‌ఐసిలో వాటాల విక్రయం




**న్యూఢిల్లీ, జులై 10:** ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసి) కేంద్ర ప్రభుత్వం మరోసారి తన వాటాను విక్రయించనుంది. పెట్టుబడుల ఉపసంహరణ విభాగం దీనిపై పనిచేస్తోందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఎల్‌ఐసిలో కేంద్రానికి ప్రస్తుతం 96.5శాతం వాటా ఉంది. 2022 మే నెలలో ఐపిఒలో భాగంగా 3.5శాతం వాటాను కేంద్రం విక్రయించింది. ఒక్కో షేరుకు ధరల శ్రేణిని రూ.902-949గా పేర్కొంది. తద్వారా రూ.21వేల కోట్లు ఖజానాకు సమకూరాయి. ఈ నేపథ్యంలో ఎల్‌ఐసిలో ఆఫర్ ఫర్ సేల్ రూపంలో తదుపరి వాటా విక్రయానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కూడా పేర్కొన్నాయి. ప్రస్తుతానికి ఈ చర్చలు ఇంకా ప్రారంభ దశలో ఉన్నాయని తెలిసింది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వాటా విక్రయ ప్రక్రియను పెట్టుబడుల ఉపసంహరణ విభాగం పూర్తి చేయనుంది. 2027 మార్చి 16 నాటికి పబ్లిక్ షేర్ హోల్డింగ్‌ను 10శాతం ఉండాలన్న నిబంధనను చేరుకోవడంలో భాగంగా మరో 6.5శాతం వాటాను కేంద్రం విక్రయించాల్సి ఉంటుంది. అయితే ఎంత మేర వాటా విక్రయిస్తారు? ఎంత ధరకు విక్రయిస్తారు? ఎప్పుడు విక్రయిస్తారు? అనేవివరాలు కూడా తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఎల్‌ఐసి మార్కెట్ విలువ రూ.5.85 లక్షల కోట్లుగా ఉంది.


# వందేళ్లయినా ఎఐ ఈ పని చేయలేదు: బిల్‌గేట్స్ ఆసక్తికర వ్యాఖ్యలు

**వాషింగ్టన్, జులై 10:** కృత్రిమ మేధతో ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతూనే ఉంది. అయితే వాటివల్ల కొత్త ఉపాధి అవకాశాలు లేకపోలేదనేది నిపుణుల మాట. ఈ అంశంపై తాజాగా మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే 100 యేళ్లయినా ప్రోగ్రామర్లను ఎఐ భర్తీ చేయలేదని అన్నారు. ఇక కోడింగ్‌కు కూడా మానవ మేధ అవసరమని అభిప్రాయపడ్డారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రోగ్రామింగ్ రంగంలో ఎఐ మనకు అసిస్టెంట్‌గా వ్యవహరిస్తుంది. డీబగ్గింగ్ లాంటి బోరింగ్ అంశాల్లో సాయం చేస్తుంది. అంతేగానీ, పూర్తిగా ప్రత్యామ్నాయంగా మారదు. ప్రోగ్రామింగ్‌లో అత్యంత సవాల్‌తో కూడుకున్నది ఏంటంటే, క్లిష్టమైన సమస్యను సృజనాత్మకంగా పరిష్కరించడం. దాన్ని మెషిన్స్ చేయలేవు. ప్రోగ్రామింగ్‌కు జడ్జిమెంట్, ఊహాత్మక ఆలోచనా ధోరణి, పరిస్థితులకు అనుకూలంగా సర్దుబాటు అవసరం. ఈ లక్షణాలు ఎఐలో లోపించాయి అని బిల్‌గేట్స్ అన్నారు. ఇక కోడింగ్ రాయడమంటే కేవలం టైపింగ్ చేయడం కాదు. చాలా లోతుగా ఆలోచించాల్సి ఉంటుందని బిల్‌గేట్స్ తెలిపారు. మానవ మేధకు ఉండే సృజనాత్మకతకు ఏ అల్గారిథమ్ సరిపోదు అని అభిప్రాయపడ్డారు. గతంలోనూ బిల్‌గేట్స్ ముప్పు తక్కువేనని ఆయన అంచనా వేశారు. సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, సృజనాత్మకత, పరిస్థితులకు తగ్గట్టుఆ సామర్థ్యాన్ని మెరుగుపర్చుకొనే లక్షణాన్ని ఎఐ ఇంకా సొంతం చేసుకోలేకపోవడమే ఇందుకు కారణమని నాడు చెప్పారు. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 8.5 కోట్ల ఉద్యోగాలను ఎఐ భర్తీ చేసే అవకాశం ఉందని ఇటీవల వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ అంచనా వేసింది. అదే సమయంలో 9.7 కోట్ల కొత్త ఉద్యోగాల సృష్టి జరగొచ్చని ఆశాభావం వ్యక్తం చేసింది. దీనిపైనా గేట్స్‌స్పందిస్తూ, ఎఐ వల్ల పొంచి ఉన్న ముప్పు గురించి తానూ ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు.



# నష్టాలను వీడని స్టాక్ సూచీలు

**ముంబై, జులై 10:** దేశీయ స్టాక్‌మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిసాయి. భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై సందిగ్ధత, మొదటి త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు. భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డిఎఫ్‌సి వంటి షేర్లు సూచీలపై ప్రభావం చూపాయి. దీంతో సూచీలు వరుసగా రెండోరోజూ నష్టాల్లో ముగిసాయి. ఉదయం 83,658.20 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైన కాసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ ఇంట్రాడేలో 83,134.97 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరింది. చివరికి 345.80 పాయింట్లు నష్టపోయి 83,190.28 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 120.85 పాయింట్లు క్షీణించి 25,355.25 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.85.67గా ఉంది. భారతీ ఎయిర్‌టెల్, ఏసియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, బిఇఎల్, టెక్ మహీంద్రా షేర్లు అమ్మకాలతో నష్టాల్లో ముగిసాయి. మారుతి సుజుకీ, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ట్రెంట్ షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 69.44 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3,331 డాలర్ల వద్ద కొనసాగింది.



# 'మెటా'లో పనిచేయడం.. కేన్సర్ కంటే ప్రమాదం..

**వాషింగ్టన్, జులై 10:** ప్రముఖ టెక్ కంపెనీ మెటా సూపర్ ఇంటలిజెన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు ముమ్మరంగా ముందుకు సాగుతున్న తరుణంలో కంపెనీ మాజీ ఉద్యోగి చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారుతున్నాయి. కంపెనీలో ఉద్యోగం మానేసి బయటకు వస్తున్న సమయంలో అంతర్గతంగా ఆ ఉద్యోగి ఇ-మెయిల్ పంపించాడు. దీనిలో కంపెనీ కృత్రిమమేధ విభాగం గురించి తీవ్రమైన ఆందోళనలు లేవనెత్తారు. ది ఇన్ఫర్మేషన్‌లో టిజ్మెన్ బ్లాంకెవర్ట్ రాసిన కథనంలో మెటాలోని సంస్కృతిని సంస్థ అంతటా వ్యాపిస్తున్న 'మెటాస్టాటిక్ కేన్సర్'తో పోల్చాడు. మెటా ఎల్‌ఎల్‌ఎంఎ మోడళ్లపై పనిచేసే బృందంలక్ష బ్లాంకెవర్ట్ కూడా కొంత కాలం పనిచేశాడు. ఉద్యోగం నుంచి నిష్క్రమించే ముందు అతడు మెటా నాయకత్వాన్ని, అక్కడి పని విధానాన్ని విమర్శిస్తూ ఒక సుదీర్ఘ లేఖ రాశాడు. 'మెటాలో పని చేస్తున్నన్ని




రోజులు చాలా మంది ఉద్యోగులు ఎంతో నష్టపోయారు. అక్కడ భయంతో కూడిన సంస్కృతి ఉంది. తరచుగా పనితీరు సమీక్షలు, తొలగింపులు ఉద్యోగుల నైతిక స్థైర్యాన్ని, సృజనాత్మకతను దెబ్బతీశాయి. ప్రస్తుతం 2వేల మందికి పైగా బలంగా ఉన్న ఎఐ విభాగానికి దిశా నిర్దేశం కొరవడింది. చాలా మందికి మెటాలో పని చేయడం ఇష్టం లేదు. తమ మిషన్ ఏమిటో కూడా వారికి తెలియదు. పదే పదే అంతర్గత విభేదాలు, అస్పష్టమైన లక్ష్యాలు నిర్దేశిస్తారు. ఇది జట్టు నూతన ఆవిష్కరణల సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది. దీంతో పనిచేయక పోవడం మాత్రమే కాదు, మెటాస్టాటిక్ కేన్సర్‌లా ఇది సంస్థను ప్రభావితం చేస్తుంది' అని ఆయన అన్నారు. ఓపెన్ ఎఐ, గూగుల్ డీప్‌మైండ్ వంటి ప్రత్యర్థులను ఎదుర్కొనేందుకు మెటా తన ఎఐ కార్యకలాపాలను దూకుడుగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఆయన విమర్శలు గుప్పించారు. ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఎజిఐ) నిర్మాణంపై దృష్టిసారించే సూపర్ ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ అనే కొత్త విభాగాన్ని కంపెనీ ఇటీవల సృష్టించింది. మెటా పరిశ్రమ అంతటా అగ్రశ్రేణి ప్రతిభావంతులను నియమించుకుంటోంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.